ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 4, నవంబరు 2024

నాట్య మయూరాలు



కార్తీక వన సమారాధనలు మొదలయ్యాయి. వివిధ కుల సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని పలుచోట్ల ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువత చేసిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

- ఒంగోలు కల్చరల్

సంక్షేమం ఓకే.. అభివృద్ధి కావాలి

జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగుకు ఉపకరించే కీలక పథకాలు, ప్రాజెక్టులపై ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది. సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి కరువైంది. పారిశ్రామిక రంగం పడకేసింది. విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఉదాసీనత కన్పించింది. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయంతో నడిపించడంతోపాటు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి మధ్య వారధిలా పనిచేయాల్సిన నాటి ఇన్‌చార్జి మంత్రులు నామమాత్రంగా మిగిలారు. ఇక వారి పర్యవేక్షణలో నిర్వహించే కీలకమైన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశాలు మొక్కుబడిగా మారాయి. ఈనేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలకు ఉపశమనం కల్పించింది. జిల్లా శాశ్వత అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలు మాత్రం ముందుకు కదలడం లేదు. వాటికి నిధుల సమస్య ప్రతిబంధకంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక తొలి డీఆర్సీ సమావేశం సోమవారం జరగనుంది. అందులో అభివృద్ధి అంశాలు, నిధుల అవసరం, తక్షణ సమస్యల పరిష్కారంపై చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.



వెలిగొండ టన్నెల్ ముఖద్వారం

వైసీపీ పాలనలో జిల్లాపై నిర్లక్ష్యం

నేడు ఆనం నేతృత్వంలో జిల్లాస్థాయి సమీక్ష

- సమస్యలతో ప్రజలు సతమతం
- పురోగతి లేని ప్రాజెక్టులు
- మెరుగు పడని ఉపాధి అవకాశాలు
- నామమాత్రంగా వ్యవహరించిన
- నాటి ఇన్‌చార్జి మంత్రులు
- డీఆర్సీ నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ దృష్టి

దొనకొండ కారిడార్ ప్రాంతం



ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలక ప్రాజెక్టులు, మౌలిక రంగాల అభివృద్ధి గత వైసీపీ పాలనలో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. ప్రజలు సవాలక్ష సమస్యలతో అల్లాడిపోయారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన నాటి పాలకులు పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. అత్యంత ప్రధానమైన డీఆర్సీ సమావేశాలు కూడా మొక్కుబడిగా మారాయి. గడచిన ఐదేళ్లలో జిల్లాకు నలుగురు ఇన్‌చార్జి మంత్రులు నియమితులయ్యారు. తొలి ఇద్దరూ ఒక్క సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయకుండానే మారిపోయారు. అనంతరం వచ్చిన ఇద్దరిలో విశ్వరూప్ అడపాదడపా నిర్వహించినా ఎక్కువ కాలం కొవిడ్‌తోనే సరిపోయింది. ఆతర్వాత నియమితులైన మేరుగ నాగార్జున మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. పర్యవేక్షణలో నామమాత్రంగానే మిగిలారు.

అభివృద్ధి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అటు రాష్ట్రస్థాయిలో, ఇటు జిల్లాలో ఎక్కడికక్కడ అభివృద్ధి అంశాలు, పాలన మెరుగుపై దృష్టి సారించింది. ఈవ్యవహారాలలో అత్యంత కీలకంగా పనిచేసే జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. వారంతా తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటనలు ప్రారంభించారు. సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి కూడా జిల్లాపై దృష్టి పెట్టారు. పొరుగున ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన రామనారాయణరెడ్డి సీనియర్ నేత. మన జిల్లాలోని ఆర్థిక, సామాజిక అంశాలతోపాటు రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉంది. ఆయన అనుభవం, అవగాహన జిల్లా అభివృద్ధి, పాలన వ్యవహారాలలో లోటుపాట్ల సవరణకు ఉపకరించనుంది.

గాడిలో పాలన, పథకాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు అందుతోంది. ప్రధానంగా పింఛన్లను పెంచింది. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. రేషన్ పంపిణీ, ఉద్యోగుల జీతాలు, సామాజిక పింఛన్లను సకాలంలో అందిస్తోంది. ఇతర వర్గాలకు చెందిన పథకాల్లోనూ కదలికవచ్చి క్రమపద్ధతిలో సాగుతున్నాయి. అధికారుల బదిలీల్లో మెజారిటీ పూర్తితో కొంత మేర పాలన గాడిలో

ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే

జిల్లాకు గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసి శంకుస్థాపనలు చేసిన ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీల నిర్మాణాలకు వైసీపీ పాలనలో ఒక్క ఇటుక కూడా పెట్టినపాపాన పోలేదు. అలాగే పారిశ్రామిక ప్రగతికి ఉపకరించే దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్ వంటి వాటి ఊసే కరువైంది. మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాల గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాల్లో కదలిక లేదు. ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇలాంటి అభివృద్ధి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

మిగతా 6లో...



మద్దిరాలపాడు వద్ద బీటలు వారిన హైవే

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం

- ముగిసిన కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు
- అస్తవ్యస్తంగా 216 నంబరు జాతీయ రహదారి
- ఓ వైపు బీటలు.. మరోవైపు చిట్టడవిలా కంపచెట్లు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

7

ఆ ఇద్దరిపై ఆరోపణలు నిజమే!



జిల్లా పంచాయతీ కార్యాలయం

- చర్యలు కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ
- పూర్వ డీపీవో సస్పెన్షన్‌తోపాటు సరెండర్‌కు సిఫార్సు
- డ్వామా పూర్వ పీడీ అర్జునరావుపైనా చర్యలు

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రెండు కీలక శాఖలలో పనిచేసిన ఇద్దరు జిల్లా అధికారుల అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలు నిజమేనని తేలింది. విచారణ కోసం కలెక్టర్ నియమించిన అధికారులు ఈమేరకు ఆమెకు నివేదించారు. దీంతో వారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియా లేఖలు రాశారు. అందులో

మిగతా 6లో...



గీసిన బొమ్మను సెల్‌లో నిక్షిప్తం చేస్తున్న యువతి

ఖుషీఖుషీ 'షీ'గా..

- గృహిణిగా, ఉద్యోగిగా రాణిస్తూ చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకుంటున్న మహిళలు
- జాతీయ స్థాయిలో పలువురు గుర్తింపు
- ఆర్ట్ ఎగ్జిబిషన్లలో బొమ్మల ప్రదర్శన

6

నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నాం

చలువాది బదరీనారాయణ, ఉపాధ్యక్షుడు, గెలాక్సీ గ్రానైట్ యజమానుల సంఘం



భద్రతా నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ క్వారీయింగ్ చేస్తున్నాం. క్వారీల్లో ఏప్రమాదం చోటుచేసుకున్నా యజమానుల మెడకు చుట్టుకుంటుందన్న భయంతో కార్మికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాల్సిన ఫస్ట్‌క్లాస్ మేనేజర్లు నిర్భయంగా సమస్యను యజమాని దృష్టికి తీసుకువెళ్తే ప్రమాదాలకు తావుండదు. ప్రతి యజమాని కూడా ఆదాయం కన్నా భద్రత ముఖ్యం అన్న ధోరణిలో క్వారీయింగ్ చేస్తున్నాం.

అధికారుల మెప్పు కోసమే వారోత్సవాలు

కాలం సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు



క్వారీల్లో భద్రతా వారోత్సవాలు మొక్కుబడిగా అధికారుల మెప్పుపొందేందుకే నిర్వహిస్తున్నారు. వాటి వల్ల కార్మికులకు ఒరిగేదేమీ లేదు. క్వారీల్లో భద్రతాప్రమాణాలు పెరగడం లేదు. ప్రమాదాలకు ఫుల్‌స్టాప్ పడటం లేదు. నిబంధనలకు అనుగుణంగా క్వారీయింగ్ చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనిచేస్తున్నారు.

అపార్ అవస్థలు

- ముందుకు సాగని విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు
- తలలు పట్టుకుంటున్న టీచర్లు

ఒంగోలు విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, ఆధార్, యుడైస్‌లో విద్యార్థులకు సంబంధించి ఒకే సమాచారం ఉండాలన్న నిబంధన కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. తొలుత 9,10 తరగతుల వారికి మాత్రమే అపార్ ఐడీ అన్న ప్రభుత్వం తాజాగా 1 నుంచి 10వ తరగతి వరకూ చేయమనడంతో టీచర్లకు సమస్య మొదలైంది. విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్‌లో మరో విధంగా ఉన్నాయి. పుట్టిన తేదీ వివరాలు సచివాలయంలో ఇంకో రకంగా ఉన్నాయి. కొందరు విద్యార్థుల ఇంటి పేరు కూడా ఆధార్‌లో పూర్తిగా లేదు. ఈ సమాచారం సరిపోలక అపార్ రిజిస్ట్రేషన్ కోసం

మిగతా 6లో...



గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

నేటి నుంచి వారోత్సవాలు

- ఈ వారం రోజులే హడావుడి
- ముగిశాక కనపడని మైన్స్‌సేఫ్టీ అధికారులు
- 'ఓరియంట్'లో భారీ ప్రమాదం
- చోటుచేసుకున్నా కన్నెత్తి చూడని వైనం
- నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు తరలిన డీడీఎంఎస్ కార్యాలయం
- దాదాపు ఎనిమిది క్వారీల్లో పొంచి ఉన్న హైవాల్స్ ముప్పు

చీమకుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. గనుల యజమానుల ధనదాహం, మైన్స్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం వెరసి పొట్ట చేతపట్టుకొని వచ్చిన వలస కార్మికులకు ప్రాణసంకటమవుతోంది. 2010లో హంసా క్వారీలో హైవాల్ విరిగిపడి 14మంది మృత్యువాత పడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనమైంది. అనంతరం కొన్నాళ్లు హడావుడి చేసిన అధికారులు ఆతర్వాత భద్రతా ప్రమాణాల పెంపు గురించి పూర్తిగా విస్మరించారు. దీంతో క్వారీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఓరియంట్ క్వారీలో హైవాల్ కూలింది. ఆసమయంలో కార్మికులు ఎవ్వరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించినా బాధ్యత కలిగిన మైన్స్ సేఫ్టీ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే మూడు క్వారీల్లో ఒకేసారి జరిగిన పేలుళ్లతో రాళ్లు ఎగిరిపడి పక్కనున్న జయ మినరల్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుని చేతిని తెగిపడేలా చేశాయి. కానీ దీనిపై ఎలాంటి విచారణను అధికారులు చేపట్టలేదు. ఇలాంటి ప్రమాదకరమైన ఘటనలు జరుగుతున్నా మైన్స్‌సేఫ్టీ అధికారులు మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది.

క్వారీయింగ్‌లో నిబంధనలు తూచ్

రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గ్రానైట్ క్వారీలు దాదాపు 40కిపైన ఉన్నాయి. వీటికి సంబంధించిన 150 లీజుల ద్వారా యజమానులు అనునిత్యం

మిగతా 6లో...



రామతీర్థం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న క్వారీ

ఆ క్వారీపై విచారణ చేపట్టండి

చీమకుర్తి పోలీసులకు కోర్టు ఆదేశం

చీమకుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామతీర్థం సమీపంలో ఉన్న గోల్డెన్ గ్రానైట్ క్వారీలో చోటుచేసుకున్న వ్యవహారాలపై విచారణ చేపట్టాలని చీమకుర్తి పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో క్వారీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి విచారించేందుకు వారు సిద్ధమయ్యారు. గోల్డెన్ గ్రానైట్స్‌లో అనేక అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని చీమకుర్తికి చెందిన దిగుమర్తి సురేష్ అనే వ్యక్తి ఒంగోలు మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. మైనింగ్ ఉన్నతాధికారులు, లీజు, సబ్‌లీజుదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కోర్టు విచారణ చేపట్టాలని చీమకుర్తి ఎస్‌హెచ్‌వోకి సీఎఫ్ఆర్ (కోర్టు ఫార్వర్డ్ రిపోర్ట్) జారీ చేసింది. విషయాన్ని ఉన్నతాధికారుల

మిగతా 6లో...

తను గీసిన చిత్రాలతో మండువవారిపాలేనికి చెందిన ఏజీ రాజకుమారి




గృహిణిగా, ఉద్యోగిగా రాణిస్తూ చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకుంటున్న మహిళలు

● జాతీయస్థాయిలో పలువురు గుర్తింపు ● ఆర్ట్ ఎగ్జిబిషన్లలో బొమ్మల ప్రదర్శన

ఖుషీఖుషీ ‘షీ’గా..

భారతదేశంలో 64 కళలు ఉన్నాయని చెబుతారు. అందులో సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పం వంటి వాటితోపాటు చిత్రలేఖనానికి ఎంతో ప్రముఖ స్థానం ఉంది. ఒకనాడు చిత్రలేఖనంలో ప్రవేశం, ప్రావీణ్యం ఉన్నవారు చాలా అరుదుగా ఉండేవారు. శతాబ్దాల కిందట రవివర్మ, పికాసో వంటివారు గీసిన చిత్రాలు బహుళ ప్రాచుర్యంలోకి వచ్చి ఎంతో ఆదరణ పొందాయి. అనేకమంది కార్టూనిస్టులుగా కూడా ఈ చిత్రలేఖనం ద్వారా పేరు సంపాదించారు. అయితే అప్పుడు ఈ విద్య నేర్చుకోవాలంటే అవకాశాలు చాలా తక్కువగా ఉండటమే కాకుండా చిత్రలేఖనం నేర్పే ఉపాధ్యాయులు... నగరాలు, పెద్ద పట్టణాల్లో మాత్రమే ఉండేవారు. క్రమంగా పిల్లలు మొదలు పెద్దల దాకా చిత్రలేఖనంపై మక్కువ పెరిగింది. మహిళలు ఉద్యోగులుగా, గృహిణిగా ఉంటూ చిత్రలేఖనాన్ని హాబీగా మార్చుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం..


ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో ఆర్ట్‌ఫెస్ట్ ఎగ్జిబిషన్‌లో చిత్రాకారులు వేసిన చిత్రాలు

మలి వయసులోనూ ఎంతో ఉత్సాహం



ఒంగోలు నగర పరిధిలోని మండువవారిపాలెం కాకతీయ ఓల్డ్ ఏజ్ హోంలో ఉంటున్న ఏజీ రాజకుమారి వయస్సు 78 సంవత్సరాలు. 2006 వరకు ప్రభుత్వ ఉద్యోగినిగా పనిచేసిన ఈమెకు చిన్నతనం నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో మక్కువ. ఉద్యోగం చేస్తూనే చిత్రలేఖనం నేర్చుకుని అనేక జాతీయస్థాయి అవార్డులు సాధించటమే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి ప్రముఖల ప్రసంశలు పొందారు. కేవలం కాన్వాస్‌పై చిత్రాలు వేయటమే కాకుండా కొబ్బరి చిప్పల వంటి వాటితో వివిధ ఆకృతులను తయారుచేసి వాటిపై కూడా ఆమె ఎంతో అందంగా చిత్రాలను గీసి ఔరా అనిపించారు.

ఒంగోలు (కల్చరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో చిత్రలేఖనానికి ఆదరణ బాగా పెరుగుతోంది. పిల్లల మొదలు పెద్దల వరకు దీనిని నేర్చుకోవటానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో చిత్రలేఖనం నేర్పేందుకు అనేక సంస్థలు వెలుస్తున్నాయి. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని కొన్ని ముఖ్య పట్టణాల్లో చిత్రలేఖనం నేర్పేవారు ఉన్నారు. మహిళలు సైతం ఈ రంగంలో ముందుకు దూసుకెళ్తున్నారు. వీటిని నేర్చుకోవటానికి ఉత్సాహంతో పాటు ఎంతో ఓర్పు, సృజనాత్మకత, ప్రకృతి, సమాజ పరిశీలన మొదలైన అంశాలు ఎంతో ముఖ్యం. కొంతమంది ఈ చిత్రలేఖనాన్ని ఒక అలవాటుగా నేర్చుకుంటుంటే మరికొంత మంది ఇందులో ప్రావీణ్యం సాధించి పోస్టర్ డిజైనర్లుగా వివిధ ప్రచార సంస్థలు, సినిమాల్లో అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు.

వారపత్రికలను చూసి ప్రేరణతో..



ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు మండలం కొమర్నేనివారి పాలేనికి చెందిన మున్నంగి సుమలత రైతు కుటుంబానికి చెంది ఉన్నత విద్యను అభ్యసించారు. ఆమెకు చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై ఎంతో మక్కువ. వారపత్రికల్లో వచ్చే అనేక బొమ్మలు చూసి ప్రేరణ పొంది సొంతంగా చిత్రలేఖనం నేర్చుకుని అందులో ప్రావీణ్యం సాధించారు. తండ్రి వ్యాపార రీత్యా ఒంగోలులో స్థిరపడ్డారు. వివాహం తర్వాత సుమలత హైదరాబాద్‌లో ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ దగ్గర రెండు సంవత్సరాలు చిత్రలేఖనంలో శిక్షణ పొంది ప్రస్తుతం పోర్ట్రైట్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు.

తల్లిదండ్రులు సైతం ఉత్సాహం చూపుతున్నారు



ప్రస్తుతం తమ పిల్లలకు చిత్రలేఖనం నేర్పించటానికి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసం కలుగుతుంది. వారిలో సృజనాత్మక శక్తి సైతం పెరిగి జీవితంలో వారు అనేక విజయాలు సాధించగలుగుతారు. ఇక తమ సంస్థలో అనేకమంది గృహిణులు ఈ చిత్రలేఖనాన్ని నేర్చుకుంటున్నారు. వారు తమ కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఎంతో శ్రద్ధగా ఈ విద్యను నేర్చుకుని రాణిస్తున్నారు.

\- డాక్టర్ తిమ్మిరి రవీంద్ర, ప్రముఖ చిత్రకారుడు, సృష్టి ఆర్ట్స్ అకాడమీ సంస్థ నిర్వాహకుడు

గృహిణిగా, చిత్ర కళాకారిణిగా రాణింపు

ఒంగోలుకు చెందిన శ్రీకంఠం వీరభద్రరావు, రాజ్యలక్ష్మిల కుమార్తె కనుపర్తి గాయత్రి గృహిణిగా బాధ్యతలు నెరవేరుస్తూనే పదేళ్లుగా చిత్రలేఖనంలో విశేషమైన కృషి చేస్తున్నారు. ఒంగోలు, చీరాల, బాపట్లలో విద్యాభ్యాసం చేసిన ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ భర్త ప్రోత్సాహంతో తను వేసిన వందలాది చిత్రాలతో దేశంలోని అనేక ప్రధాన నగరాల్లో ఆర్ట్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీతో పాటు, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో 40కిపైగా ఆర్ట్ ఎగ్జిబిషన్లు నిర్వహించి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. బాపు బొమ్మల పురస్కారం, యువ సాహితీ పురస్కారంతో పాటు దాదాపు 50కిపైగా ప్రతిభా పురస్కారాలు సాధించారు. తను ఒక హాబీగా నేర్చుకున్న ఈ విద్యను పదిమందికి పంచాలనే ఉద్దేశంతో చిత్రలేఖనంపై వర్క్‌షాప్‌లు సైతం ఆమె నిర్వహించారు. ఆదివారం ఒంగోలులో నిర్వహించిన ఆర్ట్‌ఫెస్ట్‌లో ప్రత్యేక ప్రతిభా పురస్కారాన్ని గాయత్రి అందుకున్నారు.




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్మ సంఘం నేతలు

సమాజసేవలో కమ్మవారు ముందుండాలి

● డాక్టర్ కామేపల్లి సీతారామయ్య

● ఘనంగా కమ్మవారి సేవాసంఘు ఆవిర్భావ సభ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో కమ్మవారు ముందుండి ఇతర కులాలకు ఆదర్శం కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవాసంఘు ఆవిర్భావ సభ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ కమ్మవారు కేవలం తమ సంక్షేమాన్ని మాత్రమే చూడటం కాకుండా ఇతర కులాలను సైతం గౌరవించాలన్నారు. ఆసరా అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కుల బాలికల సంక్షేమానికి వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అదేవిధంగా సంఘానికి ఒంగోలు నగరంలో ఒక కార్యాలయ ఏర్పాటు కూడా అవసరమని చెప్పారు. ఇందుకోసం తాను తన సొంత స్థలాలను సంఘానికి ఇవ్వటానికి సంసిద్ధత తెలియజేశారు. ఇక నాగబోయిన భాస్కరరావు మాట్లాడుతూ సంఘ కార్యాలయ నిర్మాణానికి తనవంతుగా రు.లక్ష విరాళం అందజేస్తానని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ కమ్మవారు ఏ ప్రాంతంలో ఉన్నవారైనా ఐకమత్యంతో మెలగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నూతన సంఘం కమ్మవారి సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందుకు తగిన కృషిచేస్తామని పేర్కొన్నారు. సంఘ కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు వ్యవహరించి మాట్లాడుతూ త్వరలో కమ్మవారు తమ సమస్యలను చెప్పుకునేందుకు అందుకు పరిష్కార మార్గాలను చూపేందుకు భరోసా పేరుతో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి గార్లపాటి శ్రీనివాసరావు, పావులూరి బాపయ్యచౌదరి, అబ్బూరి నవీన్‌కుమార్, లింగంగుంట సాయి వెంకటేష్, రావుల పద్మజ, వడ్డంపూడి సుజాత, బత్తినేని తిరుపతిస్వామి, దుగ్గినేని వెంకట్రావు, పలువురు సంఘ నాయకులు, పెద్దసంఖ్యలో కమ్మ కులస్థులు పాల్గొన్నారు.

ఆ క్వారీపై విచారణ చేపట్టండి!

(5వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లిన చీమకుర్తి పోలీసులు వారి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకొనేందుకు సిద్ధమయ్యారు. ఇదేవ్యవహారంపై చీమకుర్తికి చెందిన ముప్పూరి రంగారావు అనే వ్యక్తి ఇటీవల మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో ఫిర్యాదు చేశారు. దీన్ని పరిశీలించాలని పోలీసులను, సీఐడీని కేంద్ర కార్యాలయం కోరింది. ఈనేపథ్యంలో చీమకుర్తి సీఐ సుబ్బారావు ఫిర్యాదుదారుడు రంగా నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. లీజుకు ఇచ్చిన క్వారీని సబ్ లీజుకు ఇవ్వకూడదని, సబ్ లీజుదారులకు రెన్యువల్ చేయకూడదని, పర్మిట్లు ఇవ్వకూడదని.. కానీ గోల్డెన్ గ్రానైట్ విషయంలో అందుకు భిన్నంగా జరిగిందని రంగా తన స్టేట్‌మెంట్‌లో చెప్పినట్లు సమాచారం. అనుమతికి మించి రాయిని వెలికి తీశారని, దానికి విధించిన జరిమానాలు అధికారులు సగానికి సగం తగ్గించేశారని ఆయన ఆరోపించినట్లు తెలిసింది. దీనివలన ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందని, అందుకు బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాలని రంగా పోలీసులను కోరినట్లు సమాచారం. రెండు వైపుల నుంచి ఒత్తిడి రావడంతో ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజానిజాలను తేల్చాలన్న నిర్ణయానికి పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది.

సంక్షేమం ఓకే.. అభివృద్ధి కావాలి

(5వ పేజీ తరువాయి)

పడుతోంది. అయితే శాశ్వత అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి కల్పన అంశాలకు సంబంధించినవి ముందుకు కదలడం లేదు. వాటికి నిధుల సమస్య ప్రతిబంధకంగా కనిపిస్తోంది.

నీటి ప్రాజెక్టులకు నిధులు అవసరం

వెలిగొండ పెండింగ్ పనులు, నిర్వాసితుల పునరావాసానికి ఈఏడాది రూ.2వేల కోట్లు అవసరం. అలా కేటాయిస్తేనే కనీసం రెండేళ్లకు అయినా ప్రాజెక్టు నుంచి నీరిచ్చే అవకాశం ఉంది. గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు, పంట కాలువల కోసం మరో రూ.100 కోట్లు కావాలి. ఇక ఇతర ప్రాజెక్టులు. మీడియం, మైనర్ ఇరిగేషన్ పరిధిలో అనేక నీటి వనరులు కనీస మరమ్మతులు లేక అధ్వానంగా తయారయ్యాయి. ఎన్ఎస్పీ ఆయకట్టు పరిస్థితి దారుణంగా ఉంది. నీరు సక్రమంగా వదిలితే ఏకాలువ ఎప్పుడు ఎక్కడ తెగిపోతుందోనన్న పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో లస్కర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు లేక పర్యవేక్షణ కొరవడింది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు నిధులు లేక నీరసించిపోయాయి. ఫలితంగా వర్షాకాలంలోనూ పశ్చిమ ప్రాంతంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఎనిమిది శాఖలకు చెందిన అంశాలతో అజెండా

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరగనుంది. ప్రకాశం భవన్ రెండో అంతస్తులోని కలెక్టర్ సమావేశపు హాలులో ఉదయం 10 గంటలలకు ఇది ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. భోజనం అనంతరం కీలక అధికారులతో మంత్రులు మాట్లాడే అవకాశం ఉంది. ఆనం ఆదేశాలతో ఎనిమిది శాఖలకు చెందిన కీలక విభాగాలకు సంబంధించిన అంశాలపై అధికారులు అజెండాను రూపొందించారు. అందులో వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పీఆర్‌లో చేపట్టిన గుంతల రహిత రోడ్లు, డ్వామా, వైద్యారోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ ఉన్నాయి. వీటితోపాటు ఇతర అభివృద్ధి అంశాలు, నిధుల అవసరం, తక్షణ సమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది. అవసరమైన వాటికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలోనూ ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవ చూపాలి. అదేసమయంలో జిల్లాలో వివిధ శాఖల్లో వెలుగు చూస్తున్న అవినీతి, అక్రమాలు, వాటిపై విచారణలు, సంబంధిత అధికారుల పనితీరుపైనా దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

ఆ ఇద్దరిపై ఆరోపణలు నిజమే!

(5వ పేజీ తరువాయి)

ఒకరు గతంలో ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన ఒంగోలు డీఎల్‌డీవో ఉషారాణి కాగా, మరొకరు డ్వామా పూర్వ పీడీ అర్జునరావు. జిల్లా పంచాయతీ అధికారి పరిధిలో జరిగిన సచివాలయ గ్రేడ్-5, గ్రేడ్-5 (సచివాలయ కార్యదర్శులు) బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించారని, పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఆ సమయంలో ఉషారాణి ఇన్‌చార్జి డీపీవోగా ఉన్నారు. ఆ ఫిర్యాదులపై విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. ప్రాథమిక విచారణ సమయంలోనే అవకతవకలు, అవినీతి వ్యవహారాలను గుర్తించి డీపీవో కార్యాలయంలో పనిచేసే ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. అనంతరం సమగ్ర విచారణ చేపట్టి ఇన్‌చార్జి డీపీవోగా ఉన్న ఉషారాణి ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో పూర్తిగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రధానంగా ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా, కలెక్టర్ ఇచ్చిన నోట్ ఆర్డర్‌కు భిన్నంగా కొన్ని బదిలీలు జరిగినట్లు తేల్చారు. బదిలీల సమయంలో, అలాగే ఇతర ప్రాంతాలకు విజిట్‌కు వెళ్లినప్పుడు అక్రమ వసూళ్లు, కొత్త డీపీవో విధుల్లో చేరాక కూడా ఉషారాణి కొన్ని ఆర్డర్లు ఇవ్వడం తదితర అంశాలను గుర్తించిన త్రిసభ్య కమిటీ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ఉషారాణిని సస్పెండ్ చేయడంతోపాటు ప్రభుత్వానికి సరెండర్‌కు సిఫార్సు చేస్తూ కలెక్టర్ అన్సారియా పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. మరోవైపు డ్వామా పూర్వ పీడీ అర్జునరావుపై కూడా చర్యలు కోరుతూ లేఖ రాశారు.

ఇక్కడ అర్జునరావు పనిచేసిన సమయంలో ఆయన అవినీతిని భరించలేమని, నెలనెలా మామూళ్లు ముట్టచెప్పలేమంటూ డ్వామాలో మండల స్థాయిలో పనిచేసే వారితోపాటు వివిధ విభాగాల సిబ్బంది కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ గోపాలకృష్ణ విచారణ చేపట్టారు. ఆ విచారణలో కొంత జాప్యం జరగ్గా బదిలీల్లో భాగంగా అర్జునరావు జిల్లా నుంచి మరోచోటకు వెళ్లారు. కాగా సదరు వ్యవహారంపై రెండు రోజుల క్రితం జేసీ తన నివేదికను కలెక్టర్‌కు ఇవ్వగా అందులో అర్జునరావుపై సిబ్బంది చేసిన ఆరోపణలు, అవినీతి వ్యవహారాలు వాస్తవమేనని నిర్ధారించినట్లు సమాచారం. దీంతో అర్జునరావుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ అన్సారియా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు.

అపార్ అవస్థలు

(5వ పేజీ తరువాయి)

టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్‌లో విద్యార్థుల వివరాల్లో అక్షరం తేడా వచ్చినా అవి ఆమోదించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

అపార్ అంటే..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అవసరమని తేల్చిచెప్పింది. ఇప్పటికే విద్యార్థులకు పిన్ నంబర్లను కేటాయించగా కొత్తగా అపార్‌ను ప్రవేశపెట్టింది. ఈ నంబరు సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నానా తిప్పలు పడుతున్నారు. అపార్ పేరుతో ఆన్‌లైన్‌లో ప్రతి విద్యార్థికి ఒక నంబరును కేటాయిస్తారు. అందులోనే ఆ విద్యార్థికి సంబంధించి విద్యా విషయాలు, నైపుణ్యాలు పొందుపరుస్తారు. ఈ నంబరు కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకొనేందుకు మూడు రకాల రికార్డుల్లో విద్యార్థుల వివరాలు ఒకే విధంగా ఉండాలి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఒకే విద్యార్థికి మూడు రకాల వివరాలు

ప్రస్తుతం పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారిలో కొందరి వివరాలు గందరగోళంగా ఉన్నాయి. ఒక విద్యార్థికి మూడు రకాల పుట్టిన తేదీలు ఉండటం సమస్యగా మారింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి 1వ తరగతిలో చేరేటప్పుడు తల్లిదండ్రులు చెప్పిన విధంగా ప్రధానోపాధ్యాయులు పుట్టిన తేదీ, ఇతర వివరాలను అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వాటినే హైస్కూలులో 6వ తరగతిలో చేరినప్పుడు అక్కడి అడ్మిషన్ రిజిస్టర్‌లోనూ కొనసాగిస్తారు. పంచాయతీ, మునిసిపాలిటీల్లో పిల్లల జనన రిజిస్టర్‌లో మరో పుట్టిన తేదీతో వారి వివరాలు నమోదవుతున్నాయి. ఆధార్ నంబరులో విద్యార్థుల పుట్టిన తేదీ లేకుండా కేవలం సంవత్సరం మాత్రమే నమోదై ఉంది. ఈనేపథ్యంలో పుట్టిన తేదీల్లో దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలో అర్థంకాక ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 9వ తరగతి వరకు పుట్టిన తేదీ మార్చే అధికారం డీఈవోలకు ఉంది. పదో తరగతి వారికి అయితే ఆర్‌జేడీ చేయాలి. అయితే ఆ వివరాలు మార్పుల కోసం అటు కార్యాలయాలు, అటు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రులు, టీచర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు.

గ్రానైట్ గనుల్లో భద్రత డొల్ల

(5వ పేజీ తరువాయి)

ముడిరాళ్లను వెలికితీస్తుంటారు. ఈ రాళ్లను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా క్వారీ యజమానులు భారీగా లాభాలు గడిస్తుంటారు. క్వారీల్లో స్థానికులతో పాటు, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు దాదాపు 10వేల మందికిపైగా వివిద రకాల పనులను చేస్తున్నారు. వారి భద్రతకు యజమానులు ప్రాధాన్యం ఇవ్వాలి. భద్రతా ప్రమాణాల పర్యవేక్షణకు మైన్స్, మైన్స్‌సేఫ్టీ అధికారులున్నారు. నిబంధనలను ఉల్లంఘించి క్వారీయింగ్ చేపడితే తక్షణమే లీజును రద్దుచేయడంతోపాటు కేసులు నమోదు చేసే అధికారం సైతం వీరికి ఉంది. కానీ ఆదిశగా అధికారుల అడుగులు పడకపోవడంతో క్వారీల యజమానులు కార్మికుల భద్రతను గాలికొదిలేస్తున్నారు.

హైపవర్ కమిటీ సూచనలు కొద్దిరోజులే అమలు

హంసా గ్రానైట్స్‌లో ఘటన అనంతరం అప్పటి ప్రభుత్వం క్వారీల్లో భద్రతా ప్రమాణాల పెంపుకు హైపవర్ సైంటిఫిక్ కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచనలను గనుల్లో పక్కాగా అమలు చేసేలా చర్యలు చేపట్టింది. అప్పటి వరకూ ఇష్టారీతిన క్వారీయింగ్ చేస్తున్న వారు కొంతమేర పద్ధతి మార్చుకున్నారు. ఆతర్వాత కొద్ది రోజులకు షరామామూలే అయ్యింది. క్వారీ యజమానులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగితే పరిహారం చెల్లించడానికి అలవాటుపడ్డారు. హైపవర్ కమిటీ సూచనలు పాటిస్తే ఆదాయం తగ్గుతుందన్నదే అందుకు కారణం. కమిటీ సూచనల్లో మరో కీలకమైనది ర్యాంపుల ఏర్పాటు. బెంచ్‌ఫార్మేషన్‌తో క్వారీయింగ్ చేయాలి. కానీ అలా జరడం లేదు. ఇక మిగతా వాటిలో ఫస్ట్ క్లాస్ మేనేజర్లను నియమించుకొని వారి పర్యవేక్షణలోనే క్వారీయింగ్ చేయాలి. కానీ మేనేజర్ల నియామకం జరిగినా వారి సూచనలను క్వారీ యజమానులు అమలు చేయడం లేదు.

భయపెడుతున్న హైవాల్స్

హైపవర్ కమిటీ సూచనల్లో ప్రధానమైనది హైవాల్స్ తొలగించడం. వాటిని అలాగే ఉంచితే కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. కానీ హైవాల్స్ తొలగింపు విషయంలో యజమానులు, అధికారులు మౌనముద్ర దాల్చారు. ఏ క్షణాన్నైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న హైవాల్స్ ఎనిమిది క్వారీల్లో ఉన్నాయని మూడేళ్లక్రితం ఇక్కడ క్వారీల్లో భద్రతపై సర్వే చేసిన చెన్నై బృందం అధికారులకు తేల్చిచెప్పింది. కానీ ఇప్పటి వరకూ చలనం లేదు.

తెలంగాణాకి తరలిన నెల్లూరు కార్యాలయం

మైన్స్‌సేఫ్టీ అధికారుల కార్యకలాపాలు, కార్యాలయ నిర్వహణ కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. గతంలో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లోని గనుల్లో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించేందుకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ కార్యాలయం నెల్లూరులో ఉండేది. దాన్ని కొద్ది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోయింది.

10వ తేదీ వరకూ భద్రతా వారోత్సవాలు

ఉమ్మడి జిల్లాలో ఉన్న గ్రానైట్ క్వారీల్లో 22వ భద్రతా వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. 10వతేదీ వరకూ జరగనున్నాయి. క్వారీలను ఉత్పత్తినిబట్టి ఐదు గ్రూపులు (ఏ1,ఏ2,ఏ, బీ1,బీ2)గా విభజించారు. వీటిని తనిఖీ బృందం నిర్దేశించి తేదీల్లో సందర్శిస్తుంది. రికార్డులు, క్వారీయింగ్ కార్యకలాపాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తుంది. మైన్స్‌సేఫ్టీ అధికారులు వీరందరినీ పర్యవేక్షిస్తూ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తతంగమంతా పండుగ వాతావరణంలో జరుపుకొనేందుకు క్వారీలను ముస్తాబుచేశారు.


హైవాల్ కుప్పకూలిన ఓరియంట్ గ్రానైట్ క్వారీ(ఫైల్)



ధ్వజ స్తంభానికి మొక్కుతున్న సినీ నటుడు సుమన్

ఆలయాల్లో నటుడు సుమన్ పూజలు

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్లను సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరునికి మహాన్యాసపూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవికి అర్చనలు చేశారు. అనంతరం స్థానిక వాసవీ అన్నసత్రంలో ఏర్పాటు చేసిన గౌడ కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత ప్రాతిపదికన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని యర్రగొండపాలెం, కొమరోలు, కంభం, మార్కాపురం, గిద్దలూరు, దొనకొండ, ఒంగోలు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, అర్థవీడు మండలాల్లో 72మంది టీచర్లు, పిల్లలు లేని పాఠశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని రెగ్యులర్ ప్రాతిపదికన పాఠశాలలకు సర్దుబాటు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.



మర్లపాడులో వేసిన పొగాకు నాట్లు

ముమ్మరంగా పొగాకు, వరి నాట్లు

టంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో పొగాకు, వరినాట్లు జోరుగా పడుతున్నాయి. చెరువులు, బోర్లు వసతులున్న గ్రామాల్లో వరి నాట్లు వేయిస్తున్నారు. గత ఏడాది పొగాకు ధరలు అనుకూలంగా ఉండడంతో ఈసీజన్‌లో పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండలంలో సుమారు 11వేల ఎకరాల్లో పొగాకు నాట్లు పడనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మండలంలోని పడమర గ్రామాల్లో పొగనాట్లు వేస్తున్నారు.

వరినాట్ల జోరు

ఈఏడాది వాతావరణం అనుకూలించి వర్షాలు పడడంతో వల్లూరు, వాసేపల్లిపాడు పంట చెరువులు నిండుకుండలా మారాయి. వీటి ఆధారంగా వరినాట్లు పడనున్నాయి. గత ఏడాది 500 ఎకరాల వరకు పరిమితమైన సాగు ఈసారి 1200 ఎకరాల వరకు పడే అవకాశముంది. వాసేపల్లిపాడు చెరువు నీటి ఆధారంగా 600 ఎకరాల్లో, వల్లూరు చెరువు నీటి ఆధారంగా 600 ఎకరాల్లో వరిసాగు కానుంది. వాసేపల్లిపాడు రైతులు దగ్గరలోని ఈతముక్కల చుట్టుపక్కల గ్రామాల్లో వరి నారు కొనుగోలు చేసి తెచ్చుకొని నాట్లు వేస్తున్నారు. వల్లూరు పంట చెరువు కింద రైతులు నార్లు పోసి మరీ నాట్లు వేస్తున్నారు. కొణిజేడు, కందులూరు, మర్లపాడు గ్రామాల్లో బోర్లు ఆధారంగా 100 ఎకరాల్లో వరి పంట సాగుకానుంది. మొత్తంగా పరిస్థితి చూస్తే మండలంలో విస్తృతంగా పొగాకు, వరి నాట్లు వేయించే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం !

- ముగిసిన కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు
- అస్తవ్యస్తంగా జాతీయ రహదారి
- ఓ వైపు బీటలు..మరో వైపు చిట్టడవిలా కంపచెట్లు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నాగులుప్పలపాడు మండలంలోని జాతీయ రహదారి-216 నిర్వహణను ఆశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ గాలికొదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం త్రోవగుంట నుంచి దిగమర్రు వరకు చేపట్టిన రెండు వరుసల సిమెంట్ రోడ్డుతో కూడిన జాతీయ రహదారి నిర్మాణ పనులను దిలీప్ బిల్డ్‌కాన్ కంపెనీ పనులను దక్కించుకొని పూర్తిచేసింది. ఉప్పుగుండూరు సమీపంలో టోల్‌గేట్‌ను సైతం ఏర్పాటు చేసి రుసుం వసూలు చేసుకొంటున్నారు.



అసంపూర్తి పనులతో రహదారి పైకి వచ్చిన ముళ్లకంప చెట్లు

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మించిన కాంట్రాక్టరు కొన్నేళ్లపాటు ఆ రహదారి నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టరు హైవే-216 నిర్వహణ బాధ్యతలు ఈ ఏడాది జూన్ నాటికి ముగిసినట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి రహదారి నిర్వహణ పట్టించుకున్న నాథుడు లేక గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. వెరసి రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లు దాటి ముళ్లకంప, చెట్లు రోడ్డు పైకి పాకడంతో ఎదురుగా వాహనాలు వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డుమార్జిన్‌లోకి వెళ్లిన ద్విచక్ర వాహనదారులకు ముళ్ల కంపలు గీసుకొని గాయాలపాలవుతున్నారు. మార్జిన్‌లు సైతం గడ్డి,పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పలు చోట్ల రహదారికి పగుళ్లు వచ్చి ద్విచక్ర వాహనాల టైర్లు ఇరుక్కుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కంప చెట్లు కప్పేశాయి. ముళ్లకంపల మధ్య దర్శనమిస్తున్నాయి. దాంతో సూచిక బోర్డులు కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త వారికి గ్రామాల వివరాలు, రోడ్డు పరిస్థితి తెలియక నానా తంటాలు పడుతున్నారు. డివైడర్లు ప్రమాదాలు జరిగిన సమయంలో పగిలిపోయి దెబ్బతిని ఉన్నాయి. పలు ప్రాంతాలలో డివైడర్లకు రేడియం స్టిక్కర్లు, రంగులు వెలసిపోయాయి. అటువైపుగా అధికారులు దృష్టి సారించకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి.



ముళ్లకంపల మధ్యలో సూచిక బోర్డు



మరమ్మతులకు నోచుకోని పగుళ్లిచ్చిన డివైడర్

మార్జిన్లలో సన్నటి రాళ్ల ,మట్టి పేరుకుపోయి ద్విచక్ర వాహనాలు పట్టు తప్పి కింద పడుతున్న సందర్భాలు అనేకం. సాధారణంగా రహదారి మార్జిన్లలో చేరిన మట్టి,రాళ్ల,ఇసుక లాంటి వాటిని ఎప్పటికప్పుడు కూలీలతో తొలగించాల్సి ఉంది. గుత్తేదారు నిర్వహణ సమయం ముగిసిన తర్వాత రహదారి నిర్వహణ బాధ్యతులు అధికారులు విస్మరించారు. ఓ వైపు రహదారికి ఇరువైపులా దట్టంగా అల్లుకుపోయిన ముళ్లకంప, అలాగే చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయి మరో వైపు బీటలు వారుతూ ఇది నిజంగా జాతీయ రహదారేనా అన్న సందేహం కలుగక మానదు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత రహదారి పరిస్థితి దృష్ట్యా ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని వాహనదారులు హడలెత్తుతున్నారు.

మమ.. అనిపించారు...

గత కొద్ది నెలల నుంచి జాతీయ రహదారి-216 నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆ శాఖ అధికారులకు పిర్యాదులు వెళ్లాయి. ఇక హైవే అధికారులు కేవలం రహదారికి ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో చెట్లు తొలగించే పనిని చేపట్టారు. ఆయా పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపించిందన్న విమర్శలు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఎక్కడి చెట్లు అక్కడే వదిలేశారు. రోడ్డుపై పడిన బీటల వైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. రహదారి పక్కనున్న సూచిక బోర్డుల చుట్టూ కంప చెట్లు అలానే దర్శనమివ్వడం పట్ల అధికారుల పనితీరు అర్థమవుతుంది. మొత్తం మీద మమ అనిపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి హైవేకు ఏర్పడిన బీటలు సరిచేసి రహదారి నిర్వహణ పనులను సంపూర్ణంగా నిర్వహించి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కోటి గోటి తలంబ్రాలకు సన్నాహం

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి స్వామివారి కల్యాణ మహోత్సవంలో కోటి తలంబ్రాలు సమకూర్చే క్రమంలో భాగంగా రామ భక్తులు ఆదివారం గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు వడ్లను ప్రత్యేక పూజలతో సన్నద్ధం చేశారు. ప్రతి ఏడాది చీరాల ప్రాంతం నుంచి భద్రాచలం రాములవారి కల్యాణ మహోత్సవానికి తమ వంతు బాధ్యతగా గోటి తలంబ్రాలను సిద్ధం చేసి భక్తులు తీసుకువెళుతుంటారు. అందులో భాగంగా కార్యాచరణ చేపట్టారు.

కరాటేలో ఇంకొల్లు విద్యార్థుల ప్రతిభ

ఇంకొల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఆదివారం జరిగిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2024 జరిగిన పోటీలలో జేకే గోజురే కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో 11 మంది విద్యార్థులు పాల్గొనగా, మొదటి స్థానంలో ముగ్గురు, రెండో స్థానంలో ఐదుగురు, మూడవ స్థానంలో ముగ్గురు విజయం సాధించినట్లు కోచ్‌లు ఎం.శేఖర్, ఎం.శిరీష తెలిపారు.



కబడ్డీ క్రీడాకారుడు మణిరెడ్డిని సన్మానిస్తున్న బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ సభ్యులు

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

చినగంజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారుడు ఎస్.మణిరెడ్డిని ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కబడ్డీ క్రీడాకారుడైన మణిరెడ్డి ఒంగోలు ఆంధ్రకేసరి ప్రకాశం యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికై చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలలో పాల్గొని చినగంజాం వచ్చిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.గిరిబాబు తెలిపారు. బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో మణిరెడ్డిని క్లబ్ అధ్యక్షులు, సభ్యులు సన్మానించి, రూ.5,000 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కంసాని సతీష్‌రెడ్డి, శివారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాతగొడవల నేపథ్యంలో యువకుడిపై హత్యాయత్నం

- ఇరువురు బీరు సీసాలతో దాడి
- ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఘటన
- విచారణ చేపట్టిన డీఎస్పీ

ఒంగోలు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై ఇరువురు యువకులు హత్యాయత్నం చేశారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఒంగోలు నగరం కొత్తకూరగాయల మార్కెట్ వద్ద జరిగింది. కలిసి మద్యం తాగుతూ ఉండగా వివాదం చెలరేగి ఇరువురు యువకులు బీరు సీసాతో మరో యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడి చేసిన వారిలో ఓ రౌడీషీటర్ కూడా ఉన్నాడు. వివరాలలోకి వెళితే..

స్థానిక మామిడిపాలెంలో నివాసం ఉంటున్న జమ్మలమూడి నాగవర్ధన్ శనివారం రాత్రి అద్దంకి బస్టాండ్‌లో తన భార్యను బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కించి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో కిరణ్ అనే స్నేహితుడు కొత్తమార్కెట్ వద్దకు వస్తానని ఫోన్ చేసి చెప్పగా కొద్దిసేపు వేచిఉన్నాడు. అనంతరం నడుచుకుంటూ వెళుతుండగా అక్కడ బండ్లమిట్టకు చెందిన చింపిరి బాలసాయిచంద్, గోపాల్‌నగరంనకు చెందిన ప్రభుకుమార్, మామిడిపాలెంనకు చెందిన రెబ్బవరపు మనోజ్, సత్యానారయణపురంనకు చెదిన సూర్యం కలిసి మద్యం తాగుదామంటూ నాగవర్ధన్‌ను పిలిచారు. దీంతో ఐదుగురు కలిసి కొత్తకూరగాయల మార్కెట్ మెయిన్ గేట్ లోపల మద్యం తాగారు. అయితే వారు ఇంకా మద్యం కావాలంటూ నాగవర్ధన్‌ను డబ్బులు అడిగారు. తన వద్ద లేవని చెప్పడంతో నాగవర్ధన్ జేబులు వెతికారు. మద్యం కోసం డబ్బులు అడిగితే లేవంటావా అంటు బాలసాయిచంద్, ప్రభుకుమార్ కలిసి నాగవర్ధన్‌పై దాడికి దిగారు. అంతేగాకుండా కులం పేరుతో దూషించారు. అనంతరం బీరు సీసాలు పగలకొట్టి విచక్షణ రహితంగా పొడిచారు. దీంతో నాగవర్ధన్ తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు హత్యాయత్నం నేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



చెరువుకట్ట కింద ఉన్న మర్రిచెట్టు



చెరువుకట్టపై ఉన్న రావిచెట్టు

కంభం చెరువుకే కాదు .. చెట్లకూ ఉంది ఓ చరిత్ర

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన చారిత్రాత్మక కంభం చెరువుకే కాదు దాని సమీపంలోని చెట్లకు కూడా శతాబ్దాల నాటి చరిత్ర ఉన్నది. కట్టపై ఉన్న రావిచెట్టు, కట్ట కింద రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టు 500 ఏళ్ల నాటివి. రెండు కొండల మధ్య అత్యంత విశాలంగా బండరాళ్ల పెట్టి వాటి మధ్య సీసం కరిగించి కట్టను ఏర్పాటు చేశారు. దానిపై శ్రీకృష్ణదేవరాయులు భార్య రావి మొక్కను నాటి చుట్టూ అరుగు నిర్మించినట్లు, కట్ట కింద కూడా సేద తీరేందుకు మరో మర్రి మొక్కను నాటినట్లు చరిత్ర చెబుతోంది. నాడు నాటిన మొక్కలే నేడు మహా వృక్షాలై విశాలంగా విస్తరించాయి.



దగ్ధమవుతున్న కారు

పార్క్ చేసిన కారు దగ్ధం

ఒంగోలుక్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పార్కు చేసిన కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేషగిరి కారును రోడ్డు పక్కన పార్కు చేసి విధి నిర్వహణకు వెళ్లారు. రాత్రి 7.30 గంటల సమయంలో కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దట్టంగా పొగ వ్యాపించింది. అక్కడ కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కారు దగ్ధమవుతోందని స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేశారు. దీంతో ఫైరింజన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కారు సాంకేతిక లోపాల వల్ల దగ్ధమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం

- ఎమ్మెల్యే ఏలూరి
- టీడీపీ న్యూజిలాండ్ వెబ్‌సైట్ ప్రారంభం

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం న్యూజిలాండ్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలసి హాజరయ్యారు.

ఈసందర్భంగా జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారన్నారు.

తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగు దేశం పార్టీ ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిందని, ప్రజల ఆశయాలకు ఆకాంక్షకు అనుగుణంగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఏలూరి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో నిర్బంధించినప్పుడు 100 దేశాల్లో నిరసనలు చేపట్టారని, అందులో న్యూజిలాండ్ వారు ఉండడం మర్చిపోలేనిదన్నారు. అనంతరం న్యూజిలాండ్ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దుకూరి దిలీప్, పరతాపరెడ్డి, మజీద్ సామ్యూల్, జితేంద్ర, నిమ్మగడ్డ మమత పాల్గొన్నారు.



న్యూజిలాండ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, పక్కన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

కామేపల్లివారిపాలెంలో తాగునీటి ఎద్దడి

- గ్రామంలో పని చేయని ఫిల్టర్‌బెడ్లు
- నేరుగా కలుషిత నీరు సరఫరా
- రోగాల బారిన పడుతున్న ప్రజలు


గ్రామంలోని మంచినీటి ట్యాంకు


పని చేయని ఫిల్టర్‌బెడ్

సంతనూతలపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలంలోని కామేపల్లివారిపాలెంలో మంచినీటి సమస్య వేధిస్తోంది. గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద ఫిల్టర్ బెడ్లు పని చేయకపోవడంతో గత రెండేళ్లుగా మంచినీటిని నేరుగా విడుదల చేస్తున్నారు దీంతో కుళాయిల్లోని కలుషిత నీరు తాగుతుంటే వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.

ఫిల్టర్ బెడ్లు ఉన్నా నిరుపయోగం

గ్రామంలో వాటర్‌ట్యాంకు వద్ద ఫిల్టర్‌బెడ్లు ఉన్నా వాటికి బాగు చేయించి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో మంచినీటి సమస్య వేధిస్తోంది. చెరువులో కలుషితంగా ఉన్న నీటిని నేరుగా బావిలోకి పంపింగ్ చేసి అనంతరం ఫిల్టర్ చేయకుండానే ఆ నీటిని నేరుగా ఇళ్లకు వదులుతున్నారు. వాస్తవంగా చెరువులోని నీటిని ఫిల్టర్‌బెడ్లకు విడుదల చేసిన అనంతరం నీటిని బావికి వదులుతారు. అక్కడ నుంచి గ్రామాల్లో ప్రజలకు పైపుల ద్వారా సరఫరా చేస్తారు. అయితే కలుషిత నీరే దిక్కవడంతో వాటినే తాగుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కొందరు ఆ నీటిని తాగలేక సమీప గ్రామాలైన మంగమూరు, సంతనూతలపాడుకు వెళ్లి మినరల్ వాటర్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

రూ.3లక్షల బిల్లులు..

వాటర్‌ట్యాంకు వద్ద ఫిల్టర్ బెడ్లు మార్చేందుకని చెప్పి సంబంధిత అధికారులు 2023 సంవత్సరంలో సక్రమంగా మరమ్మతులు చేయకుండానే రూ.3లక్షలు బిల్లులు పెట్టుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అదేమంటే ఒకసారి ఫిల్టర్ బెడ్లు మార్చిన తర్వాత మరమ్మతులకు గురైతే మూడేళ్ల వరకు నిధులు రావని అధికారులు చెబుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. అంతేగాకుండా ఆ కలుషిత నీటిని గ్రామంలోకి వదలాలన్న సరే ఇంటికి రూ.వెయ్యి ఇవ్వాలని పంచాయతీ తరపున ఏర్పాటు చేసిన వ్యక్తి డిమాండ్ చేస్తున్నట్లు వారు ఆరోపించారు.

సాయం.. నిరుపయోగమే..

ఏపీఎండీసీ లిమిటెడ్ సంస్థ కామేపల్లివారిపాలెం గ్రామస్థులకు తాగునీటిని అందించేందుకు తన వంతు సాయంగా రూ.5లక్షల విలువైన ఆర్‌వో ఫిల్టర్ మిషనరీ ఇచ్చిన నిరుపయోగంగా మారింది. గతంలో చెరువులోని నీటిని ఫిల్టర్‌బెడ్‌లోకి వదిలి ఆ తరువాత బావిలోకి పంపింగ్ చేసేశారు. అనంతరం ఆర్‌వో మిషన్ ద్వారా నీటిని ఫిల్టర్ చేసి నీటిని వాడుకునేవారు. కానీ నేడు వారి సాయం కూడా నిరుపయోగంగా మారింది.

అలర్జీలు వస్తున్నాయి..



పైపుల్లో వస్తున్న నీరు పచ్చగా ఉంటుంది. వాటితో స్నానాలు చేయాలంటే భయమేస్తుంది. చర్మవ్యాధులు, జ్వరాలు వస్తున్నాయి. నీటి సమస్యను పరిష్కరించాలి

- కామేపల్లి పుష్పావతి, మాజీ సర్పంచ్

అడిగినా స్పందన లేదు..

ఏడాది క్రితం వాటర్‌ట్యాంకు వద్ద ఫిల్టర్‌బెడ్లను మార్చారు. దానికి సంబంధించి రూ.2లక్షలు ఖర్చుకాగా, మండల గ్రాంట్ నుంచి రూ.1.52లక్షలు విడుదలయ్యాయి. పంచాయతీ నుంచి నీరు వదిలే వ్యక్తి కాంట్రాక్టు తీసుకుని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమక్షంలో ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు చేశారు. కానీ సరిగా పని చేయలేదు. దీనిపై సంవత్సరం క్రితం ఏఈగా పనిచేసిన సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లా. నిర్లక్ష్యంగా సమాధానం చేప్పేవారు.

- జాగర్లమూడి గౌతమి, సర్పంచ్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కలుషిత నీటి విడుదల గురించి మాకు సమాచారం అందింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, ఇంజనీరింగ్ అధికారులు కలిసి పరిశీలిస్తున్నారు. గ్రామంలో మంచినీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటాం.

- శ్రీకళ, పంచాయతీ కార్యదర్శి

చిత్రకళతో సృజనాత్మకత : దామచర్ల


చిత్రకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చిత్రకళ ద్వారా మనిషిలో సృజనాత్మకత పెరుగుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఆర్ట్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిత్రకారులు వేసిన చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ ఇటువంటి ఫెస్ట్‌లను నిర్వహించటం ద్వారా చిత్రకారులకు ఎంతో ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. ఒంగోలులో కళా, సాంస్కృతిక కార్యక్రమాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. సృష్టి ఆర్ట్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ తిమ్మిరి రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిత్రకళా రంగ ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిత్రకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ చిత్రాలకు నగదు బహుమతులను అందజేశారు.

రేపు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో మంగళవారం ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో సమావేశం జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల నిర్మాణం తదితర అంశాలపై చర్చ ఉంటుదని శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

మద్దిపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ రోడ్డు పక్కన పడి ఉండటాన్ని హైవే పోలీసులు గుర్తించారు. ఆమెను చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు పంపగా అనంతరం అక్కడ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

150మందికి వైద్య సేవలు

మద్దిపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో ఆదివారం యామిని కంటి వైద్యశాల, ఒంగోలు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్నో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. అనతరం 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే హెచ్‌ఐవీని నిర్మూలించవచ్చని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలలో మీకు తెలుసా అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. బాధితుల పట్ల వివక్షత చూపకూడదని కోరారు. టోల్‌ఫ్రీ నంబరు 1097పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మాధవి, టీచ ఎం.మల్లేశ్వరి, సిబ్బంది దివ్య తదితరులు పాల్గొన్నారు.

8న మండల సమావేశం

సంతనూతలపాడు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కబడ్డీ క్రీడాకారుల ప్రోత్సాహానికి కృషి

- ప్రతి జిల్లాలో పోటీలు నిర్వహిస్తాం
- రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి


జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు

ఒంగోలు(రూరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కబడ్డీ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహన్ని అందిస్తామని, అందుకోసం ప్రతి జిల్లాలో అసోషియోషన్ తరుపున పోటీలు నిర్వహిస్తామని కబడ్డీ అసోషియోషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని దక్షణ బైపాస్‌రోడ్డులోని గల ఆస్థాన ఫంక్షన్‌హాలులో జిల్లా పాలకవర్గ కబడ్డీ అసోషియోషన్ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 26 జిల్లాల్లో నూతన కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఎనిమిది జిల్లాల్లో కార్యవర్గాలను ఎన్నుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లాలో కబడ్డీ క్రీడాకారులు అధికంగా ఉన్నారని చెప్పారు. అందువల్ల క్రీడాకారులు పోటీల్లో ఎక్కువగా పాల్గొనాలని కోరారు. తిరుపతి, విశాఖపట్నంలలో ఈ సంవత్సరం పోటీలు నిర్వహిస్తామన్నారు. పారిశ్రామికవేత్త డాక్టర్ నల్లూరి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో అసోషియోషన్ తరుపున జరిగే కబడ్డీ పోటీలకు ప్రతి ఏడాది రూ.2లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ ఏడాది జరిగే పోటీల కోసం రూ.2లక్షల నగదు అధ్యక్షుడు కుర్రా భాస్కరరావుకు అందజేశారు. అంతర్జాతీయ క్రీడాకారుడు అన్నా వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ న్యాయమూర్తి కె.రామారావు వ్యవహరించారు. సీనియర్ అంతర్జాతీయ క్రీడాకారుడు నక్కా అర్జునరావు తదతరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా భాస్కరరావు

జిల్లా కబడ్డీ అసోషియోషన్ అధ్యక్షుడుగా కుర్రా భాస్కరరావును క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ నల్లూరి సుబ్బారావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.రంగారావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా కె.ప్రసాదురావు, ఈదర వెంకటసురేష్‌బాబు, ఎ.సుమతి, బి.దయానంద్, ట్రెజరర్‌గా డి.రమేష్, కార్యదర్శిగా వై.పూర్ణచంద్రరావు, సీనియర్ జాయింట్ సెక్రటరీలుగా ఎం.హరనాథ్‌బాబు, పి.బసవయ్య, పి.హజరత్తయ్య, ఇబ్రాయిల్, అలాగే ఈసీ సభ్యులుగా బి.అంకబాబు, కె.శ్రీలక్ష్మి, వై.చెన్నయ్య, ఎం.వీరాస్వామి, ఎండీ.హాజీరాబేగం, ఎస్.శివసిసింద్రి, టి.బాలాంజనేయులు, వై.బాలగురవయ్య, పి.దామోదరరెడ్డి, ఎ.రవికిరణ్, వై.బాబు, కె.మల్లికారాణి, ఎం.మోహనరావు, బంగారురెడ్డిలను ఎన్నుకున్నారు.

ఘనంగా జంగమ సంఘ వనసమారాధన

- హాజరైన ఎమ్మెల్యే దామచర్ల


ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాతకు జ్ఞాపికలను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జంగమ సంఘ కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం ఒంగోలులోని వేమూరి లక్ష్మణ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. జంగమ సంఘ అభివృద్ధి కమిటీ, జిల్లా జంగమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరై ప్రసంగించారు. ఇటువంటి సమారాధనల వల్ల పరస్పర పరిచయాలు, ఐక్యత పెరుగుతాయన్నారు. జంగమ కులస్థుల అభివృద్ధికి తాను కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సమాజంలో కుటుంబాల మధ్య సుహృద్భావ వాతావరణం, తద్వారా సమాజ అభివృద్ధి, అదేవిధంగా భక్తిభావం పెంపొందించటానికి కార్తీకమాసంలో ఇటువంటి వనసమారాధనలను పూర్వీకులు ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదేవిధంగా జిల్లా జంగమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వివాహ పరిచయ వేదికలో అవివాహితులు పేర్లు నమోదు చేసుకున్నారు. సంఘ నాయకులు వై.మల్లికార్జునరావు, ఎం.కోటేశ్వరరావు పర్యవేక్షణ చేశారు.

11న మందకృష్ణ మాదిగ ఒంగోలు రాక

- మాదిగ ఉద్యోగుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు ఐజక్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈనెల 11వ తేదీన ఒంగోలుకు విచ్చేయనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ తెలిపారు. ఆదివారం ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా సుప్రీంకోర్టు తీర్పును త్వరితగతిన అమలు పరిచేదిశగా మంద కృష్ణమాదిగ రెండు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు చేపట్టాల్సిన చర్యలు వేగవంతం చేసేందుకు రెండు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జిల్లాల వారీగా కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా ఆయన ఈనెల 11న ఒంగోలు విచ్చేయనుండగా, స్థానిక నెల్లూరుబస్టాండ్‌లోని డీఆర్‌ఆర్ఎం స్కూలు ఆవరణంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదిగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షులు బొంత యేసుదాసు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంఈఎఫ్ బాపట్ల అధ్యక్షుడు వంగిరపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి సర్వేపల్లి రవిరాజ్, తేళ్ళ జాలారావు, లక్కెబోయిన కోటేశ్వరరావు, తిరువీధి బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు



మద్యం సీసాలతో ఎస్‌ఐ శ్రీకాంత్



మద్యంసీసాలను పట్టుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఎస్‌ఐ బి.శ్రీకాంత్ ఆదివారం దాడి చేసి నాలుగు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. నిర్వాహకురాలును అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ తెలిపారు ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

అగ్రహారంలో..

మద్దిపూడి: మండలంలోని జి.అగ్రహారంలో ఆదివారం ఎస్‌ఐ రమేష్‌బాబు ఓ బెల్ట్ దుకాణంపై దాడి చేసి 12మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకున్ని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండోసారి పట్టుబడితే రిమాండ్‌కు పంపించడంతోపాటు రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామన్నారు.

అక్రమంగా మద్యం ఇస్తే లైసెన్స్‌లు రద్దు

కొండపి: మండలంలోని గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపె కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ప్రేమ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించడం నేరమని తెలిపారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

పొన్నలూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో ఆదివారం జరిగిన సమావేశంలో యూటీఎఫ్ పొన్నలూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా చెన్నిపాడు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు కమ్మిశెట్టి మాల్యాద్రి, అధ్యక్షుడిగా కె.అగ్రహారం ఎంపీస్కూల్ ఉపాధ్యాయుడు చౌడం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రావులకొల్లు ఎంపీ స్కూల్ ఉపాధ్యాయుడు గొట్టిపాటి మాధవరావు, కోశాధికారిగా ముప్పాళ్ల స్కూల్ ఎంపీ స్కూల్ ఉపాధ్యాయుడు పగడాల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు.

గొడవ పడొద్దన్నందుకు దాడి

ఒంగోలు క్రైం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో కొంతమంది గొడవ పడుతుండగా అడ్డు తీసే ప్రయత్నం చేసిన అయ్యప్ప మాలధారిపై దాడి చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం లాయర్‌పేటలోని సెంట్రల్‌కేఫ్ వద్ద శనివారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సీవీఎన్ రూం ఎదురుగా ఉన్న ద్వారకనగర్‌లో నివాసం ఉంటున్న రావులపల్లి ప్రేమ్ కుమార్ అయ్యప్పస్వామి మాల ధరించి ఉన్నాడు. ఆయన బండ్లమిట్ట వెళ్లి మోటర్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అయితే సెంట్రల్‌కేఫ్ వద్ద కొంత మంది గొడవ పడుతున్నారు. దీంతో ప్రేమ్‌కుమార్ వెళ్ళి వారిని నిలువరించే ప్రయత్నం చేశాడు. దీంతో వారు నీవెవరూ మా మధ్యలో అంటూ దుర్భాషలాడి కర్రలతో దాడి చేశారు. బాధితుడు తన సోదరుడికి ఫోన్ చేసి పిలిపించుకొని స్థానిక రిమ్స్‌లో చేరాడు. అక్కడ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

సైడు కాలువలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

టంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు బస్టాండ్ పరిసరాల్లో పంచాయతీ స్థలం గుర్తించే పనిలో పంచాయతీ పాలకులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను గుర్తించి తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్ అండ్‌బీ అధికారులు పాలుపంచుకుంటున్నారు. ప్రస్తుతం ఫైర్ స్టేషన్ నుంచి వైఎస్సార్ బొమ్మ వరకు పంచాయతీ స్థలం గుర్తించే పనులు జరుగుతునాయి. రోడ్డు వెంబడి సైడు కాలువ వరకు పంచాయతీ స్థలం ఉంది. అది దాటి ముందుకొస్తే ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. ఆ రెండు స్థలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలి విడతల్లోనే తొలగించారు. ప్రస్తుతం పంచాయతీకి, ఆర్‌అండ్‌బీ రోడ్డుకి హద్దుగా ఉన్న సైడు కాలువకు అవతల, ఇవతల స్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తూ కాలువల్లో పూడికలు తొలిగిస్తున్నారు. ఈకార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పంచాయతీ సభ్యుడు మక్కెన కోటేశ్వరరావును పలు చోట్లు అడ్డుకుంటుండడం గమనార్హం.

ఘనంగా పుస్తకావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ విద్యావేత్త పీహెచ్‌జీ.కృష్ణంరాజు (రాజుమాస్టర్) రచించిన సేజ్ రిఫ్లెక్షన్స్ పుస్తకావిష్కరణ సభ ఆదివారం రాత్రి ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం యువతకు సంబంధించి ఒక ఋషి ఆలోచనలను ప్రతిబింబిస్తుందన్నారు. ధైర్యం, ఆత్మస్థైర్యం, పోటీ పరీక్షలలో విజయం, తల్లి, తండ్రుల పట్ల బాధ్యత, మహిళలను గౌరవించటం మొదలైన అనేక అంశాలు పుస్తకంలో పొందుపరిచినట్లు చెప్పారు. విశ్రాంత అధ్యాపకులు వేమూరి చిరంజీవి మాట్లాడుతూ విద్యావేత్తగా ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన రాజుమాస్టర్ వారికి ఉపయోగపడే ఒక మంచి పుస్తకాన్ని రచించడం అభినందనీయమని అన్నారు. ఏపీఐసీ సెక్రటరీ వి.సాంబశివరాజు మాట్లాడుతూ ఇటువంటి పుస్తకాలను పాఠ్యాంశాలుగా చేరిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టి.అరుణ, చుండూరి రవిబాబు, మంత్రి శ్రీనివాసరావు, పొన్నూరు వేంకట శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ


సైకిళ్లను అందచేస్తున్న రఘుకిరణ్, రోటరీ సభ్యులు

చీమకుర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థినుల విద్యాభివృద్ధి కోసం రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో ఆదివారం సైకిళ్లను పంపిణీ చేశారు. గోనుగుంట జడ్పీ హైస్కూలులో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినులు అలేఖ్య, హసనకుమారి, బిందుమాధవి, గాడిపర్తివారిపాలెం హైస్కూల్‌కి చెందిన అమ్ములు, తులసి, అపర్ణలకు ఆదివారం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో సైకిళ్లను క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్షులు కడవా రామకృష్ణ, కార్యదర్శి కందుకూరి వెంకట సుధాకరబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు గొల్లపూడి వెంకట్రావు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, పోకూరి తిరువెంగళం, రామకృష్ణారెడ్డి, తొగటి శ్రీనివాసరావు, దుడ్డు శంకర్, పోతుల వీరనారాయణ, సత్యం, నారిపెద్ది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4వ తేదీ నుంచి అండర్-17 ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా ప్రధానకార్యదర్శి హాజీరాబేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు స్టడీ, మార్కులలిస్ట్, ఆధార్‌కార్డు లతో కనపర్తి పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

రేపు పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవసభ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ 50 ఏళ్ళ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 5న విజయవాడలో జరిగే అర్ధశతాబ్ది ఉత్సవసభ విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా విద్యారంగ సమస్యలపరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిందన్నారు. శాస్త్రీయ విద్యే ధ్యేయంగా, అసమానతలు లేని సమాజం కోసం కృషి చేసినట్లు చెప్పారు. విజయవాడలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, అన్వేష్, సుధాకర్, లక్ష్మణరావు, నిరంజన్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఐఎల్‌పీ సభ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చేనెల 26న జరగనున్న ఇండిపెండెంట్ లేబర్ పార్టీ(ఐఎల్‌పీ) 18వ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం కోరారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల వద్ద ఆదివారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ప్రథమ మహాసభ అదేరోజు విజయవాడలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు బీహరిబాబు, జాన్‌రిచర్డ్స్, చావల వంశీకృష్ణ, ధీరజ్‌బాబు, సందీప్‌ప్రకాష్, ఎం.శరత్, ఎం.రవితేజ, కొల్లా భారతి, సమీర్, సుధాకర్‌బాబులు సుమారు 1590 మంది ఉచిత వైద్య సేవలను అందించారు. రోగులకు రెండు నెలలకు సరిపడే మందులను రూ.200లకే అందజేసినట్లు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు రాపర్లకు చెందిన ఢాకా చింపిరెడ్డి, ఆయన భార్య వెంకమ్మల జ్ఞాపకార్థం రూ.10వేలను సుబ్బారెడ్డి అందజేశారు. డాక్టర్ జవహర్ రూ.10వేలు, మద్దిపాడుకు చెందిన సుబ్బారావు రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

33 మంది రోగులకు పరీక్షలు

కొండపి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ మన ఊరి వికాసం ఆధ్వర్యంలో 33 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒంగోలు దేవీ వైద్యశాల వైద్యుడు కృష్ణమోహన్ పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుకోవడంతోపాటు వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లతో వ్యాధులబారినుంచి తప్పించుకోవాలని సూచించారు.


చెరువుకట్ట కింద ఉన్న మర్రిచెట్టు


చెరువుకట్టపై ఉన్న రావిచెట్టు

కంభం చెరువుకే కాదు.. చెట్లకూ ఉంది ఓ చరిత్ర

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన చారిత్రాత్మక కంభం చెరువుకే కాదు దాని సమీపంలోని చెట్లకు కూడా శతాబ్దాల నాటి చరిత్ర ఉన్నది. కట్టపై ఉన్న రావిచెట్టు, కట్ట కింద రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టు 500 ఏళ్ల నాటివి. రెండు కొండల మధ్య అత్యంత విశాలంగా బండరాళ్లు పెట్టి వాటి మధ్య సీసం కరిగించి కట్టను ఏర్పాటు చేశారు. దానిపై శ్రీకృష్ణదేవరాయులు భార్య రావి మొక్కను నాటి చుట్టూ అరుగు నిర్మించినట్లు, కట్ట కింద కూడా సేద తీరేందుకు మరో మర్రి మొక్కను నాటినట్లు చరిత్ర చెబుతోంది. నాడు నాటిన మొక్కలే నేడు మహా వృక్షాలై విశాలంగా విస్తరించాయి.


త్రిపురాంతకంలో ధ్వజ స్తంభానికి మొక్కుతున్న సినీ నటుడు సుమన్

ఆలయాల్లో నటుడు సుమన్ పూజలు

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్లను సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరునికి మహాన్యాసపూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీ దేవికి అర్చనలు చేశారు. అనంతరం స్థానిక వాసవీ అన్నసత్రంలో ఏర్పాటు చేసిన గౌడ కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం!

- ముగిసిన కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు
- అస్తవ్యస్తంగా జాతీయ రహదారి
- ఓ వైపు బీటలు..మరో వైపు చిట్టడవిలా కంపచెట్లు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నాగులుప్పలపాడు మండలంలోని జాతీయ రహదారి-216 నిర్వహణను ఆశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ గాలికొదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం త్రోవగుంట నుంచి దిగమర్రు వరకు చేపట్టిన రెండు వరుసల సిమెంట్ రోడ్డుతో కూడిన జాతీయ రహదారి నిర్మాణ పనులను దిలీప్ బిల్డ్‌కాన్ కంపెనీ పనులను దక్కించుకొని పూర్తిచేసింది. ఉప్పుగుండూరు సమీపంలో టోల్‌గేట్‌ను సైతం ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసుకొంటున్నారు.

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మించిన కాంట్రాక్టరు కొన్నేళ్లపాటు ఆ రహదారి నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టరు హైవే-216 నిర్వహణ బాధ్యతలు ఈ ఏడాది జూన్ నాటికి ముగిసినట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి రహదారి నిర్వహణ పట్టించుకున్న నాథుడు లేక గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. వెరసి రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లు దాటి ముళ్లకంప, చెట్లు రోడ్డు పైకి పాకడంతో ఎదురుగా వాహనాలు వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డుమార్జిన్‌లోకి వెళ్లిన ద్విచక్ర వాహనదారులకు ముళ్ల కంపలు గీసుకొని గాయాలపాలవుతున్నారు. మార్జిన్‌లు సైతం గడ్డి,పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పలు చోట్ల రహదారికి పగుళ్లు వచ్చి ద్విచక్ర వాహనాల టైర్లు ఇరుక్కుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కంప చెట్లు కప్పేశాయి. ముళ్లకంపల మధ్య దర్శనమిస్తున్నాయి. దాంతో సూచిక బోర్డులు కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త వారికి గ్రామాల వివరాలు, రోడ్డు పరిస్థితి తెలియక నానా తంటాలు పడుతున్నారు. డివైడర్లు ప్రమాదాలు జరిగిన సమయంలో పగిలిపోయి దెబ్బతిని ఉన్నాయి. పలు ప్రాంతాలలో డివైడర్లకు రేడియం స్టిక్కర్లు, రంగులు వెలసిపోయాయి. అటువైపుగా అధికారులు దృష్టి సారించకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. మార్జిన్లలో సన్నటిరాళ్ల ,మట్టి పేరుకుపోయి ద్విచక్ర వాహనాలు పట్టు తప్పి కింద పడుతున్న సందర్భాలు అనేకం. సాధారణంగా రహదారి మార్జిన్లలో చేరిన మట్టి,రాళ్ల,ఇసుక లాంటి వాటిని ఎప్పటికప్పుడు కూలీలతో తొలగించాల్సి ఉంది. గుత్తేదారు నిర్వహణ సమయం ముగిసిన తర్వాత రహదారి నిర్వహణ బాధ్యతలు అధికారులు విస్మరించారు. ఓ వైపు రహదారికి ఇరువైపులా దట్టంగా అల్లుకుపోయిన ముళ్లకంప, అలాగే చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయి మరో వైపు బీటలు వారుతూ ఇది నిజంగా జాతీయ రహదారేనా అన్న సందేహం కలుగక మానదు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రహదారి పరిస్థితి దృష్ట్యా ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని వాహనదారులు హడలెత్తుతున్నారు.

మమ.. అనిపించారు...

గత కొద్ది నెలల నుంచి జాతీయ రహదారి-216 నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇక హైవే అధికారులు కేవలం రహదారికి ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో చెట్లు తొలగించే పనిని చేపట్టారు. ఆయా పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపించిందన్న విమర్శలు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఎక్కడి చెట్లు అక్కడే వదిలేశారు. రోడ్డుపై పడిన బీటల వైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. రహదారి పక్కనున్న సూచిక బోర్డుల చుట్టూ కంప చెట్లు అలానే దర్శనమివ్వడం పట్ల అధికారుల పని తీరు అర్థమవుతుంది. మొత్తం మీద మమ అనిపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి హైవేకు ఏర్పడిన బీటలు సరిచేసి రహదారి నిర్వహణ పనులను సంపూర్ణంగా నిర్వహించి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


మరమ్మతులకు నోచుకోని పగుళ్లిచ్చిన డివైడర్



ముళ్లకంపల మధ్యలో సూచిక బోర్డు



అసంపూర్తి పనులతో రహదారి పైకి వచ్చిన ముళ్లకంప చెట్లు


బోనేనిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బోనేనికి ఘనంగా సన్మానం

గిద్దలూరు టౌన్, నవంబరు 3 : కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ అమ్మ ఫౌండేషన్ సేవా సంస్థను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బోనేని వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. అంతర్జాతీయ కల్చరల్ యూనివర్సిటీ ద్వారా వెంకటేశ్వర్లు గౌరవ డాక్టరేట్ పొందారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు అనంతరం డాక్టరేట్ పొందిన వెంకటేశ్వర్లును సన్మానించారు. అటు పార్టీ అభివృద్ధి, ఇటు పేదలకు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్న బోనేనిని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితోపాటు దేవస్థాన కమిటీ ప్రతినిధులు కొనియాడారు.

పార్కింగ్‌లో ఉన్న కారు దగ్ధం

ఒంగోలుక్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పార్కు చేసిన కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేషగిరి కారును రోడ్డు పక్కన పార్కు చేసి విధి నిర్వహణకు వెళ్లారు. రాత్రి 7.30 గంటల సమయంలో కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దట్టంగా పొగ వ్యాపించింది. అక్కడ కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కారు దగ్ధమవుతోందని స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేశారు. దీంతో ఫైరింజన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కారు సాంకేతిక లోపాల వల్ల దగ్ధమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.


దగ్ధమవుతున్న కారు

మానవత్వాన్ని చాటుకున్న యోగా గురువు

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో పడి ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని సగిలేరునది సమీపంలో శనివారం రాత్రి ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వెళుతూ కిందపడి గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు చూస్తుండి పోయారే కానీ, ఆ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చేందుకు ముందుకు రాలేదు. ఆసమయంలో పీఆర్‌కాలనీ నుంచి పట్టణంలోకి వస్తున్న నారాయణరెడ్డి, రక్తగాయాలతో పడి ఉన్న వ్యక్తిని చూసి చలించి అక్కడున్న కొంతమంది వ్యక్తుల సహాయంతో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం గంట తరువాత ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చాడు. అర్బన్‌కాలనీకి చెందిన నేరెళ్ల ఓబయ్య అని తెలుసుకుని వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నాడు.

చెరువులో అక్రమ సాగు నిలిపివేత

- ట్రాక్టర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు


అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి చెరువును ఆక్రమించి అక్రమంగా సాగు చేసుకునేందుకు ఇరువురు గ్రామస్థులు ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్‌వో రంగయ్య హుటాహుటిన అక్కడకు చేరుకుని ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

కోతుల బెడదతో ప్రజల బెంబేలు

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లపాడులో కోతుల బెడద ఎక్కువైంది. 40 నుంచి 50 కోతులు గుంపులు గుంపులుగా ఏర్పడి ముండ్లపాడులోని పలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. కోతుల గుంపు వీధిలోకి వచ్చిందంటే చాలు ఆ వీధిలోని ప్రజలందరూ ఇళ్లకు వాకిళ్లు వేసుకుని లోపల దాక్కోవలసిన పరిస్థితి నెలకొంటున్నది. ఆ కోతుల గుంపు పక్క ప్రాంతానికి వెళ్లే వరకు ఆ వీధుల్లో జనసంచారం ఉండదు. కోతుల బెడద నుంచి కాపాడాలని ముండ్లపాడు ప్రజలు కోరుతున్నారు.

భార్యపై గొడ్డలితో దాడి

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

పుల్లలచెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త గొడ్డలితో దాడిచేసిన ఘటన మండలంలోని చాపలమడుగు గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చాపలమడుగుకు చెందిన చల్లగుండ్ల సామ్రాజ్యం అలియాస్ రోగయ్య అనే వ్యక్తి తన భార్య ఎస్తేరురాణిపై శుక్రవారం గొడ్డలితో దాడి చేశాడు. దీంతో బాధితురాలు పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సంపత్ కుమార్ సామ్రాజ్యంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచాడు. నిందితుడికి న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

అటకెక్కిన సామగ్రి

- ఎంపీడీవో కార్యాలయంలో పనిచేయని జనరేటర్లు, టీవీ
- ప్రజాధనంపై నిర్లక్ష్యం


కంభం ఎంపీడీవో కార్యాలయం

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కార్యాలయాలలో వివిధ పరికరాలు సమకూర్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారైంది. కంప్యూటర్లు, జనరేటర్లు టీవీలు తదితర ఖరీదైన పరికరాలు కొనుగోలు చేసి ఇచ్చినా అవి కొన్ని నెలల వ్యవధిలోనే మూలనపడుతున్నాయి. పెద్దమొత్తంలో ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేయడం మినహా అవి అందించే సేవలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కార్యాలయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం వలన ప్రజలకు సేవలు నిలిచిపోకూడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్ ఏర్పాటు చేసింది. విద్యుత్ లేని సమయంలో ఇది ఎంతగానో ఉపయోగపడేది. అయితే కొద్దికాలం మాత్రమే పని చేసింది. ఆ తరువాత కంప్యూటర్లకు బ్యాటరీలు ఏర్పాటు చేయడంతో జనరేటర్ అవసరం లేకుండా పోయింది. వాటి నిర్వహణ పట్టించుకునే వారులేక శిథిలమయ్యాయి.

కానరాని టీవీ ప్రసారాలు

ప్రభుత్వ పథకాల గురించి అవగాహన, ఉన్నతాధికారుల సందేశాల గురించి అందించేందుకు మనటీవీ ప్రసారాలు ఎంతగానో దోహదపడేవి. ఈక్రమంలో వాటిని కొన్నేళ్ల క్రితం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా మూడేళ్లలో మనటీవీ ప్రసారాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షలు చేస్తున్నారు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీవీ కాస్త అటకెక్కగా ప్రసారాలు లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న పరికరాలను అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మూలన పడిన జనరేటర్, టీవీ

గొడవ పడొద్దని చెప్పినందుకు దాడి

ఒంగోలు క్రైం, నవంబరు3(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో కొంతమంది గొడవ పడుతుండగా అడ్డు తీసే ప్రయత్నం చేసిన అ య్యప్ప మాలధారిపై దాడి చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరం లాయర్‌పేటలోని సెంట్రల్‌కేఫ్ వద్ద శనివారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సీవీఎన్ రూం ఎదురుగా ఉన్న ద్వారకనగర్‌లో నివాసం ఉంటున్న రావులపల్లి ప్రేమ్ కుమార్ అయప్పస్వామి మాల ధరించి ఉన్నాడు. ఆయన బండ్లమిట్ట వెళ్లి మోటర్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అయితే సెంట్రల్‌కేఫ్ వద్ద కొంత మంది గొడవ పడుతున్నారు. దీంతో ప్రేమ్‌కుమార్ వెళ్ళి వారిని నిలువరించే ప్రయత్నం చేశాడు. దీంతో వారు నీవెవరూ మా మధ్యలో అంటూ దుర్భాషలాడి కర్రలతో దాడి చేశారు. బాధితుడు తన సోదరుడికి ఫోన్ చేసి పిలిపించుకొని స్థానిక రిమ్స్‌లో చేరాడు. అక్కడ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

రేపు పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ 50 ఏళ్ళ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 5న విజయవాడలో జరిగే అర్ధశతాబ్ధి ఉత్సవసభ విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిందన్నారు. విజయవాడలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, అన్వేష్, సుధాకర్, లక్ష్మణరావు, ని రంజన్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు!

- ఎక్కడ చూసినా శునకాల గుంపులే
- కట్టడికి చొరవచూపని యంత్రాంగం
- ఆందోళనలో మార్కాపురం వాసులు


వీధుల్లో తిష్టవేసిన శునకాలు

మార్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కుక్కల సంఖ్య పెద్ద ఎత్తున పెరిగింది. గతంలో శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా శునకాలు ఉండేవి. కానీ ప్రధాన పట్టణంలో కూడా ప్రస్తుతం విపరీతంగా కుక్కలు తిరుగుతున్నాయి. పగటి సమయంలో ఎలావున్నా రాత్రి వేళల్లో వాటి వలన ప్రజలు బెంబేలెత్తిపోవాల్సి వస్తోంది. బైక్‌పై వెళ్లే వారిని అవి వెంబడిస్తుండటంతో వాటికి భయపడి కిందపడి గాయాలపాలైన వాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు. ఒకటి రెండు కుక్కలైతే ఫర్వాలేదు. పదికిపైగా ఉండే గుంపు ఒక్కసారిగా వెంటపడుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు కుక్కల ఉత్పత్తి పెరగకుండా పునరుత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు చేయించేవాళ్లు. ప్రస్తుత పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టిసారించడంలేదు. దీంతో పురప్రజలకు శునకాల బాధ తప్పడంలేదు.

బైకుపై వెళుతుండగా దాడి

పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని పుత్తూరు వైద్యశాల సమీపంలో సుబ్బారెడ్డి అనే వ్యక్తి రాత్రి సమయంలో బైక్‌పై వెళుతున్నాడు. ఒక్కసారిగా కుక్కల గుంపు వెంటపడ్డాయి. వాటిని తప్పించుకునే క్రమంలో బైక్ గుంతలో పడింది. దీంతో కింద పడడంతో ఒక్కసారిగా కుక్కలు దాడి చేసేందుకు ప్రయత్నించింది. చుట్టుపక్కల వాళ్లు తరిమేసరికి వెళ్లిపోయాయి. బైక్‌పై వెళ్తున్న సుబ్బారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పట్టణంలోని కాలేజీ రోడ్డులో సప్తగిరి లాడ్జీ సమీపంలో బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై ఉదయం సమయంలోనే కుక్కల గుంపు వెంటపడింది. బైక్ ఆపి వాటిని తరుముతుంటేనే ఓ కుక్క కాలిపై కరిచింది. ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది.

ప్రస్తుతం వ్యాక్సిన్లు వేస్తున్నాం :

మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. వాటి వలన ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ఆడకుక్కలకు ఆపరేషన్లు చేయించేవాళ్లు. ప్రస్తుతం ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశాం. మరో పది రోజుల్లో ఆపరేషన్లు చేయిస్తాం. ప్రస్తుతం కుక్కలు దాడిచేసి కరిచినా ర్యాబిస్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు వాటికి వ్యాక్సిన్ వేయిస్తున్నాం. రోజుకు 50 నుంచి 100 కుక్కలకు వాక్సినేషన్ నిర్వహిస్తున్నాం. **నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం**

గణనీయం పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం

- మూడేళ్లుగా లాభాలు వస్తుండడంతో రైతులు మొగ్గు
- సంప్రదాయ పంటలకు స్వస్తి


పుల్లలచెరువులో సాగులో ఉన్న పొగ తోట

పుల్లలచెరువు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఏళ్లగా సాగు చేస్తున్న సాంప్రదాయ పంటలకు రైతులు రోజురోజుకు స్వస్తి చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. తీవ్ర కరువుతో పంటలకు నీరు అందుతుందన్న నమ్మకం లేక రైతులు తక్కువ నీటితో సాగయ్యే పొగాకు వైపు ఆసక్తి చూపుతున్నారు.

మూడేళ్ల క్రితం పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో మిర్చి,పత్తి, కంది పంటలను విస్తృతంగా సాగు చేసేవారు. అయితే పైరు పూత, కాయ దశలో ఉన్నప్పుడు తీవ్ర వర్షభావంతో పంటలు మధ్యలోనే ఎండుముఖం పట్టి దిగుబడి గణనీయం తగ్గుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పుల్లలచెరువు మండలంలో కొంత మంది రైతులు పొగాకు సాగు చేపట్టారు. గత రెండు మూడేళ్లగా ఈ పైరు రైతులకు లాభాలు తెచ్చిపెట్టింది. దీంతో సదరు రైతులు తమ అనుభవాలను మిగిలిన రైతులకు చెప్పడంతో మిగిలిన వారు సాగు చేపడుతున్నారు. పొగాకు కంపెనీలు కూడా మార్కెట్టుకు తగ్గట్టుగా క్వింటాకు రూ.15 నుంచి రూ.18 వేల వరకు స్థానికంగానే కొనుగోలు చేస్తున్నారు. ఇటు రైతులతో పాటు రైతు కూలీలకు మంచి కూలీ లభిస్తుండటంతో రైతులు పొగాకు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే పొగాకు సాగు వల్ల ఈ మండలాల్లో కంది, పత్తి, మిరప పైర్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. వైపాలెం నియోజకవర్గంలో సూమారు 8 వేల హెక్టార్లకు పైగాఈ ఏడాది పొగాకు సాగైంది.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ


మాట్లాడుతున్న వీరాంజనేయులు

పొదిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మండలశాఖ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయలు పాల్గొని మాట్లాడారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలైన సందర్భంగా మండల సభలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేయడం ద్వారా అప్రంటీస్, కౌన్సెలింగ్, ఆటోమేటిక్ అడ్వాన్స్‌స్కీం, రీగ్రూపింగ్ స్కేల్ మొదలైన అంశాలు సాధించుకున్నట్లు తెలిపారు. సీపీఎస్ రద్దుకోసం అనేక పోరాటాలు చేయడం వలన నేడు సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలి పెన్షన్, గ్రాట్యూటీ మెదలగు అంశాలు లభించాయన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవోనంబరు 115ను రద్దు చేసి విద్యారంగ వ్యవస్థను కాపాడాలన్నారు. సంఘనాయకుల పిలపును అనుసరించి కార్యక్రమాలకు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేసినప్పుడే ఉద్యోగ, ఉపాధ్యా యులకు మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పిల్లి రమణారెడ్డి, పి.బాలవెంకటేశ్వర్లు, అబ్దుల్ హై, బుచ్చిబాబు, ఎం.శ్రీనివాస రెడ్డి, సుబ్బారావు, ఏ.బాదుల్లా, ఎం రమేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు : మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య గౌరవాధ్యక్షులు ఈ.రమణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈ.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పి.సుబ్బరాయుడు, సహ అధ్యక్షులుగా సయ్యద్ ఖాదర్, సహ అధ్యక్షురాలిగా బి.అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి, ఎన్నికల అధికారిగా రమణరెడ్డి, పరిశీలకులుగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షులుగా ఎన్నికైన మొర్రి పిచ్చయ్య తెలిపారు.

గ్రంథాలయాలకు పూర్వవైభవం వచ్చేనా ?



శిథిలావస్థలో ఉన్న కంభంలోని గ్రంథాలయం

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యలతో కునారిల్లుతున్న జిల్లాలోని గ్రంథాలయాలకు పూర్వవైభవం వస్తుందా? అని పాఠక, పుస్తక ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మొత్తం 66 గ్రంథాలయాలు ఉండగా అందులో 45 గ్రంథాలయాలు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన 12 గ్రంథాలయాలకు గ్రంథ పాలకులను నియమించక పోవడంతో నాలుగైదు సంవత్సరాలుగా మూతపడి ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న 45 గ్రంథాలయాలు కూడా వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే తెరుచుకుంటున్నాయి. ఒక గ్రంథ పాలకుడు రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. పలుచోట్ల గ్రంథాలయాలు కేవలం రెండు, మూడు రోజులు తెరవకోవడంతో నిరుద్యోగులు, పాఠకులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో గ్రంథాలయాల నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ ఉన్నది. మొత్తం గ్రంథపాలకుల పోస్టులు 105కు గాను 40 మంది మాత్రమే విధులు నిర్వహిస్తుండగా 65 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో గ్రేడ్-1 పోస్టులు 3 ఉండగా ఇద్దరు పని చేస్తున్నారు. గ్రేడ్-2 పోస్టులు 4 ఉండగా 4 ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్-3లో 43 ఉండగా 30 మంది పనిచేస్తున్నారు. రికార్డు అసిస్టెంట్లు 27కుగాను ఐదుగురు పనిచేస్తున్నారు. 22 ఖాళీగా ఉన్నాయి. వాచ్‌మెన్ పోస్టులు 18కి గాను ఇద్దరు పని చేస్తుండగా 16 ఖాళీగా ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ పోస్టులు 11 ఉండగా 11 ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 64 గ్రంథాలయాలకు బిల్డింగ్‌లు ఉండగా ప్రభుత్వం నిర్మించినవి 32 కాగా 18 అద్దె భవనాలు. ఇదీ జిల్లాలోని గ్రంథాలయాల పరిస్థితి.

మొక్కుబడిగా వారోత్సవాలు

జిల్లాలో పలు గ్రంథాలయాలకు గ్రంథపాలకులు లేకపోవడంతో గ్రంథాలయ వారోత్సవాలు ఏడాదికి ఒకసారి మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. కంభం మండలం రావిపాడు గ్రంథాలయంలో నాలుగు సంవత్సరాల క్రితం గ్రంథపాలకుడు బదిలీపై వెళ్లగా ఎవరినీ నియమించలేదు. కంభం గ్రంథాలయంలో ఇన్‌చార్జి గ్రంథపాలకుడు తర్లుపాడుకు బదిలీ కావడంతో గత ఏడాదిగా మూసివేశారు. ఎన్నో గ్రంథాలయాలు మూసివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా గ్రంథపాలకులను నియమించి పూర్వవైభవం వచ్చేలా చూడాలని ప్రజలు, పాఠకులు కోరుతున్నారు.

కలగానే సాగర్‌కాలువపై రెండో వంతెన నిర్మాణం

దశాబ్దాలుగా ప్రజలు, భక్తుల అవస్థలు


త్రిపురాంతకం వెళ్లడానికి సాగర్ కాలువపై ఉన్న వంతెన

త్రిపురాంతకం, నవంబరు 3 : భక్తులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సాగర్ కాలువపై రెండో వంతెన నిర్మాణం ప్రభుత్వ పెద్దల హామీలకే పరిమితమైంది. త్రిపురాంతకం నుంచి ఆలయానికి చేరుకోవడానికి, తిరుగు పయనం కావడానికి వంతెన దాటడం ఒక్కటే మార్గం. ఈ మార్గ మధ్యలో సాగర్ కుడి కాలువ ఉండగా కాలువ నిర్మాణ సమయంలో సుమారు 12 అడుగుల వెడల్పుతో వంతెన కూడా నిర్మించారు. ఇప్పటికీ త్రిపురాంతకం నుంచి ఆలయాలకు, చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, లేళ్లపల్లి, దువ్వలి, వై.పాలెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెన నుంచే ప్రయాణించాలి. ఏటా మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో వంతెన వద్ద ట్రాఫిక్ నిలుస్తూ భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మూడు గంటల నుంచి ఐదు గంటల పాటు ట్రాఫిక్‌లో భక్తులు చిక్కుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కాగా ఎన్నో ఏళ్ల నుండి భక్తులు వంతెనను వెడల్పు చేయాలని, రెండో వంతెనను నిర్మించాలని కోరుతున్నా అధికారులుకానీ, ప్రజా ప్రతినిధులు కానీ దీనిపై దృష్టి సారించడంలేదు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డేవిడ్‌రాజు వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చినా అమలుచేయలేక పోయాడు. 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి సైతం అయిన ఆదిమూలపు సురేష్ 2020, 2021, 2022, 2023లలో వరసగా హామీల పరంపర కొనసాగించారు. సమీక్షల సందర్భంగా వంతెనను నిర్మిస్తామని మంత్రి హోదాలో హామీ ఇచ్చారు. ఆ హామీకి కూడా కాలం చెల్లిపోయింది. కాగా ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలోనైనా రెండో వంతెనను నిర్మిస్తే ఉత్సవాల సమయంలో భక్తుల ఇక్కట్లు, ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవిని వృద్ధాశ్రమానికి దాత కోటా సత్యనారాయణ సమకూర్చిన నిత్యవసర వస్తువులను సీఐ సురేష్ అందజేశారు. ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్మానియేలు, దాత కోటా సత్యనారాయణ, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లతో పారిశుధ్య కార్మికులు

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తమతండ్రి భూతపాటి ఆశీర్వాదం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అనీల్‌కుమార్, కుమార్తె సుజాతలు కంభం మండలం కందులాపురం గ్రామపంచాయతీ కార్మికులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు దుప్పట్లు పంపిణీ చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూర్‌బాష సంఘం అధ్యక్షుడిగా దర్గయ్య


నియామక పత్రం అందుకుంటున్న దర్గయ్య

పెద్దదోర్నాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నూర్‌బాష సంఘం మండల అధ్యక్షులుగా డీ.దర్గయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మీరావలి ప్రధాన కార్యదర్శి ఖాశీంసాహెబ్ గౌరవ సలహాదారులు మస్తాన్‌వలి కోశాధికారి మురళి ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎంపిక చేసి నియామక పత్రం అందజేశారు.

దీక్షధారులకు భిక్ష ఏర్పాటు



భిక్ష చేస్తున్న అయ్యప్ప దీక్షధారులు

పొదిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఏటా మాదిరిగా వివిధ స్వాముల దీక్ష తీసుకున్న భక్తులకు ఆదివారం నుంచి భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు కందుల విఘ్నేష్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా దాతల సహాయంతో వందలాదిమంది స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహాయం అందించాలన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతల సహాయం ఎంతో అవసరమని అందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. అనంతరం విఘ్నేష్‌రెడ్డిని గురుస్వాములు సన్మానించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గ కాకతీయ (కమ్మ) సేవా సమితి నూతన కార్యవర్గాన్ని కంభంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ పెద్దలు గని వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకతీయ సేవా సమితి అధ్యక్షులుగా రావూరి వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షులుగా పాకా చిన్నఈశ్వరయ్య, కార్యదర్శిగా బోయపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి కరణం లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా ఇప్పర్ల వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా కరణం బాలకోటయ్య, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 24న ఆదివారం కంభం చెరువుకట్టపై కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున కాకతీయ సేవాసంఘం వారందరూ హాజరు కావలసిందిగా వారు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పొదిలి, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పొదిలి పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వాములు దీవి శ్రీకాంత్‌బట్టర్, మురళీకృష్ణమాచార్యులు, రుషికేశవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. 9వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

గిద్దలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురిని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. రాచర్ల ఐటీడీపీ అధ్యక్షులు పఠాన్ జఫ్రుల్లాఖాన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుప్పాల రమేష్‌బాబు అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెంట టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కె.యోగానంద్, టీడీపీ నాయకులు జీవనేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ముఖాముఖి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

ఎస్.సాంబశివరావు, ఎంఈవో, దొనకొండ

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యాభివృద్ధి సక్రమంగా కొనసాగటం లేదనే విమర్శలు వాస్తవమేనా?

జవాబు: మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో వర్క్ అడ్జస్టుమెంట్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు సర్దుబాటు చేశాం. ఎటువంటి ఉపాధ్యాయుల కొరత లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాం

ప్ర: నాడు-నేడు పథకంలో పూర్తికాని పాఠశాలలు ఉన్నాయా ?

జ: నాడు-నేడు పథకం ఫేస్-2లో ఎంపికైన 39 పాఠశాలల్లో 60 శాతం పనులు మాత్రమే జరిగాయి. మూడో విడత నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరుకాగానే మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపడతాం.

ప్ర: మధ్యాహ్న భోజన పథకంలో రాజకీయ జోక్యం పెరిగిందా ?

జ: ఎటువంటి రాజకీయ జోక్యం లేదు. ఆరోగ్యం బాగాలేక ఒకరిద్దరు మానుకుంటే కమిటీ తీర్మానం మేరకు నియామకం జరిపేలా చర్యలు చేపట్టాం. ప్రతిరోజు పాఠశాలలను పర్యవేక్షిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిహారం అందిస్తున్నాం.

ప్ర: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయటం లేదనే విమర్శలు వాస్తవమేనా?

జ: అన్నీ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యాబోధన జరిగేలా పర్యవేక్షిస్తున్నాం.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

దర్శి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ దర్శి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీనుగ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఖాశీం, గౌరవాధ్యక్షుడిగా ఎం.మల్లారెడ్డి ఎన్నికయ్యారు. సహ అధ్యక్షురాలిగా ఎల్ఆర్ స్రవంతి, సహ అధ్యక్షుడిగా ఏ.రామారావు, మహిళా కార్యదర్శిగా వైవీ రాజేశ్వరి, కార్యదర్శులుగా నర్సింహం, పి.శ్రీనివాసరావు, ఎం.రమణారెడ్డి, ఆర్.బాజీవలి, ఎం.తిరుపతిరెడ్డి, కె.రోశయ్య, పి.వెంకటేశ్వర్లు, ఈ.నాగిరెడ్డి, జె.రవికుమార్, కె.విజయభాస్కర్, మహిళా కమిటీ కన్వీనర్లుగా బి. అరుణకుమారి, జె మస్తాన్‌బీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భీమవరంలో పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ అనమనమూరి సుజాత ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. . పంచాయతీ కార్యదర్శి వీరబ్రహ్మాచారి సిబ్బందితో భీమవరంలోని పలు వీధులు, ఎస్సీ బీసీ కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామాల్లో జ్వరాలు రావటంతో ముందుజాగ్రత్తగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాలతో కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని ఆపార్టీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య అన్నారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలోగల అంబేడ్కర్ కాలనీలో ఆదివారం టీడీపీ సభ్యత్వాలను చేర్పించారు. సభ్యత్వాలు తీసుకున్న కార్యకర్తలు ప్రమాదశాత్తు మరణిస్తే సదరు కుటుంబానికి రూ.5 లక్షలు బీమా కింద పార్టీ చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కోలా కృష్ణమూర్తి, యాదాల చెన్నకేశవులు, నీలం సురేష్, ఎం.జనార్దన్, కె.ఆదియ, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జారిపడి యువకుడి మృతి


మృతిచెందిన శ్రీరామ్(ఫైల్)

దర్శి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని సందువారిపాలెంకు చెందిన తలపాటి శ్రీరామ్(18) ఆదివారం చెరువులో జారిపడి మృతి చెందాడు. ఆ యువకుడు ఆర్కెస్ట్రాలో పనులకు వెళ్తుంటాడు. ఖాళీ సమయాల్లో చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో దర్శి పట్టణ సమీపంలోని చింతలపాలెం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్కడ నీళ్లల్లో జారిపడి మృతి చెందాడు. మృతదేహం కోసం గాలిస్తున్నారు.

యోగా పోటీల్లో పామూరు విద్యార్థుల ప్రతిభ


యోగా అభ్యసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరుగుతున్న అండర్ - 14, 17, బాల బాలికల రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదివారం విద్యార్థుల ప్రదర్శనను నిర్వాహకులు ప్రశంసించారు. మూడురోజులపాటు జరిగిన ఈ ప్రదర్శనల్లో పామూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించినట్టు వ్యాయామ ఉపాధ్యాయిని మస్తాని తెలిపారు. .

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతైన పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, నూజెండ్లపల్లి, శంకరాపురం, బొప్పూడివారిపాలెం, ఈదరలో అంకమ్మ తల్లికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

- హుండీలు పగులకొట్టి సొమ్ము అపహరణ
- సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని పోలీసుల సూచన


బ్రహ్మంగారి దేవాలయం

కురిచేడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలోని దేవాలయాల్లో దొంగలు పడుతున్నారు. వరుస దొంగతనాలతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. దేవాలయాల్లో భక్తులు సమర్పించిన హుండీ సొమ్మును అపహరిస్తున్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

మండలంలోని ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉన్నాయి. ఆలయాలకు భక్తులు వెళ్ళి తృణమో పణమో సమర్పించి భక్తిని చాటుకుంటారు. హుండీలలో డబ్బులు చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ వార్షికోత్సవాల ముందు మాత్రమే కమిటీవారు హుండీలను తెరచి ఆ డబ్బులకు మరికొంత జోడించి ఉత్సవాలు వైభవంగా జరుపుతుంటారు. ఈ హుండీల సొమ్ముకోసం దొంగలు కాపు కాస్తున్నారు. ఎవరూ లేని సమయాలు చూసి ఆలయాల తాళాలు పగులకొట్టి హుండీలను ఆలయాలకు దూరంగా ఎత్తుకెళ్ళి పగులకొట్టి సొమ్మును అపహరిస్తున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నా ఇంతవరకూ ఫలితం లేదు.

గతంలో పొట్లపాడు గ్రామంలోని పురాతన కోదండ రామాలయంలో హనుమత్ సమేత రామలక్ష్మణ పంచలోహ విగ్రహాలను దోచుకెళ్ళారు. కొన్ని సంవత్సరాల పాటు ఆ విగ్రహాలు లభ్యంకాలేదు. పోలీసులు కేసు మూసివేసే దశలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలానికి చెందిన దొంగల మధ్య అభిప్రాయబేధాలతో దొంగతనం విషయం బయటకు పొక్కింది. ఓ సమాధి చుట్టూ పాతిపెట్టి ఉంచిన విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆలయానికి అప్పగించారు. అలాగే, కురిచేడు జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో శఠగోపం, గంట తదితరాలు దొంగిలిస్తే వెంటనే పట్టుకుని ఆలయానికి అప్పగించారు. అప్పటినుంచి ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని పోలీసులు ఆలయ కమిటీలకు సూచిస్తున్నారు. పెద్ద దేవాలయాల్లో వెంటనే ఏర్పాటుచేశారు.


ఆలయానికి దూరంగా పగులకొట్టి ఉన్న హుండీ

అయితే, పెద్ద దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లోని చిన్న దేవాలయాలపై దొంగల కన్ను పడింది. ఎంతోకాలంగా హుండీల సొమ్మును తీయని ఆలయాలను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. నమశ్శివాయపురం అంకాళ పరమేశ్వరి ఆలయంలో కొద్ది రోజుల క్రితమే ఆలయ తాళాలు పగులకొట్టి హుండీని తీసుకెళ్ళి సుమారు రూ.70 వేలు అపహరించారు. రెండు రోజుల క్రితం గంగదొనకొండ గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయంలో దొంగలుపడ్డారు. ఈ ఆలయంలో మూడు సంవత్సరాలుగా హుండీని తెరవలేదు. దొంగలు ఆలయ తలుపుల తాళాలు పగులకొట్టి హుండీని దొంగిలించారు. ఆలయానికి దూరంగా తీసుకెళ్ళి పగులకొట్టి హుండీ సొమ్ము సుమారు రూ.60వేలకు పైగా అపహరించారు. కురిచేడు ప్రధాన కూడలిలోని కోదండ రామాలయంలో పట్టపగలు ఓ దొంగ ఆలయంలోకి వెళ్ళి హుండీని ఆలయం వెనుకకు తీసుకెళ్ళి తాళాన్ని రంపంతో కోశాడు. అదే సమయంలో అక్కడకు వెళ్ళిన ఆలయ ధర్మకర్త చూడటంతో దొంగ పారిపోయాడు.

దొంగతనాలను అరికట్టడానికి సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు కమిటీవారు రాత్రి సమయాల్లో ఆలయాల వద్దకు వెళ్ళిరావాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధాన గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవాని తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

గుంటిగంగ సత్రంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

తాళ్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగ సన్నిధిలోగల బ్రాహ్మణ సత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. నాలుగేళ్లుగా కార్తీకమాసం సందర్భంగా వేదపండితుల సారథ్యంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా బ్రాహ్మణులు సామూహిక వనభోజన కార్యక్రమం చేపట్టారు. సత్రంలో సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గోమాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్రం కమిటీ అధ్యక్షురాలు యల్లాప్రగడ లక్ష్మీసుందరి, వై.కన్నయ్య, ఆర్వై కోటేశ్వరరావు, నరసింహారావు, దీక్షితులు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నాగరాజు, వెంకటేశ్వరి, తదితరులుపాల్గొన్నారు.


సత్యనారాయణ స్వామి వ్రతపూజలు చేస్తున్న దంపతులు

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామివార్ల మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు, అనంతరం మేళతాళాలతో గాలి గోపురం వద్ద నుంచి మహానైవేద్యాన్ని గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించారు. గోశాలలోని గోవులకు పసుపు కుంకుమలతో గోపూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పామూరు, సీఎస్‌పురం సింగిల్‌విండో మాజీ చైర్మన్‌లు బైరెడ్డి జయ రామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, పోకా నాయుడుబాబు, వరికూటి హనుమంతరావు, దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

శివాలయంలో నాటిన మహాబిల్వ మొక్కలు

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని శీవల్లి భుజంగేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం మహాబిల్వ (తొమ్మిది దళాలు) వృక్ష మొక్కలను సింగిల్ విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి నాటారు. రూ.10 వేలు విలువ కలిగిన 5 మహాబిల్వ మొక్కలను దేవస్థానంలోని నాలుగు గుడుల్లో నాటారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, రాచూరి సురేష్, అర్చకులు మహంకాళి శివప్రసాద్ పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే సుబ్రమణ్యేశ్వరస్వామి

- దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతున్న దేవాలయం
- రేపటి నుంచి 19వ వార్షికోత్సవం

దొనకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన చెరువుకట్టపై వెలసిన శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి(పుట్ట) దేవాలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా ప్రసిద్ధి చెందింది. గ్రామానికి చెందిన చెన్నుబోయిన సుబ్బారావు 2004లో చెరువుకట్టపై వెలసిన శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి(పుట్ట)కు చిన్న దేవాలయం నిర్మించారు. నాటి నుంచి ప్రతి ఏడాది కార్తీకమాసంలో నాగ పంచమి సందర్భంగా స్వామివారి తిరునాళ్ల దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈనెల 5,6 తేదీల్లో 19వ వార్షికోత్సవ వేడుకలు దాతల సహకారంతో అత్యంత వైభవంగా జరిపేందుకు దేవాలయాన్ని సర్వాగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ధర్మకర్త సుబ్బారావు దాతల సహకారంతో తిరునాళ్ల, ఇతర సమయాల్లో దేవాలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల సౌకర్యాలు సమకూర్చారు. వేడుకలు సందర్భంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యమాలు నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నారు.


వేడుకలకు ముస్తాబైన సుబ్రమణేశ్వరస్వామి ఆలయం

వైసీపీ హయాంలో విద్యారంగం అధోగతి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజం

కనిగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విద్యారంగం అధ్వానంగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జరిగిన యూటీఎఫ్ సర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థను దెబ్బతీసేవిధంగా అనేక విచ్చిన్నకర కార్యక్రమాలను రూపొందించారని ధ్వజమెత్తారు. జీవో నెం.117ను తీసుకొచ్చి పాఠశాలలను విలీనం చేయటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నష్టం వాటిల్లిందన్నారు.

మంత్రి నారా లోకేష్ ప్రత్యే దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేస్తుందని చెప్పారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. త్వరలో డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేయనున్నట్టు చెప్పారు.. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కంకణబద్ధులై ఉన్నారన్నారు. విద్యాశాఖలో సమూలమైన మార్పులు చేపట్టినట్టు చెప్పారు. అందులో భాగంగా కోసం ఈనెల 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. పాఠశాలల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు తల్లితండ్రులతో పాటు ఆయా గ్రామాల ప్రజలకు తెలియచెప్పటమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో తమ సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. అందుకు ఉపాధ్యాయులు కూడా సహకారాన్ని అందించాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

యూటీఎఫ్ 50 ఏళ్లలో ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం విశేష కృషి చేసిందని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నస్వామి, వి.మాలకొండారెడ్డి, రాము, టి.రమణారెడ్డి, ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, రాజాల కొండారెడ్డి, యూవీ నారాయణరెడ్డి, సంజీవి, ఆర్.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తొలుత యూటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అవీ ఇవీ


వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగరాజు

వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

ముండ్లమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. తమవెంట డ్రైవింగ్ లైసెన్స్ ఉంచుకోవాలన్నారు. ఇవి లేకుంటే చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ముండ్లమూరులో వాహనాలను తనిఖీ చేశారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించక పోవటంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవటంతో అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువమంది వెళ్లరాదన్నారు. ఆటోల్లో పరిమితికి లోబడి ప్రయాణించాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వరరెడ్డి, మరియబాబు, మహేష్, ప్రేమానిధి, ఖాశీం, తుపాకుల శ్రీను పాల్గొన్నారు.

వెలిగొండ ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లిని చేర్చాలి

పీసీపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చాలని సీపీఎం నాయకుడు పి.మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పీసీపల్లిలో జనవిజ్ఞాన వేదిక, సీపీఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జేవీవీ నాయకులు కరణం గంగయ్య, నరసింహారెడ్డి మాట్లాడుతూ పీసీపల్లి మండలంలో సారవంతమైన భూములు ఉన్నప్పటికీ సాగునీటి సౌకర్యం లేక వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయన్నారు. మండలంలో సుమారు 20వరకు పెద్ద, చిన్న ఇరిగేషన్ చెరువులు ఉన్నప్పటికీ సరైన వర్షపాతం నమోదుకాక చెరువులు నిండడంలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చడంతో పాటు కాలువల ద్వారా చెరువులను అనుసంధానం చేస్తే తాగునీటితో పాటు సాగునీరు కూడా లభిస్తుందన్నారు. తద్వారా మండలంలో వలసలను కూడా నివారించవచ్చునని చెప్పారు. సమావేశంలో చినబ్రహ్మారెడ్డి, మాలకొండయ్య, ఇమ్మానుయేల్, హనుమారెడ్డి, శ్రీను, శ్రీరాములు, స్టీఫెన్, వెంగళరావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాల నమోదు


టీడీపీ సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని పట్టణ రెండవ ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ ఆదివారం ప్రారంభించారు. తన పరిధిలోని అంకాలమ్మవీధి ప్రాంతంలో టీడీపీ సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంత్రి నారా లోకేష్ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్గించారని తెలిపారు. కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్‌రసూల్, షేక్ అఫ్రిది, రాంమూర్తి, ఇండ్ల నరసింహారావు, చాంద్‌బాషా, నాగరాజు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పామూరులోని తూర్పువీధిలో మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గుత్తి మహేష్, మెంటా నరసింహారావు, పోకా వినోద్, నారాయణ, డీజే నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ మంజూరు


ఎల్‌వోసీని అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన ఎండ్లూరి సత్యనారాయణ మోకాళ్ళ ఆపరేషన్ నిమిత్తం రూ. 2,17,200 ఎల్‌వోసీని ఆయన కుమారుడు హరికృష్ణకు ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అందజేశారు. బాధితుడు సత్యనారాయణ మోకాళ్ళ నొప్పితో బాధపడుతూ ఇటీవల లక్ష్మిని కలసి పరిస్థితి వివరించారు. వెంటనే స్పందించిన ఆమె ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,17,200 నగదును మంజూరు చేయించింది. ఈసందర్భంగా సత్యనారాయణ లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 11ను వెంటనే రద్దు చేసి ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని యూటీఫ్ జిల్లా కార్యదర్శి ఆడియారం సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వడ్డేపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా నారిశెట్టి వెంకటరామయ్య, షేక్ పాదుషాను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి.వేమనారాయణ, చాంద్‌బాషా, ఎం.సత్యవతి, కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా షేక్ రేష్మా, ఎన్.సుజాతరామ్, పి.రవీంద్ర, ఎం.నారాయణరెడ్డి, జి.రత్నమ్మ, జి. గోపినాగేంద్ర, ఎస్.భాస్కరరావు, జిల్లా కన్వీనర్లుగా షేక్ రజియా, ఏ.సురేష్, ఇ.కొండయ్య, వి. సాంబశివరావును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై శ్వేతపత్రం ప్రకటించి వాటి చెల్లింపులకు నిర్దిష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మహాసభలో ఎంఈవో రాజాల కొండారెడ్డి, పి.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం


ఎమ్మెల్యే ఉగ్రకు నగదును అందజేస్తున్న ఎంఈవో కరుణకుమారి

పామూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి పామూరు ఎంఈవో-2 కరుణ కుమారి సహచర ఉపాధ్యాయులతో కలసి రూ.30 వేల నగదును అందజేశారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఉగ్రను కలిసి విరాళం అందజేశారు. వైద్యశాలను అభివృద్ధి పరుస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కార్యదీక్షతకు దాతలు ఆర్థిక సహాయం చేస్తూ అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర వారిని అభినందించారు.



రేపు తొలి డీఆర్సీ సమావేశం

గత ప్రభుత్వంలో అంతా మొక్కుబడి

నిర్ణయాలు ఆచరణలోకి రావాలనేదే ప్రజల ఆకాంక్ష


బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం



నాన్నే.. రోల్‌మోడల్

- నా మీద నాన్న ప్రభావం ఎక్కువ
- ఒక్కరి సంపాదనతో కుటుంబం గడిచేది
- మనవళ్లతోనూ నాన్నకు అదే అనుబంధం
- నాది పెద్దలు కుదిర్చిన వివాహమే
- టీచర్ ఏసురత్నం గారు నన్ను బాగా ప్రోత్సహించారు
- సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకు
- ఆంధ్రజ్యోతితో కలెక్టర్ వెంకటమురళి

వ్యవసాయ కుటుంబంలో పుట్టాను....మట్టి వాసన తెలిసినవాడిని, అన్నదాతల వెతలను దగ్గరుండి పరిశీలించినవాడిని. కుటుంబ పోషణకు నాన్న కాయకష్టం చూసి ఆయనకు తోడుగా ఉండాలని చిన్నప్పుడే అనిపించేది. బాల్యంలో ఏసురత్నం టీచర్ చెప్పినమాటలు నాకు ఇప్పటికీ గుర్తు. క్రమశిక్షణకు తోడు ఆధునిక భావాల కలబోత నా విద్యార్థి జీవితం. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నుంచి మొదలైన కెరీర్ నేడు కలెక్టర్ వరకు ప్రస్థానం. ప్రతి మజిలీలో ఎన్నో పాఠాలు, అనుభవాలు. కానీ అన్నివేళల నాతో ఉండేది, నాకు తోడుగా ఉన్నట్లు అనిపించేది నాన్నే. ఆయనతో అంతటి అనుబంధం నాకు. నా చిన్నవయసులో నాన్న పడుతున్న కష్టాలు చూసి చలించేవాడిని. నాన్నే నాకు హీరో, రోల్‌మోడల్...నిత్యం ప్రజాసమస్యలు, సమీక్షలతో బిజీబిజీగా గడిపే జిల్లా కలెక్టర్ వెంకటమురళి తన బాల్యంతో పాటు కెరీర్, కుటుంబం, తండ్రితో ఆయనకున్న అనుబంధాన్ని ఆంధ్రజ్యోతితో ఆదివారం పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

బాల్యంలో ఏసురత్నం టీచర్

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మా ఊళ్లోని సింగిల్ టీచర్ ప్రభుత్వ స్కూ ల్‌లోనే చదువు. అక్కడ ఏసు రత్నం టీచర్ ఉండేవారు. ఆయన నాపైన ప్రత్యేక ఇష్టం కనబరచేవారు. నాలో ప్రతిభ ఉందని నమ్మిన తొలి వ్యక్తి ఆయన. అందుకు తగ్గట్లే నన్ను చిన్న వయసులోనే వెన్నుతట్టి ప్రోత్సహించిన వ్యక్తి టీచర్ ఏసురత్నం. అందరిలాగానే బెత్తం దెబ్బలు, తొడపాశాలు టీచర్ దగ్గర రుచి చూసినవాడినే. అవి ప్రేమపూర్వకంగానే ఉండడం వల్ల అవన్నీ ఇప్పటికీ మధుర స్మృతులుగానే ఉండిపోయాయి

రెండో ప్రయత్నంలోనే....

1996లో తొలిసారి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కోసం ఎగ్జామ్ రాస్తే అప్పుడు రాలేదు. 1998లో రెండో ప్రయత్నంలో స్టేట్ టాపర్‌గా విజయం సాధించాను. బెస్ట్ ఆల్‌రౌండర్, బెస్ట్ ఇండోర్ అవార్డు సాధించాను. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లో కూడా పనిచేశాను. 2005లో

మరో కోణం

గ్రూప్1 రాస్తే 6 మార్కులతో పోయింది. మళ్లీ 2009లో రాస్తే ఇక్కడా స్టేట్ టాపర్‌గానే నిలిచాను. ఆర్డీవోగా తొలి పోస్టింగ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన కర్నూలులో రాగా 2011–13 మధ్య అక్కడ విధులు నిర్వర్తించాను. 2013–15 మధ్య వైజాగ్ ఆర్డీవోగా, 2016–17 మధ్య ప్రాజెక్టు ఆఫీసర్‌గా, 2017–19 మధ్య విజయనగరం ఆర్డీవోగా పనిచేశాను. 2020లో సీఎం ప్రొటోకాల్ విధులు నిర్వర్తించాను. జాయింట్ కలెక్టర్‌గా 2020–22 మధ్య ప్రకాశం జిల్లాలో, 2022–23 వ్యవధిలో పశ్చిమగోదావరి జిల్లా జేసీగా, 2023–24లో ట్రైబల్ వెల్‌ఫేర్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించాను. ఇక 2024లో కలెక్టర్‌గా తొలిపోస్టింగ్‌లో భాగంగా బాపట్ల జిల్లాకు వచ్చాను

సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకు...

పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకు నా కెరీర్ ప్రయాణం సాగింది. కలెక్టర్‌గా ఇదే నాకు తొలి పోస్టింగ్. కాకపోతే ప్రతి ప్రయాణంలోనూ ఒడిదొడుకులు మామూలే. వాటికి ఎవరూ బెదిరిపోవద్దు. నాకు కష్టం వచ్చిన ప్రతిసారీ మా నాన్న పడిన కష్టం తలచుకుంటే నాది చిన్నగా అనిపించేది. అందుకే జీవితంలో ఏదో ఒక ప్రేరణ మనల్ని ముందుకు నడిపించేదిగా ఉండాలి. అది నాకు నాన్న. అందుకే ఆయనే హీరో, ఆయనే రోల్‌మోడల్. ఏ బంధమైనా మనకి అదనపు బలాన్నిచ్చి ముందుకు నడిపించేదిగా ఉండాలి కానీ వెనక్కి లాగేదిగా ఉండకూడదు. నేను గర్వంగా చెబుతున్నాను ఓ రైతు కష్టంలో ఇప్పటికీ మానాన్నను చూసుకుంటాను. ఆర్థిక ఇబ్బందులతో పోషణ భారంగా మారిన కుటుంబాలలో చిన్నప్పటి నా బాల్యాన్ని చూసుకుంటాను. ఈ హోదా అలాంటి వారికి అండగా ఉండడానికి ఇప్పుడు ఉపయోగపడుతుందనే ఆనందం నాలో ఎక్కువగా ఉంది. అంతిమంగా ప్రభుత్వ లక్ష్యాలు కూడా అవే అవడంతో పనిమీద ఇష్టంతో ముందుకు వెళుతున్నాను.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైఎస్సార్ జిల్లాలోని ఖాజీపేట మండలంలో ఉన్న నాగపట్నం గ్రామం మా సొంతూరు. ఉన్న నాలుగు ఎకరాల పొలమే మాకు ఆధారం. మా నాన్నకు మొత్తం నలుగురు సంతానం. నాకు ఇద్దరు అక్కలు, ఓ చెల్లి. అబ్బాయిని నేను ఒక్కడినే కావడంతో ఇంట్లో నన్ను కొంచెం గారాబంగానే చూసుకునే వారు. అదే సమయంలో క్రమశిక్షణ విషయంలో నాన్న అసలు రాజీపడేవారు కాదు. నాన్న పర్యవేక్షణలో నేను ఉన్నన్ని రోజులు నన్ను సెకండ్ షో సినిమాకు నాన్న వెళ్లనిచ్చే వారు కాదు. ఎక్కడ నేనే దారి తప్పుతానేమో అన్న భయం ఆయనది

ఉస్మానియాలో పీజీ...

ప్రైమరీ స్కూల్ మొత్తం సొంతూరు నాగపట్నంలోనే గడిచింది. హైస్కూల్ మాత్రం మేనమామ ఊరు అనంతపురంలో ఉండి చదువుకున్నాను. అక్కడ నుంచి ఇంటర్‌కు తిరిగి సొంతూరుకు వచ్చి ఖాజీపేటలో పూర్తి చేశాను. గ్రాడ్యుయేషన్, పీజీ రెండూ ఉస్మానియాలోనే పూర్తి చేశాను.

ఒక్కరి సంపాదన...అదే బాధించేది....

కుటుంబ పోషణకు నాన్న ఒక్కరే పడుతున్న కష్టం చూసి చలించిపోయేవాడిని. ఒక్కరి సంపాదన మీదే ఆధారపడి కుటుంబ పోషణ జరిగేది. త్వరత్వరగా పెద్దయిపోయి నేను సంపాదించి నాన్నకు అండగా ఉండాలనుకునే వాడిని. ఎన్ని కష్టాలున్నప్పటికీ మమ్మల్ని ఎటువంటి లోటు రాకుండా నాన్న చూసుకోవడం ఆశ్చర్యమేసేది. అందుకే నాన్నే నాకు హీరో, రోల్‌మోడల్ అన్నీనూ..

మాది పెద్దలు కుదిర్చిన వివాహమే...

నా సతీమణి పేరు నాగలక్ష్మి. నాకు 1992లోనే వివాహమైంది. అనంతపురంలో ఉండే మా మేనమామ ద్వారా కుదిరిన వివాహం. ఆమె హౌస్ వైఫ్‌గానే ఉండేది. నేను రకరకాల పని ఒత్తిడిలో ఉండడంతో పిల్లల బాగోగులు అన్నీ నా భార్యే చూసుకునేది. ఓ విధంగా చెప్పాలంటే పని ఒత్తిడి వల్ల నేను కుటుంబంతో గడిపే సమయం తక్కువగానే ఉండేది. నా సతీమణి నాగలక్ష్మి బెటర్ హాఫ్ అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఊళ్లో ఫ్యాక్షన్ నేపథ్యం ఉండేది....

నేను ఆరు, ఏడు తరగతుల్లో ఉన్నప్పుడు మా గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు బాగా జరిగేవి. కాళ్లు లేనివారు, చేతులు కోల్పోయిన వారితో పాటు ఆ గొడవల్లో చనిపోయిన వారిని చూస్తూ పెరిగాం. కానీ నాతో పాటు గ్రామంలో అప్పుడప్పుడే యవ్వనంలో అడుగుపెడుతున్న వారెవరిని ఫ్యాక్షన్ వైపు ఆకర్షితు లు కాకుండా చూడడంలో నాన్నే ముందుండేవారు. కొట్లాటల వల్ల కుటుం బాలు ఛిన్నాభిన్నం అవుతాయని చెప్పేవారు. అందరూ చదువుకుని ప్రయోజకులు అవ్వడమే ఈ ఫ్యాక్షన్ సమస్యకు పరిష్కారమని బలంగా నమ్మేవారు.

మనవళ్లతోనూ అదే అనుబంధం... అమ్మ చనిపోయినప్పుడు...

నాన్న మీద నాకున్న ప్రేమకు గుర్తుగా నా పిల్లలకు ఆయన పేరు గుర్తొచ్చే లా పేర్లు పెట్టుకున్నారు. నాన్న పేరు చిన్న కృష్ణయ్య. మా పెద్దబ్బాయి పేరు కృష్ణతేజ, చిన్నోడి పేరు సృజన్ కృష్ణగా పెట్టాను. ఇప్పటికీ మనవళ్లు ఇద్దరితో రోజుకు ఒక్కసారైనా ఆయన ఫోన్ చేసి మాట్లాడుతూనే ఉంటారు. నేను పనిలో బిజీగా ఉంటాను. అయినప్పటికీ ఇప్పటికీ తాత మనవళ్లు రోజూ మాట్లాడుకోవడం నాకు పెద్ద ఊరట. 2020లో కరోనా తొలి వేవ్‌లోనే అమ్మ చనిపోయింది. నాన్న కుంగిపోవడం తొలిసారి చూశాను. కాలమే అన్నింటికి మందు ఇక్కడ కూడా అదే పని చేసింది


పెద్ద కుమారుడి పెళ్లి వేడుకలో కలెక్టర్ తల్లిదండ్రులతో పాటు సతీమణి నాగలక్ష్మి

సాహిత్యంపై మక్కువ ఎక్కువ....

నాకు ఇప్పటికీ ఖాళీ దొరికితే పుస్తకాలు చదవడంతో పాటు సాహిత్యంపై కూడా మక్కువ కనబరుస్తాను. వాస్తవానికి ఈ విషయంలో కూడా నా మీద నాన్న ప్రభావమే ఉంది. ఆ రోజుల్లోనే ఆయనలో ఆధునిక భావాలు ఉండేవి. ప్రతి విషయాన్ని తర్కబద్ధంగా ఆలోచించేవారు. దేవుని మీద నమ్మకం ఉండేది కానీ మూఢవిశ్వాసాల మీద మాత్రం వ్యతిరేకత కనబరచేవారు.

ఊరికి నా వంతుగా...

మా ఊరు నాగపట్నానికి సిమెంటురోడ్డు, డ్రికింగ్‌వాటర్‌తో పాటు హైవేకు అనుసంధానించే రోడ్లు వేయించ డంలో నా వంతు తోడ్పాటు అందించాను. ఇవన్నీ కూడా దాదాపుగా ప్రభుత్వ నిధులతో సమకూరినవే. కానీ వాటి ఆమోదం వెనక గ్రామస్థల కృషికి తోడు ఉడతా భక్తి సాయంగా నేను ఉన్నాననేది నాకు తృప్తినిచ్చిన అంశం. అదే విధంగా విశాఖపట్నం ఆర్డీవోగా పనిచేస్తున్నప్పుడు మా గ్రామంలోని ఓ ఐదుగురు పిల్లలతో పాటు ఇంకో ఆరుగురు మొత్తం 11 మంది చదువుకు తోడ్పాటు ఇచ్చాం. దీనిలో గీతం యూనివర్సిటీ సహకారంతోడు లారెన్స్ ల్యాబ్ కూడా అండగా నిలవడంతో 11 మంది విద్యార్థుల చదువుకు బాసటగా నిలవడం వృత్తిపరమైన జీవితంలో మిక్కిలి ఆనందాన్ని ఇచ్చే అంశంగా మిగిలిపోయింది.

అన్ని వ్యవస్థలను నీరుగార్చినట్లే అత్యంత కీలకమైన డీఆర్సీ సమావేశాన్ని కూడా గత ప్రభుత్వం మొక్కుబడి తంతుగా మార్చిందే తప్ప జిల్లా అభివృద్ధికి ఒక్కటంటే ఒక్క నిర్ణయం ఆ సమావేశాల వల్ల ఉపయోగపడింది లేదు. పైగా రివాజు ప్రకారం ఆరునెలల కొకసారి డీఆర్సీ సమావేశం పెట్టాలన్న సాంప్రదాయానికి కూడా వైసీపీ ప్రభుత్వం పాతరేసి లెక్కలేని తనంగా వ్యవహరించిది. ఇక డీఆర్సీ సమావేశాలకు సంబంధించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టు) ఊసే గత పాలకులు మరిచారు. సమావేశంలో ఇన్‌చార్జి మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడినవి మినిట్స్‌లో నమోదు చేయడమనేది నిబంధన. కానీ వైసీపీ పాలనలో అలా నమోదు చేసిన వివరాల గురించి అడిగితే అధికారుల దగ్గర నుంచి లేదనేదే సమాధానంగా వస్తోంది.

అభివృద్ధి కోసం.. ఆశగా..!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా అభివృద్ధిలో అత్యంత కీలకమైన డీఆర్సీ సమావేశాన్ని ఓ ప్రహసనంలా మార్చిన ఘనత వైసీపీది. వీటన్నింటిని సరిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వంలో తొలి అడుగు పడనుంది. తొలి డీఆర్సీ సమావేశం కలెక్టరేట్ వేదికగా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన డీఆర్సీ సమావేశం మంగళవారం జరగనుంది. ఇప్పటికే ఎజెండా ఖరారు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానాలు కూడా పంపారు. ఈ సమావేశం వేదికగా జిల్లాలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యల పట్ల చర్చ జరగడంతో పాటు అభివృద్ధికి బాటలు పడేలా డీఆర్సీ నిర్ణయాలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు

నిబంధనలు గాలికి...

డీఆర్సీ సమావేశాలకు మధ్య ఆరు నెలల గడువు ఉండేలా చూసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో తిరిగి డీఆర్సీ సమావేశం పెట్టడమనేది రివాజుగా వస్తోంది. దీనికి కూడా గత పాలకులు తిలోదకాలిచ్చారు. బాపట్ల జిల్లాగా ఏర్పాటయ్యాక మొత్తం మూడు డీఆర్సీ సమావేశాలు జరగ్గా చివరిగా 2023 మే 2న వైసీపీ ప్రభుత్వం నిర్వహించిది. ఇక అంతే తర్వాత డీఆర్సీ ఊసేలేదు. అంటే వైసీపీ ప్రభుత్వంలో ఆరు నెలల తర్వాత డీఆర్సీ జరిపే వీలున్నప్పటికీ దానిని నిర్వహించలేదు. దాదాపు ఏడాదిన్నరగా జిల్లాలో డీఆర్సీ సమావేశమే జరగలేదు. ఇక డీఆర్సీ సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారం ఎంత వరకు వచ్చిందనేదానికి తదుపరి డీఆర్సీ సమావేశంలో ఏటీఆర్‌ను అందిస్తారు. కానీ వైసీపీ ఏలుబడిలో ఈ ఏటీఆర్ ఊసే లేకుండాపోవడంతో మొక్కుబడి తంతుగా కీలకమైన సమావేశాలను మార్చేశారన్న విమర్శను వైసీపీ మూటగట్టుకుంది

ఆశలన్నీ ఈ సమావేశంపైనే....

మంగళవారం జరగబోయే డీఆర్సీ సమావేశం వేదికగా జిల్లా అభివృదికి బాటలు పడతాయని ప్రజలు ఆశతో ఉన్నారు. పర్యాటక రంగం పురోగమనంపై గత ప్రభుత్వం మాటలతో సరిపెట్టిందే తప్ప అమలు సున్నా. అత్యంత కీలకమైన బాపట్లలోని మెడికల్ కళాశాల పనులు పలు కారణాలతో అటకెక్కడంతో అనేక అపోహలు ప్రజల్లో నెలకొన్నాయి. వీటికి డీఆర్సీ వేదికగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఐదేళ్లలో సాగునీటి వ్యవస్థను భ్రష్టు పట్టించి అన్నదాతల ఉసురును గత ప్రభుత్వం మూటగట్టుకుంది. చివరి ఆయకట్టు వరకు నీరందేలా ప్రణాళికలు రచించడంతో పాటు కాలువల మరమ్మతులపై రైతులకు హామీ ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం చేసిన పనులను పట్టాలెక్కించి పూర్తి చేసే దిశగా ప్రజలకు నమ్మకం కల్పించాల్సి ఉంది. బాపట్ల జల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ మౌలిక వసతుల విషయంలో ఉద్యోగులు ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. దీనికి తోడు కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడంతో పనులలో వేగం మందగించింది. దీనిపై కూడా డీఆర్సీ దృష్టిపెట్టాల్సి ఉంది. ఇక సమీకృత కలెక్టరేట్ నిర్మాణంతో పాటు గత ప్రభుత్వంలో జరిగిన అనేక అవకతవకలపై నివేదికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ముఖ్యంగా ఇసుక, అక్రమ లే అవుట్లు, అసైన్డ్ భూముల పరాధీనం వంటివి ఇందులో ముఖ్యం. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఇందుకు సంబంధించి అక్రమార్కులపై తీసుకునే చట్టపరమైన చర్యల ప్రకటనకు జిల్లా సమీక్ష మండలి(డీఆర్సీ)లో చోటు దక్కాలనేది పలువురి అభిప్రాయంగా ఉంది

ఎజెండా ఇదే...

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న పెన్షన్ల పంపిణీపై డీఆర్సీలో సమీక్షించనున్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనులు, అన్నా క్యాంటీన్, విపత్తుల సమయంలో అవలంబించాల్సిన విధానాలు, రిలీఫ్ ఫండ్స్‌కు సంబంధించి డీఆర్సీలో చర్చించనున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇరిగేషన్, స్వర్ణాంధ్ర, హౌసింగ్‌తో పాటు అత్యంత కీలకమైన ఇండస్ట్రీ పాలసీపై కూడా డీఆర్సీలో సమీక్షించే విధంగా ఎజెండా ఖరారు చేశారు. ఉచిత ఇసుక, ప్రైవేటు మద్యం విధానం, విద్య, వైద్యం, రహదారులు ప్రాధాన్యాంశాలుగా డీఆర్సీలో సమీక్షించే విధంగా ఎజెండా ఖరారు చేశారు

డీఆర్సీని కీలకం చేయాలి....

ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో జరిగే డీఆర్సీ సమావేశం అంటేనే జిల్లా అభివృద్ధికి ముఖచిత్రం వంటిది. కానీ గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలలో అలసత్వం ఆవరించడంతో డీఆర్సీ కూడా పేపర్లకే పరిమితమైంది తప్ప ఆ నిర్ణయాలేవీ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జరగనున్న తొలి డీఆర్సీ సమావేశం కావడంతో అందరిలో ఆసక్తి నెలకొని ఉంది. ఇదే కాకుండా జిల్లాలకు సంబంధించి అన్ని విషయాలలో ఇన్‌చార్జి మంత్రులదే బాధ్యత అని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో డీఆర్సీ సమావేశానికి ప్రాముఖ్యం ఏర్పడింది. జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రచించడంతో పాటు, ఇక్కడ ఉన్న ఇద్దరి మంత్రులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాను అన్ని రంగాలలో పురోగమింప చేయాల్సిన గురుతర బాధ్యత ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథిపైనే ఉండడంతో డీఆర్సీ నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది

ఎప్పటి నుంచో పేదలను ఊరిస్తున్న ఉచిత సిలిండర్ పథకం లబ్ధిదారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా తమకు ఉచితంగా గ్యాసు సిలిండర్లు వస్తాయని భావించినవారిలో చాలా మందికి నిరాశ ఎదురవుతోంది. ఈ- కేవైసీ లేనికారణంగా కొంతమంది, రేషన్ కార్డు లేనందున కొంతమంది లబ్ధిదారులు ఉచిత సిలిండర్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

దీపం- 2.. ఈ కేవైసీ కష్టాలు

- ఈ కేవైసీ ఉన్నవారికే ఉచిత సిలిండర్లు
- ఈ కేవైసీపై అవగాహనా లేమితో లబ్ధిదారులకు నష్టం
- రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో మరింత మందికి కట్
- గత ప్రభుత్వ హయాంలో 25వేల దరఖాస్తులు పెండింగ్

గుంటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 19.5 లక్షల వంట గ్యాసు కనెక్షన్లు వున్నాయి. గుంటూరు జిల్లాలోనే 7 లక్షల కనెక్షన్లు వుండగా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 12.5 వేల గ్యాసు కనెక్షన్లు వున్నాయి. వీరందరికీ ఈ- కేవైసీ వుంటేనే ప్రస్తుతం ఉచిత గ్యాస్ సిలిండర్లు వస్తాయని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్‌పీజీలో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్‌ను లింక్ చేయాలి. ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతాతో గ్యాస్ కనెక్షన్‌ను అనుసంధానం చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను ఈ- కేవైసీ అంటారు. అయితే దీనిపై సగటు వినియోగదారులకు అవగాహన లేదు. ఎప్పుడో గ్యాస్ కనెక్షన్ తీసుకున్న సమయంలో ఈ- కేవైసీ చేయించుకుని ఆ తరువాత దాన్ని మర్చిపోయారు. అయితే ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ-కేవైసీని ఆయిల్ సంస్థలు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అవగాహన లేక ఈ కేవైసీని చాలా మంది నిర్లక్ష్యం చేశారు. ఈ కేవైసీ గ్యాసుపై సబ్సిడీ వస్తుంది. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ 15 రూపాయలకు పడిపోవడంతో ఎవరూ ఈ కేవైసీ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. సబ్సిడీ పడుతుందో.. లేదో కూడా చూసుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో మూడు జిల్లాల్లో అనేకమందికి ఈ- కేవైసీ లేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎల్పీజీ సంస్థలు, గ్యాసు ఏజెన్సీలు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

● రేషన్ కార్డుల తంటా..

ఉచిత గ్యాస్ సిలిండర్లు అందివ్వడానికి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటోంది. అయితే మూడు జిల్లాల్లో మొత్తం 19.5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి, కానీ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 17లక్షల రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. అంటే రెండున్నర లక్షల గ్యాస్ కనెక్షన్లకు రేషన్ కార్డులు లేవు. దీంతో వీరంతా ఈ పథకానికి అనర్హులు అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. గడిచిన ఐదేళ్లలో పెళ్లిళ్లు చేసుకుని కొత్త జీవితం ప్రారంభించిన దంపతులకు కొత్త రేషన్ కార్డులు ఇప్పటికీ రాని పరిస్థితి. కుటుంబాలు వేరైన తరువాత పాత రేషన్ కార్డులను విభజనకు దరఖాస్తు చేసుకున్నా వేర్వేరు కార్డులు రాలేదు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో లక్షా 60వేలు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 30వేల రేషన్ కార్డు దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. దరఖాస్తు చేసుకోని వారు అంతకు మించిన సంఖ్యలో వున్నారు. ప్రస్తుతం వీరంతా ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. మొత్తంగా ఈ- కేవైసీ, రేషన్ కార్డుల వ్యవహారంతో మూడు జిల్లాల్లో 14 లక్షలకు మించి అర్హులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ సమస్యలను చక్కదిద్ది ఎక్కువమంది లబ్ధిదారులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ- కేవైసీ ఇలా..

స్థానికంగా వున్న ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరూ ఈ- కేవైసీని చేయించుకోవచ్చు. కేవైసీ అప్‌డేట్ అయి వుంటే అవసరం లేదు.. లేని పక్షంలో బయోమెట్రిక్ పద్ధతిలోగానీ, ఆధార్ ఓటీపీ ద్వారాగానీ ఈ-కేవైసీ చేయించుకోవచ్చు.

గ్యాస్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ కూడా ఈ కేవైసీ చేయవచ్చు. గ్యాస్ డెలివరీ బాయ్ ఇంటికి వచ్చిన సమయంలో అతడికి మన గ్యాస్ కనెక్షన్ వివరాలు చెబితే అతడు తన వద్దనున్న సంబంధిత గ్యాస్ (ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్) ఏజెన్సీల మొబైల్ యాప్‌లో ఆధార్ ఓటీపీ పద్ధతిలో ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

ఎవరికి వారుగా కూడా ఈ- కేవైసీ చేసుకోవచ్చు. ఆయా సంస్థకు సంబంధించి యాప్‌ను మొబైల్లో డౌన్లోడ్ చేసుకోవాలి. అందులో తొలుత రిజిస్టర్ అవ్వాలి. ఎగ్జిస్టింగ్ కస్టమర్ దగ్గర ఎస్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే రిజస్ట్రేషన్ పేజీలోకి వెళుతుంది. అక్కడ ఎల్‌పీజీ ఎన్‌రోల్‌మెంట్ మొబైల్ నెంబర్ ఇచ్చి సబ్‌మిట్ చేయాలి. ఆ తరువాత పేజీలో పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్(ఆప్షనల్) ఇచ్చి రిజిస్టర్ కావాలి. దానికి సెక్యూరిటీగా నాలుగంకెల ఎంపిన్‌ను సెట్ చేసుకోవాలి. ఇలా రిజిస్టర్ అయిన తరువాత మొబైల్ నెంబర్, ఎంపిన్‌తో లాగిన్ అవ్వాలి. డాష్‌బోర్డు వస్తుంది. అందులో ఎల్‌పీజీ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తరువాత ఈ కేవైసీ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఈ- కేవైసీ గతంలోనే అయిపోయి వుంటే ఈ కేవైసీ సక్సెస్‌ఫుల్ అని చూపిస్తుంది. పెండింగ్ ఉంటే క్యాప్చర్ ఫేస్ అనే ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేసి మొబైల్ ఫోన్‌ను ముఖానికి దగ్గరగా తీసుకుని వెళ్లి కళ్లు మూస్తూ, తెరుస్తూ వుండాలి. అప్పుడు అది ఫేస్ రికగ్నిషన్‌ను క్యాప్చర్ చేసుకుని ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తుంది. అనంతరం గ్యాస్ కనెక్షన్‌కు లింకైన బ్యాంకు ఖాతా యాక్టివేషన్‌ను కూడా అదే యాప్‌లో చూసుకుని తెలుసుకోవచ్చు. యాక్టివ్ అని వుంటే ఇబ్బంది లేదు.. అలా కాకుంటే బ్యాంకుకు వెళ్లి ఖాతాను యాక్టివేట్ చేయించుకోవాలి.

ఢమాల్ మన్న ధరలు

కోత కూలి కూడా రావడం లేదని రోడ్ల వెంబడి పోస్తున్న రైతులు

బూడిద గుమ్మడి నేలపాలు

బల్లికురవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత నెల వరకు ఆశాజనకంగా ఉన్న బూడిద గుమ్మడి ధరలు ఒక్కసారిగా ఢమాల్ మన్నాయి. దీంతో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోత కూలి కూడా రాకపోవడంతో కొందరు రైతులు కాయలను కోసి రోడ్ల వెంబడి పారబోస్తున్నారు. కొందరు మాత్రం గుమ్మడి తోటలను దున్నేస్తున్నారు. బల్లికురవ మండలం వేమవరం గ్రామం వద్ద బూడిద గుమ్మడి కా యలు రోడ్డు పక్కన రైతులు పారబోశారు. 40 కేజీల గుమ్మ డి కాయల బస్తా హైదరాబాద్ మార్కెట్‌లో రూ.200 మాత్రమే పలుకుతుందని బాడిగ, కోత కూలి కూడా రావడం లేదని అందుకే గుమ్మడి కాయలు కోసి వేస్తున్నామని రైతులు తెలిపారు.


రోడ్డు పక్కన పారబోసిన బూడిద గుమ్మడి కాయలు

విద్యార్థులకు అపార్ కష్టాలు

- పాఠశాల,ఆధార్ రికార్డుల్లో భారీ వ్యత్యాసం
- నిర్దేశిత సంఖ్యలో లేని ఆధార్ నమోదు కేంద్రాలు
- నమోదులో జిల్లా 22వ స్థానం

గుంటూరు(విద్య)నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు "వన్ నేషన్ వన్ కార్డ్" పేరుతో ప్రత్యేకంగా కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అపార్ (పర్మినెంట్ అక్కడ మీకు అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలల్లో దాదాపు 7 లక్షల మందికి,జూనియర్ కళాశాలలో 95 వేల మందికి కార్డులు ఇవ్వాల్సి ఉంది. అయితే నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వేగం పుంజుకోలేదు. ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కేంద్రం నుంచి ఆదేశాల ఉన్నా ఆ దిశగా జిల్లాలో నమోదు ప్రక్రియ సాగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆధార్ పాఠశాల రికార్డులకు పొంతనలేదు

విద్యార్థులకు సంబంధించి ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు, పాఠశాలలో ఉన్న రికార్డులకు పొంతన ఉండటం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పుట్టిన తేదీ, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు వంటివి పాఠశాల రికార్డులకు, ఆధార్‌లో ఒకే విధంగా ఉంటేనే నమోదు జరుగుతుంది. ఆధార్ లో ఉన్న రికార్డుల ప్రకారమే అపార్ కార్డులు జారీ అవుతాయి. అనేక మంది విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఆధార్‌లో సక్రమంగా లేవని ఉపాధ్యాయులు చెబుతున్నారు.అయితే నిర్దేశించిన సంఖ్యలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఆధార్ లో ఉన్న తప్పులు సరి చేసుకోవడం ఇబ్బందికరంగా మారిందనే వాదన ఉంది.

నాటి విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లా అపార్ నమోదులో 22వ స్థానంలో ఉంది. దీనికి ప్రధాన కారణం ఇప్పటిదాకా ఇక్కడ పనిచేసిన విద్యాశాఖ అధికారి కారణమని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాము ఎన్నిసార్లు క్షేత్ర స్థాయిలో తలెత్తే సాంకేతిక సమస్యలు వివరించినా పట్టించుకోలేదని చెబుతున్నారు



అపార్‌తో అనేక ఉపయోగాలు

అపార్ కార్డువల్ల విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉంటాయి. అన్ని సర్టిఫికెట్లు డిజీ లాకర్లకు అనుసంధానమైపోతాయి. నకిలీ సర్టిఫికెట్లకు ఆస్కారం ఉండదు. ఉపకార వేతనాలు, క్రీడలు, కుల ఆదాయ, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు సంబంధించిన సమస్త వివరాలు ఇందులో నమోదు అవుతాయి. ఎప్పుడైనా ఎక్కడైనా ఇవి పొందడానికి అవకాశం ఉంటుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఆస్కారం ఏర్పడుతుంది.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి: బసవలింగారావు



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అపార్(ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో విద్యార్థుల వివరాలు నమోదు తలెత్తే సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అధ్యక్షులు కె బసవలింగారావు సూచించారు. ఇప్పటికే తాము డీఈవోకి వినతి పత్రం అందజేశామన్నారు. విద్యార్థి స్కూల్ రికార్డుల్లో వాటికి భిన్నంగా తల్లిదండ్రులు పుట్టిన తేదీ సమర్పిస్తున్నారని తెలిపారు. సవరించడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించడం లేదని తెలిపారు.

సంక్షేమం ఓకే.. అభివృద్ధి కావాలి


వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ (ఫైల్)

వైసీపీ పాలనలో జిల్లాపై నిర్లక్ష్యం

- సమస్యలతో ప్రజలు సతమతం
- పురోగతి లేని ప్రాజెక్టులు
- మెరుగు పడని ఉపాధి అవకాశాలు
- నామమాత్రంగా వ్యవహరించిన నాటి ఇన్‌చార్జి మంత్రులు
- డీఆర్సీ నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ దృష్టి
- నేడు ఆనం నేతృత్వంలో జిల్లాస్థాయి సమీక్ష

జిల్లా అభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగుకు ఉపకరించే కీలక పథకాలు, ప్రాజెక్టులపై ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది. సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి కరువైంది. పారిశ్రామిక రంగం పడకేసింది. విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఉదాసీనత కన్పించింది. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయంతో నడిపించడంతోపాటు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి మధ్య వారధిలా పనిచేయాల్సిన నాటి ఇన్‌చార్జి మంత్రులు నామమాత్రంగా మిగిలారు. ఇక వారి పర్యవేక్షలో నిర్వహించే కీలకమైన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశాలు మొక్కుబడిగా మారాయి. ఈనేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలకు ఉపశమనం కల్పించింది. అయితే జిల్లా శాశ్వత అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి కల్పనకు సంబంధించి అంశాలు మాత్రం ముందుకు కదలడం లేదు. వాటికి నిధుల సమస్య ప్రతిబంధకంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక తొలి డీఆర్సీ సమావేశం సోమవారం జరగనుంది. అందులో అభివృద్ధి అంశాలు, నిధుల అవసరం, తక్షణ సమస్యల పరిష్కారంపై చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలక ప్రాజెక్టులు, మౌలిక రంగాల అభివృద్ధి గత వైసీపీ పాలనలో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. ప్రజలు సవాలక్ష సమస్యలతో అల్లాడిపోయారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన నాటి పాలకులు పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. అత్యంత ప్రధానమైన డీఆర్సీ సమావేశాలు కూడా మొక్కుబడిగా మారాయి. గడచిన ఐదేళ్లలో జిల్లాకు నలుగురు ఇన్‌చార్జి మంత్రులు నియమితులయ్యారు. తొలి ఇద్దరూ ఒక్క సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయకుండానే మారిపోయారు. అనంతరం వచ్చిన ఇద్దరిలో విశ్వరూప్ అడపాదడపా నిర్వహించినా ఎక్కువ కాలం కొవిడ్‌తోనే సరిపోయింది. ఆతర్వాత నియమితులైన మేరుగ నాగార్జున మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. పర్యవేక్షణలో నామమాత్రంగానే మిగిలారు.

అభివృద్ధి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అటు రాష్ట్ర స్థాయిలో, ఇటు జిల్లాలో ఎక్కడికక్కడ అభివృద్ధి అంశాలు, పాలన మెరుగుపై దృష్టి సారించింది. ఈవ్యవహారాలలో అత్యంతక కీలకంగా పనిచేసే జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. వారంతా తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటనలు ప్రారంభించారు. సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా జిల్లాపై దృష్టి పెట్టారు. పొరుగున ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన రామనారాయణరెడ్డి సీనియర్ రాజకీయవేత్త. జిల్లాలోని ఆర్థిక, సామాజిక అంశాలతోపాటు రాజకీయ, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉంది. ఆయన అనుభవం, అవగాహన జిల్లా అభివృద్ధి, పాలన వ్యవహారాలలో లోటుపాట్ల సవరణకు ఉపకరించనుంది.

గాడిలో పాలన, పథకాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు అందుతోంది. ప్రధానంగా పించన్లను పెంచింది. అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించింది. రేషన్ పంపిణీ, ఉద్యోగుల జీతాలు, సామాజిక పింఛన్‌లను సకాలంలో అందిస్తోంది. ఇతర వర్గాలకు చెందిన పథకాల్లోనూ కదలికవచ్చి క్రమపద్ధతిలో సాగుతున్నాయి. అధికారుల బదిలీల్లో మెజారిటీ పూర్తితో కొంత మేర పాలన గాడిలో పడుతోంది. అయితే శాశ్వత అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగు, ఉపాధి కల్పన అంశాలకు సంబంధించినవి ముందుకు కదలడం లేదు. వాటికి నిధుల సమస్య ప్రతిబంధకంగా కనిపిస్తోంది.

ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే

జిల్లాకు గతంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసి శంకుస్థాపనలు చేసిన ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీల నిర్మాణాలకు వైసీపీ పాలనలో ఒక్క ఇటుక కూడా పెట్టినపాపాన పోలేదు. అలాగే పారిశ్రామిక ప్రగతికి ఉపకరించే దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్ వంటి వాటి ఊసే కరువైంది. మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాల గిరిజన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాల్లో కదలిక లేదు. ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇలాంటి అభివృద్ధి అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

నీటి ప్రాజెక్టులకు నిధులు అవసరం

వెలిగొండ పెండింగ్ పనులు, నిర్వాసితుల పునరావాసానికి ఈఏడాది రూ.2వేల కోట్లు అవసరం. అలా కేటాయిస్తేనే కనీసం రెండేళ్లకు అయినా ప్రాజెక్టు నుంచి నీరిచ్చే అవకాశం ఉంది. గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు, పంట కాలువల కోసం మరో రూ.100 కోట్లు కావాలి. ఇక ఇతర ప్రాజెక్టులు. మీడియం, మైనర్ ఇరిగేషన్ పరిధిలో అనేక నీటి వనరులు కనీస మరమ్మతులు లేక అధ్వానంగా తయారయ్యాయి. ఎన్ఎస్పీ ఆయకట్టు పరిస్థితి దారుణంగా ఉంది. నీరు సక్రమంగా వదిలితే ఏకాలువ ఎప్పుడు ఎక్కడ తెగిపోతుందోనన్న పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో లస్కర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు లేక పర్యవేక్షణ కొరవడింది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు నిధులు లేక నీరసించిపోయాయి. ఫలితంగా వర్షాకాలంలోనూ పశ్చిమ ప్రాంతంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాల్సిన దుస్థితి నెలకొంది.

ఎనిమిది శాఖలకు చెందిన అంశాలతో అజెండా

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరగనుంది. ప్రకాశం భవన్ రెండో అంతస్తులోని కలెక్టర్ సమావేశపు హాలులో ఉదయం 10 గంటలలకు ఇది ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. భోజనం అనంతరం కీలక అధికారులతో మంత్రులు మాట్లాడే అవకాశం ఉంది. ఆనం ఆదేశాలతో ఎనిమిది శాఖలకు చెందిన కీలక విభాగాలకు సంబంధించిన అంశాలపై అధికారులు అజెండాను రూపొందించారు. అందులో వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఇరిగేషన్, అర్అండ్‌బీ, పీఆర్‌లో చేపట్టిన గుంతల రహిత రోడ్లు, డ్వామా, వైద్యారోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ ఉన్నాయి. వీటితోపాటు ఇతర అభివృద్ధి అంశాలు, నిధుల అవసరం, తక్షణ సమస్యల పరిష్కారంపై సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది. అవసరమైన వాటికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలోనూ ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవ చూపాలి. అదేసమయంలో జిల్లాలో వివిధ శాఖల్లో వెలుగుచూస్తున్న అవినీతి, అక్రమాలు, వాటిపై విచారణలు, సంబంధిత అధికారుల పనితీరుపైనా దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.


న్యూజిలాండ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, పక్కన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం

- ఎమ్మెల్యే ఏలూరి
- టీడీపీ న్యూజిలాండ్ వెబ్‌సైట్ ప్రారంభం

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం న్యూజిలాండ్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలసి హాజరయ్యారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారన్నారు. తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిందని, ప్రజల ఆశయాలకు ఆకాంక్షకు అనుగుణంగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఏలూరి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో నిర్బంధించినప్పుడు 100 దేశాల్లో నిరసనలు చేపట్టారని, అందులో న్యూజిలాండ్ వారు ఉండడం మర్చిపోలేనిదన్నారు. అనంతరం న్యూజిలాండ్ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దుకూరి దిలీప్, పరతాపరెడ్డి, మజీద్ సామ్యూల్, జితేంద్ర, నిమ్మగడ్డ మమత పాల్గొన్నారు.


బల్లికురవ మండలం నుంచి కూలి పనులకు వలస పోతున్న రోజు వారీ కూలీలు

పొట్ట కూటి కోసం కూలీల వలసబాట

బల్లికురవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోలో వెళుతున్న వారు రోజువారీ కూలీలు. ఇలా ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పదంటూ పొట్ట కూటి కోసం వలస బాట పడుతున్నారు. బల్లికురవ మండలం గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాల నుంచి రోజూ పదుల సంఖ్యలో ఆటోలలో రోజు వారీ కూలీలు పొరుగు మండలాలకు వలస పనులకు వెళుతున్నారు. అందరూ ఒక్కసారిగా ఆటో ఎక్కి వెళ్తుంటారు. కుటుంబ పోషణ కోసం ప్రమాదమైనా వెళ్లాల్సిందేనంటున్నారు.

దీక్షధారులకు అన్నదానం ప్రారంభం

ఇంకొల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప దీక్షధారులకు అన్నదానం ప్రారంభించారు. పోలేరమ్మ అమ్మవారి దేవాలయంలో 41 రోజుల పాటు ఈ అన్నదానం ఉంటుందని నిర్వాహకులు పువ్వాడ రవి స్వామి కోరారు.

ఆ ఇద్దరిపై ఆరోపణలు నిజమే!

- చర్యలు కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ లేఖ
- డీఎల్‌డీవో ఉషారాణిని సస్పెన్షన్‌తోపాటు సరెండర్‌కు సిఫార్సు
- డ్వామా పూర్వ పీడీ అర్జునరావు పైనా చర్యలు

ఒంగోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రెండు కీలక శాఖలలో పనిచేసిన ఇద్దరు జిల్లా అధికారుల అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలు నిజమేనని తేలింది. విచారణ కోసం కలెక్టర్ నియమించిన అధికారులు ఈమేరకు ఆమెకు నివేదించారు. దీంతో వారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియా లేఖలు రాశారు. అందులో ఒకరు గతంలో ఇన్‌చార్జి డీపీవోగా పనిచేసిన ఒంగోలు డీఎల్‌డీవో ఉషారాణి కాగా, మరొకరు డ్వామా పూర్వ పీడీ అర్జునరావు. జిల్లా పంచాయతీ అధికారి పరిధిలో జరిగిన సచివాలయ గ్రేడ్-5, గ్రేడ్-5 (సచివాలయ కార్యదర్శులు) బదిలీల్లో నిబంధనలు ఉల్లంఘించారని, పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఆ సమయంలో ఉషారాణి ఇన్‌చార్జి డీపీవోగా ఉన్నారు. ఆ ఫిర్యాదులపై విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. ప్రాథమిక విచారణ సమయంలోనే అవకతవకలు, అవినీతి వ్యవహారాలను గుర్తించి డీపీవో కార్యాలయంలో పనిచేసే ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. అనంతరం సమగ్ర విచారణ చేపట్టి ఇన్‌చార్జి డీపీవోగా ఉన్న ఉషారాణి ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో పూర్తిగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రధానంగా ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా, కలెక్టర్ ఇచ్చిన నోట్ ఆర్డర్‌కు భిన్నంగా కొన్ని బదిలీలు జరిగినట్లు తేల్చారు. బదిలీల సమయంలో, అలాగే ఇతర ప్రాంతాలకు విజిట్‌కు వెళ్లినప్పుడు అక్రమ వసూళ్లు, కొత్త డీపీవో విధుల్లో చేరాక కూడా ఉషారాణి కొన్ని ఆర్డర్లు ఇవ్వడం తదితర అంశాలను గుర్తించిన త్రిసభ్య కమిటీ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ఉషారాణిని సస్పెండ్ చేయడంతోపాటు ప్రభుత్వానికి సరెండర్‌కు సిఫార్సు చేస్తూ కలెక్టర్ అన్సారియా పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. మరోవైపు డ్వామా పూర్వ పీడీ అర్జునరావుపై కూడా చర్యలు కోరుతూ లేఖ రాశారు. ఇక్కడ అర్జునరావు పనిచేసిన సమయంలో ఆయన అవినీతిని భరించలేమని, నెలనెలా మామూళ్లు ముట్టచెప్పలేమంటూ డ్వామాలో మండల స్థాయిలో పని చేసే వారితోపాటు వివిధ విభాగాల సిబ్బంది కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు జేసీ గోపాలకృష్ణ విచారణ చేపట్టారు. ఆ విచారణలో కొంత జాప్యం జరగ్గా బదిలీల్లో భాగంగా అర్జునరావు జిల్లా నుంచి మరోచోటకు వెళ్లారు. కాగా సదరు వ్యవహారంపై రెండు రోజుల క్రితం జేసీ తన నివేదికను కలెక్టర్‌కు ఇవ్వగా అందులో అర్జునరావుపై సిబ్బంది చేసిన ఆరోపణలు, అవినీతి వ్యవహారాలు వాస్తవమేనని నిర్ధారించినట్లు సమాచారం. దీంతో అర్జునరావుపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ అన్సారియా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు.


ఇళ్లను చుట్టిన మురుగు నీరు..


విష సర్పాలకు అవాసాలుగా చిల్లచెట్లు, మురుగు

దుర్గంధం..దోమలతో సావాసం

- అధ్వానంగా దండుబాట రోడ్డు
- పందులు, విషసర్పాలకు ఆవాసం
- కన్నెత్తి చూడని అధికారులు
- రోగాలతో విలవిల్లాడుతున్న ప్రజలు

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అక్కడున్న వారు దోమలు..దుర్గంధం మధ్యే నివాసముంటున్నారు. చీరాల మునిసిపల్ పరిధిలోని దండుబాట రోడ్డులో వ్యర్థజలాలు, మురుగు నిల్వలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. జనావాసాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో దోమలు అవాసాలు ఏర్పాటు చేసుకుని చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఈక్రమంలోనే డెంగ్యూ బారిన పడి రోదిస్తున్నారు. సుమారు ఇంత జరుగుతున్నా మునిసిపల్ అధికారులు కన్నెత్తి కూడా చూడక పోవడం వారిని వేదనకు గురి చేస్తోంది. శానిటేషన్ లేదు, చెత్త సేకరణ అంతంత మాత్రంగానే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల చుట్టూ మురుగుతో అవస్థలు



ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇటువైపు రావడం లేదు. మా పరిస్థితి పట్టించుకున్న నాథుడు లేడు.

- కట్టా వెంకటేశ్వర్లు, స్థానికుడు

రోగాలు వస్తున్నాయి



మురుగుతో అవస్థలు పడుతున్నాం. చిల్ల చెట్లతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. దోమల దాడి పెరిగిపోయింది. కొంత కాలంగా అధిక శాతం మంది జ్వరాల బారినపడ్డారు. అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలి. అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.

- కుంభా వెంకాయమ్మ, స్థానికురాలు

భక్తుల కోసం పటిష్ట బందోబస్తు

వాడరేవు (చీరాలటౌన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేడు కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో చీరాల పరిధిలోని వాడరేవు, రామాపురానికి భక్తులు పోటెత్తనున్నారు. దీంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల రక్షణ కోసం హెచ్చరిక హోర్డింగ్‌లు ఉంచారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే పుణ్య స్నానాలు ఆచరించాలని రూరల్ సీఐ శేషగిరి రావు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తాళలేని భార్య ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బోయినవారిపాలెంకు చెందిన దంపతులకు గతంలోనే పలుమార్లు వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలోనే పుట్టింటికి వెళ్లిన భార్యను చూ సేందుకు వచ్చిన అల్లుడిని శనివారం మామ రాడ్డుతో దాడిచేసి గాయపరచగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరిగి భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదయింది.

క్రైం న్యూస్

చీరాలలో అదృశ్యమైన బాలుడు ఒడిసాలో

ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు


బాలుడితో వీడియోకాల్ మాట్లాడుతున్న ఎస్ఐ

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గత శుక్రవారం చీరాల్లో అదృశ్యమైన 12 ఏళ్ల మొళాయ్ నాయక్ ఆదివారం ఒడిసాలో ఉన్నట్లు ఈపూరుపాలెం పోలీసులు గుర్తించారు. జీవనోపాధి నిమిత్తం 15 రోజుల కిందట తల్లిదండ్రులతో చీరాల మండలం కావూరివారి పాలెం వచ్చిన మొళాయ్ ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఈమేరకు అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులకు ఆదివారం ఉదయం ఒడిసాలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ మొళాయ్ బంధువుల ద్వారా వీడియోకాల్‌లో మాట్లాడారు. అయితే బాలుడు క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి దాట్ల దుర్గా ప్రసాద్ (18) మృతదేహం ఆదివారం సాయంత్రం బయటపడింది. శనివారం దుర్గాప్రసాద్ బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం సాయంత్రమే గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం నుంచి అద్దంకి, ఒంగోలు అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది గాలింపు చేపట్టారు. సాయంత్రం గుండ్లకమ్మ బ్రిడ్జి నుంచి దిగువకు సుమారు 200 మీటర్ల దూరంలో దుర్గా ప్రసాద్ మృతదేహం దొరికింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


ప్రసన్నబాబు (ఫైల్)

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వేముల ప్రసన్న బాబు (39) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని కొత్తదామావారిపాలెంకు చెందిన వేముల ప్రసన్నబాబు, సోమేపల్లి అశోక్ 31వ తేదీ రా త్రి మోటార్‌సైకిల్‌పై శింగరకొండ వెళ్లి తిరిగి అద్దంకి వచ్చే క్రమంలో కూకట్ల కన్వెన్షన్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో డివైడర్‌పై పడి ప్రసన్నబాబుకు తీవ్ర గాయా లయ్యాయి. ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రసన్నబాబు కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పాలట్యాంకర్ ఢీకొని ఒకరికి గాయాలు

బల్లికురవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాలట్యాంకర్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొప్పెరపాడు సమీపంలో నామ్ రోడ్డులోని గొర్రెపాడు జంక్షన్ వద్ద ఆదివారం హైదరాబాద్ వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న పాలట్యాంకర్ మోపెడ్‌ను ఢీ కొ ట్టింది. తీవ్రంగా గాయపడిన అద్దంకి మండలం చినకొత్తపల్లికి చెందిన చెన్నుపాటి వెంకటేశ్వర్లును అద్దంకి వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి బేల్దారి మేస్త్రి మృతి

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్ పై నుంచి పడి బేల్దారి మేస్త్రి తోమట్ల పవన్‌కుమార్‌రెడ్డి (38) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పవన్‌కుమార్‌రెడ్డి అద్దంకి పట్టణంలోని టెలిఫోన్ ఎ క్స్ఛేంజ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. పట్టణంలోని వాసవీనగర్‌లో ఆదివారం సాయంత్రం బిల్డింగ్ పైన వాటర్ ట్యాంక్ పగులగొట్టి ఆ డస్ట్‌ను కింద ఉన్న ట్రాక్టర్‌లో పోసే క్రమంలో ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఖాదర్ బాషా పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పందిళ్లపల్లి సర్వీసు రోడ్డులో శనివారం రాత్రి చినగంజాం మండలం కడవకుదురుకు చెందిన మురికిపూడి అబ్రహాం (55) మృతి చెందారు. రోజులాగే చీరాలకు ద్విచక్ర వాహనంపై పనికి వచ్చి రాత్రి సమయంలో తిరిగి వెళుతుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అబ్రహాంకు భార్య, 12 ఏళ్ల, పదేళ్ల పాపలు ఉన్నారు.

70 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంపరాల, కుంకుపాడు తదితర గ్రామాలకు చెందిన 70 మంది రైతుల వ్యవసాయ కనెక్షన్‌లకు సంబంధించి 25 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు అయినట్లు రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. సోమవారం నుంచి అందజేయనున్నట్లు తెలిపారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి కూడా వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు రావినూతలలో కరెంట్ కట్

మేదరమెట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రావినూతల సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. రావినూతల సబ్ సేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పంగులూరు పరిధిలో

పంగులూరు : పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు జేఈ ఆంజనేయులు తెలిపారు. సబ్ స్టేషన్‌లో సర్క్యూట్ బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న సందర్భంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగ దారులు వి షయాన్ని గమనించి సహకరిచాలని కోరారు.

'నామినేటెడ్' కోసం నిరీక్షణ



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం



అద్దంకి మార్కెట్ యార్డ్ కార్యాలయం

- ప్రయత్నాలు ముమ్మరం చేసిన కూటమి నేతలు
- దేవాలయాల ట్రస్ట్ బోర్డులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు పోటీ
- మంత్రి గొట్టిపాటి వద్దకు క్యూ
- అందరి నిర్ణయంతో కేటాయిస్తామన్న రవికుమార్

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రారంభమైన నేపథ్యంలో స్థానికంగా నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎదురు చూస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవాలయాలతో పాటు పలు దేవాలయాల ట్రస్టుబోర్డులు, అద్దంకి, సంతమాగులూరు మార్కెట్ కమిటీల చైర్మన్‌లు, సభ్యులతోపాటు పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అదే సమయంలో సొసైటీల ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం ఉండడంతో నామినేటెడ్ ద్వారా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఆయా మండలాలలో యాక్టివ్‌గా పనిచేసిన నేతలు పదవులపై ఆశగా ఉన్నారు. టీడీపీ నేతలతో పాటు జన సేన, బీజేపీ నేతలు కూడా డైరెక్టర్ పోస్టులకు అవకాశం కల్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా దశాబ్దాల కాలంగా అద్దంకి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గ నేతలకే కేటాయిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య నేతలు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే పలువురు తమ ప్రయత్నాలలో భాగంగా మంత్రి రవికుమార్‌ను మందీమార్బలంతో వెళ్లి కలవగా బల ప్రదర్శన చేయవద్దని సున్నితంగా నేతలకు చెప్పినట్లు సమాచారం. అవసరమైతే అందరు ఆర్యవైశ్య నేతలతో మాట్లాడి నిర్ణయిస్తానని బల ప్రదర్శనలు చేస్తే మిగిలిన వారు కూడా అదే బాటలో నడుస్తారని చెప్పినట్లు తెలుస్తుంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా గతంలో అగ్ర వర్ణాల నేతలు పనిచేయగా, వైసీపీ ప్రభుత్వం బీసీ, కాపులకు అవకాశం కల్పించింది. ఇక మార్కెట్ కమిటీ విషయానికొస్తే రిజర్వేషన్‌ల విషయం చర్చనీయాంశంగా మారింది. గతంలో మార్కెట్ కమిటీలకు ఎలాంటి రిజర్వేషన్‌లు లేకపోగా వైసీపీ పాలనలో రిజర్వేషన్‌లు కల్పించారు. దీంతో అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తొలి విడత బీసీలకు, సంతమాగులూరు మార్కెట్ కమిటీ ఎస్సీలకు అవకాశం కల్పించారు. రెండవ దఫా అద్దంకి ఎస్సీలకు, సంతమాగులూరు బీసీలకు కేటాయించారు. దీంతో వైస్ చైర్మన్‌లుగా అగ్రవర్ణాల వారికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏ విధంగా ఉంటుందో అన్న చర్చ కూడా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావడంతో పదవుల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. పదవులు ఆశిస్తున్న నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాలలో నిమగ్నమయ్యారు. నామినేటెడ్ పదవులను సామాజిక వర్గాల సమతూకం పాటించాల్సి ఉండడంతో ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ ప్రయత్నాలు ప్రారంభించారు.



గోటి తలంబ్రాలకు సిద్ధం చేసిన వడ్లు

కోటి గోటి తలంబ్రాలకు సన్నాహం

చీరాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి స్వామివారి కల్యాణ మహోత్సవంలో కోటి తలంబ్రాలు సమకూర్చే క్రమంలో భాగంగా రామ భక్తులు ఆదివారం గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు వడ్లను ప్రత్యేక పూజలతో సన్నద్ధం చేశారు. ప్రతి ఏడాది చీరాల ప్రాంతం నుంచి భద్రాచలం రాములవారి కల్యాణ మహోత్సవానికి తమ వంతు బాధ్యతగా గోటి తలంబ్రాలను సిద్ధం చేసి భక్తులు తీసుకు వెళుతుంటారు. అందులో భాగంగా కార్యాచరణ చేపట్టారు. భక్తులు ఆ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వహకులు కోరారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతతో సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రక్త హీనతతో బాధపడుతున్న వ్యక్తికి రోటరీ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతో ఆదివారం రక్తదానం చేశారు. కటారపు ప్రసన్న రక్త హీనతతో బాధపడుతుండడంతో వైద్యులు ఏ పాజిటివ్ రక్తం అవసరమని చెప్పడంతో బాధితులు రోటరీ సెక్రటరీ సీహెచ్ మురళి సుధాకరరావును సంప్రదించారు. ఆయన ప్రోత్సాహంతో వ్యవసాయ శాఖలో పని చేస్తున్న వినుకొండ శివ చంద్రకుమార్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మలాది శ్రీనివాసరావు, వై.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. రక్తం ఇచ్చిన దాతను, ప్రోత్సహించిన వారిని రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య ప్రశంసించారు.

11న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

బల్లికురవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈ నెల 11వ తేదీన జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దుడ్డు వందనం పిలుపునిచ్చారు. మండలంలోని కొణిదెనలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. మందా కృష్ణమాదిగ హాజరయ్యే ఈ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కందకూరి పేతురు, బండి బాబురావు, మందా వీరయ్య, జనరాజుపల్లి పెదదేవదాసు, మరియదాసు, అబ్రహం పాల్గొన్నారు.



216 జాతీయ రహదారి పక్కన జరుగుతున్న ఇసుక ఫిల్లింగ్, నిర్మాణ పనులు

అధికారులకు కనిపించని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా

వేటపాలెం(చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆ విషయం బహిరంగ రహస్యం. అయితే సంబంధిత అధికారులకు మాత్రం కనిపించడం లేదు. అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపట్టకపోవడం అందుకు నిదర్శనం. ఈ క్రమంలో ఒకరిని చూచి మరొకరు ఇసుక దందాను కాసులు సంపాదించే వనరుగా అడుగులు వేస్తున్నారు. దీంతో సహజ వనరుల దోపిడీని అరికట్టేందుకు ఏ అధికారులు ముందుకు రావాలో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు, వాన్‌పిక్ భూముల్లో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగడం పరాకాష్ఠ. దీనిపై అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.





వేటపాలెం, చినగంజాం మండలాల సరిహద్దుల్లో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్, పందిళ్లపల్లి సమీపంలో.. బచ్చులవారిపాలెం రోడ్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌లు

నిబంధనలకు పాతర.. ప్రభుత్వ ఆదాయానికి గండి

వేటపాలెం (చీరాల), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర పనులకు, నిర్మాణాలకు పలువురు పనులు చేస్తున్నారు. వీటిపై స్పందించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం ఎందుకనేది వారికే తెలియాలి.

ఉత్సాహంగా రోటరీ యువజన వారోత్సవాలు

డాన్స్ అదరగొట్టిన చిన్నారులు



నాట్యం చేస్తున్న శ్రీవిద్య

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో నృత్య పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా చీరాల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అద్భుతమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, క్లాసికల్, వెస్ట్రన్ డాన్స్‌లతో చిన్నారులు అదరగొట్టారు. అలాగే



యోగాతో అలరిస్తున్న విద్యార్థులు

పోటీలను నిర్వాహకులు ఎంతో ఉల్లాస భరితంగా నిర్వహించారు. అదిరేటి డ్రస్ మేమేస్తే... యాహూ యాహూ బోలు యాహూ.. అరబిక్..చింపిరి జుట్టుదాన్ని.. ఘల్లు ఘల్లు జోడెడ్ల బండిచూడు.. అంటూ చిందేశారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. విద్యార్థి దశలో ఉన్నవారిని ఉత్సాహ పరచడం వలన వారిలోని టాలెంట్‌ను గుర్తించవచ్చని నిర్వాహకులు చెప్పారు. వేడుకల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంతీయ కార్యదర్శిగా బాబూరావు ఎన్నిక

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శిగా మరోసారి ఎన్.బాబూరావు ఎన్నిక అయ్యారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శని, ఆది రెండు రోజులపాటు 11వ మహాసభల్లో నూతను కమిటీని ఎన్నుకున్నారు. ఈక్రమంలో సభ్యులుగా ఎం.వసంతరావు, హరిప్రసాద్, ప్రతాప్‌కుమార్, సుందర్, రంగారావు, రేఖ, చిరంజీవిలను ఎన్నుకున్నారు. దీంతో నూతన కమిటీని అందరూ అభినందించారు.

రోడ్ల మార్జిన్‌లో చెత్త కుప్పలు

- కంపుతో ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనచోదకులు
- పొంచి ఉన్న ప్రమాదాలు



దర్శి రోడ్డు నుంచి గుండ్లకమ్మ వెళ్లే దారిలో వేసిన ఇంటి వ్యర్థాలు

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల మార్జిన్‌లను డంపింగ్‌కు అడ్డాలుగా మార్చడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి పట్టణం చుట్టూ పలు ప్రధాన రోడ్లతో పాటు మిగిలిన రోడ్లలోని మార్జిన్‌లలో పాత ఇళ్లు తొలగించే సమయంలో వచ్చే వ్యర్థాలు, చెత్తా చెదారం, కొబ్బరి బొండాలను పడవేస్తున్నారు. ప్రధానంగా నామ్ రోడ్డులో మేదరమెట్ల వైపు నల్లవాగు వరకు, దర్శి రోడ్డు నుంచి గుండ్లకమ్మ నది వైపు వెళ్లే సీసీ రోడ్డులో, రేణింగవరం రోడ్డులో ఎక్కువగా చెత్తా చెదారం, వ్యర్థాలు కుప్పలుకుప్పలు పడేస్తున్నారు. గుండ్లకమ్మకు వెళ్లే రోడ్డులో సీసీ రోడ్డు పైనే వ్యర్థాలను డంపింగ్ చేయగా, వాహనాలు పక్కన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే సరికే దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌ల వద్ద వర్థాలను వేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక, వాహనచోదకులు కోరుతున్నారు.



నల్లవాగు సమీపంలో నామ్ రోడ్డు పక్కన వేసిన చెత్త,



నామ్ రోడ్డులో మార్జిన్‌లో మట్టి కుప్ప

తూనికలు, కొలతలపై అవగాహన



తూనికలను పరిశీలిస్తున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అమ్మకాలు జరిపే సమయంలో కొనుగోలుదారులపట్ల జాగ్రత్త వహించాలని, న్యాయపరమైన అమ్మకాలు జరపాలని తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజక్ అన్నారు. ఆదివారం జిల్లా తూనికలు కొలతలు శాఖ, వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కూరగాయల మార్కెట్, చాపలు, చికెన్ వ్యాపారుల తూకాలను పరిశీలించారు. ధర్మ కాటాతోనే క్రయ విక్రయాలు జరపాలన్నారు. కొనుగోలుదారులు సమస్యలు ఎదుర్కొంటే స్థానికంగా ఉన్న కార్యాలయం లేదా టోల్ ఫ్రీ నంబర్ 1967కి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లిల్లీ, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, వినియోగదారుల సంఘం జిల్లా ప్రతినిధి దాసరి ఇమ్మానియేల్, సాంకేతిక సహాయకులు బేగ్, మేలుకొలుపు సభ్యులు లక్ష్మీనారాయణ మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో ఇంకొల్లు విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన ఇంకొల్లు విద్యార్థులు

ఇంకొల్లు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఆదివారం జరిగిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2024 జరిగిన పోటీలలో జేకే గోజురే కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో 11 మంది విద్యార్థులు పాల్గొనగా, మొదటి స్థానంలో ముగ్గురు, రెండో స్థానంలో ఐదుగురు, మూడవ స్థానంలో ముగ్గురు విజయం సాధించినట్లు కోచ్‌లు ఎం.శేఖర్, ఎం.శిరీష తెలిపారు. విజేతలకు జేకే గోజురే ఫౌండర్ జె.శ్రీనివాసులు, జె.హరినాథ్ బహుమతులు అందజేసారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

చినగంజాం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారుడు ఎస్.మణిరెడ్డిని ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కబడ్డీ క్రీడాకారుడైన మణిరెడ్డి ఒంగోలు ఆంధ్రకేసరి ప్రకాశం యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికై చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలలో పాల్గొని చినగంజాం వచ్చిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.గిరిబాబు తెలిపారు. బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ ఆధ్వర్యంలో మణిరెడ్డిని క్లబ్ అధ్యక్షులు, సభ్యులు సన్మానించి, రూ.5,000 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు కంసాని సతీష్‌రెడ్డి, శివారెడ్డి, దేశం సుబ్బారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారుడు మణిరెడ్డిని సన్మానిస్తున్న బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ సభ్యులు

భక్తుల రద్దీ దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి

అద్దంకి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో భక్తుల ఎక్కువగా ఉండే రోజులలో అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సీఐ కృష్ణయ్య తెలిపారు. మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయానికి కార్తీక మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో గుండ్లకమ్మ నదిలోని స్నానాల ఘాట్ వద్ద భక్తులు ఎక్కువ లోతుకు స్నానాలకు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్తీక దీపాలు వెలిగే సమయంలో కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సీఐ సూచించారు. ఈ నెల రోజులూ నదీ స్నానాలు చేసే భక్తులను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన తోపాటు ఈవో వాసుబాబు, టీడీపీ నేత కరిముల్లా తదితరులు ఉన్నారు. అనంతరం మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో సీఐ కృష్ణయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మణికేశ్వరం వద్ద స్నానాల ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కయ్య చౌదరి మృతి



అక్కయ్య చౌదరి

కారంచేడు (పర్చూరు), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి (68) ఆదివారం అనారోగ్యంతో కారంచేడులోని ఆయన నివాసంలో మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలక నాయకుడిగా ఆయన పనిచేశారు. తొలిదశలో కారంచేడు పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రెసిడెంట్‌గా, ఎంపీపీగా, జిల్లా డెయిరీ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం పర్చూరు ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పాలనలో రైతుల అభ్యున్నతికోసం కృషి చేశారు. అక్కయ్య చౌదరికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రజల పక్షాన పనిచేసిన వ్యక్తి అక్కయ్య ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

ప్రజల పక్షాన పనిచేసిన వ్యక్తి అక్కయ్య చౌదరి అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం అక్కయ్య చౌదరి మృతి చెందిన వార్త తెలుసుకున్న ఏలూరి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. న్యూజిలాండ్ నుంచి ఒక ప్రటనలో సంతాపం తెలిపారు. టీడీపీ అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అనునిత్యం ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తిగా అక్కయ్య చౌదరి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు చెప్పా రు. అక్కయ్య కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు.

శివాలయంలో వంట గది ప్రారంభం

మార్టూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో నేతాజీనగర్ సమీపంలో శ్రీశ్యామలాంబా సమేత ఘటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం వంటశాల గదిని ప్రారంభించారు. గ్రామానికి చెందిన గ్రానైట్ పరిశ్రమ యజమాని పోపూరి శ్రీనివాసరావు సహకారంతో గదిని నిర్మించారు. ఆదివారం రాత్రి నుంచి దీక్షధారులకు దాతల సహకారంతో భిక్ష కార్యక్రమాన్ని భక్తులు ప్రారంభించారు.




70 టీఎంసీలు దాటిన సోమశిల

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం 70 టీఎంసీలు దాటింది. ఎగువ నుంచి ఆదివారం 17,650 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 70.241 టీఎంసీలకు చేరుకొంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5





డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వేదికపై మంత్రులు నారాయణ, ఆనం, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్, జేసీ తదితరులు

కలిసికట్టుగా అభివృద్ధి చేస్తాం

- డీఆర్సీలో చర్చించిన సమస్యలకు పరిష్కారం
- గ్రామ సచివాలయాల పనితీరుపై సమీక్షించాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- పలు శాఖలపై సుదీర్ఘ చర్చ
- వేమిరెడ్డికి అవమానం.. వెళ్లిపోయిన ఎంపీ

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని ప్రజాప్రతినిధులందరితో కలిసికట్టుగా పనిచేస్తాం.. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం'.. అని ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. గతంలో తాను మంత్రిగా, డీఆర్సీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మేలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా సమీక్ష మండలి(డీఆర్సీ) సమావేశం మంత్రి ఫరూక్ అధ్యక్షతన ఆదివారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానమైన 11 శాఖలపై సమీక్ష నిర్వహించాలని తొలుత భావించినా, కీలకమైన శాఖలపై చర్చలకే ఎక్కువ సమయం పట్టింది. ఇరిగేషన్, వ్యవసాయం, దాని అనుబంధ శాఖలు, డ్వామా, పంచాయతీరాజ్ శాఖలపై సుదీర్ఘంగా సమీక్ష జరిగింది. ఆయా శాఖల్లోని పురోగతిని ఉన్నతాధికారులు వివరించారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు. వీటిపై మంత్రులు ముగ్గురూ స్పందిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ డీఆర్సీలో చర్చించిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను వచ్చే సమావేశంలోపు ఆయా ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సచివాలయాల పనితీరుపై సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో ఓఅండ్ఎం పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆమంచర్ల ఇండస్ట్రియల్ పార్కు వివాదంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఓ ఆనంద్, జేసీ కే కార్తీక్, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, బల్లి కల్యాణ చక్రవర్తి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలి



కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించి జిల్లాలోని రైతులు, వ్యాపారులను ఆదుకోవాలి. బియ్యం, రొయ్యలు, మిర్చి, పత్తి, గ్రానైట్ ఎగుమతులు అయ్యేలా చూడాలి. జిల్లాలో పలువురు గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. కొందరికి ఆధార్ కార్డులు కూడా లేవు. ప్రత్యేక డ్రైవ్ పెట్టి గిరిజనులను ఆదుకోవాలి. సచివాలయాల్లో సిబ్బంది చాలా మంది ఖాళీగా ఉంటున్నారు. వీరి పనితీరును పరిశీలించి అవసరం మేరకు ఉపయోగించుకోవాలి. 2019-24 మధ్యన వ్యవసాయాన్ని నాశనం చేశారు. కానీ మేము ప్రతీ గ్రామంలో రైతుల భాగస్వామ్యంతో పనులు చేయిస్తున్నాం.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే



ఇండస్ట్రియల్ పార్కు వివాదం పరిష్కరించాలి

ఆమంచర్ల వద్ద 562 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్కు కోసం 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.50 కోట్లు రైతులకు చెల్లించి భూసేకరణ చేసింది. అంతా అయిపోయాక అటవీ శాఖ ఆ భూములపై వివాదం చేసింది. అనేకమార్లు దీనిపై విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. రూపాయి ఖర్చు లేని పని ఇది. ఈ వివాదాన్ని పరిష్కరిస్తే 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి. కొమ్మరపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

యూరియా ధరల్లో తేడా ఎందుకు?



యూరియా ధరల్లో పీఏసీఎస్‌లకు, డీలర్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటోంది. ఒక బస్తాకు రూ.68 తేడా ఎందుకు ఉంటోంది..? పీఏసీఎస్‌లకు సరిపడా యూరియా నిల్వలు సరఫరా చేయకపోతే రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అప్పుడు వారిపై ఆర్థిక భారం పడుతుంది. ఎక్కువగా సాగు జరుగుతున్న నేపథ్యంలో యూరియా దొరకదన్న ఆందోళన రైతుల్లో ఉంది. దీనిపై అధికారులు అవగాహన కల్పించాలి. రాళ్లపాడుకు సోమశిల నుంచి రావాల్సిన వాటాను సక్రమంగా అందించాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

లస్కర్లకు జీతాలు చెల్లించాలి

సాగునీటి యాజమాన్యంలో లస్కర్లు కీలకం. వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి. నీటి సంఘాల ఎన్నికల్లో కొత్త ఓటర్లపై దృష్టి పెట్టి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలి. కోవూరు నియోజకవర్గంలో ఆయకట్టుకు తగ్గట్టుగా ఓఅండ్ఎం వర్కులు మంజూరు చేయలేదు. దీంతో చాలా కాలువల్లో పూడిక తీత పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. రానున్న సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలను ఉంచుకోవాలి. ధాన్యం నిల్వ చేసుకునేందుకు మార్కెటింగ్ శాఖ గోదాములు సిద్ధం చేయాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే



నిధులు మంజూరు చేయాలి
దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

మా ప్రాంతంలో కాలువలు, చెరువులు ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ఎస్టిమేషన్లు వేసి ప్రభుత్వానికి పంపలేదు. మైనర్ ఇరిగేషన్ యాక్టివ్‌గా

(మిగతా 6లో)



బదిలీల్లో గందరగోళం

- తప్పుల తడకగా సీనియారిటీ జాబితా
- మున్సిపల్ టీచర్లలో అయోమయం
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల వ్యవహారం గందరగోళంగా మారింది. మున్సిపల్ టీచర్ల నియామకాలు, పదోన్నతులను గతంలో మున్సిపల్ అధికారులే నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం వీరి సర్వీసులన్నీ కూడా పాఠశాలవిద్య పరిధిలోకి వచ్చాయి. దీంతో విద్యాశాఖ సమక్షంలో పదోన్నతులు, బదిలీలు చేపట్టారు. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో సమానంగా ప్రస్తుతం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌కు హెచ్ఎంలుగా, ఎస్జీటీలుగా పనిచేస్తున్న టీచర్లకు ఎస్ఏలుగా పదోన్నతులు కల్పించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అయితే ఈ జాబితాను పరిశీలించిన ఉపాధ్యాయులు అయోమయానికి గురై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. జాబితా అంతా తప్పులతడకగా ఉందని, వెంటనే సరిదిద్ది పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులో 68, గూడూరులో 18, కావలిలో 21 కలిపి మొత్తం 107 మున్సిపల్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 630 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ఎస్జీటీల నుంచి తగిన అర్హతలు కలిగిన వారికి ఆయా సబ్జెక్టుల్లో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు. అయితే నాడు మునిసిపల్ శాఖ పరిధిలో ఉన్న సమయంలో ఈ పాఠశాలల్లో డీఎస్సీతో సంబంధం లేకుండా ఉపాధ్యాయులను నియమించారని, వీరిలో కొందరిని 1996 డీఎస్సీలో నియమించినట్లు సీనియారిటీ జాబితాలో చేర్చారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అప్పట్లో నియమితులైన పండిట్లను కూడా పదోన్నతుల జాబితాలో చేర్చారని, తెలుగులో పీజీ, బీఈడీలో తెలుగు మెథడాలజీ చదవి ఎస్ఏ పదోన్నతులకు అర్హులైన వారిని జాబితాలో చేర్చలేదని అంటున్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, 2019లో పదోన్నతి పొందిన వారి పేర్లు సీనియారిటీ జాబితాలో చేర్చడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటినీ సరిదిద్దకుంటే మాత్రం ఆందోళన చేస్తామని ఆయా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

పారదర్శకంగానే పదోన్నతులు

ఉపాధ్యాయ పదోన్నతుల విషయమంలో మున్సిపల్ అధికారులు అధికారికంగా ఇచ్చిన జాబితానే వెబ్‌సైట్‌లో ఉంచాం. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తప్పులు సరిదిద్దుతాం. టీచర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సమస్యలేమైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చు. పదోన్నతులను పారదర్శకంగానే నిర్వహిస్తాం.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో



నేటి నుంచి సిద్దలకోన తిరునాళ్ల



సిద్దలకోన ముఖద్వారం

సుమారు రెండువేల సంవత్సరాల చరిత్ర గల సిద్దలకోనలో ప్రతిఏటా కార్తీకమాసంలో నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాములకు తిరునాళ్ల నిర్వహిస్తారు. ఈ క్రమంలో కార్తీకమాసం తొలి సోమవారం (నేటి నుంచి) తిరునాళ్ల జరగనున్నది. ఈ మాసంలో వచ్చే అన్నీ సోమవారాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా మూడో సోమవారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది ఆ ఒక్కరోజే వేలాదిమంది భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. జిల్లా నలుమూలల నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు.

6

సత్ఫలితాలిస్తున్న వారోత్సవాలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీ కళ్లు తెరిచినట్లుగా కనిపిస్తోంది. గతంలో ఆదాయం కోసం ఉద్యోగులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేసిన ఆర్టీసీ తాజాగా ప్రతి నెలా డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ నెలలో ప్రారంభమైన (2వతేదీన) ఈ వారోత్సవాలకు డ్రైవర్ల నుంచి విశేష స్పందన లభించింది. ఇక ఆర్టీసీ జోన్ ఈడీ ఈ వారోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి డిపోలో డ్రైవర్లతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు.

● ప్రతినెలా 7వరకు వారోత్సవాలు

ఈ వారోత్సవాలను ప్రతినెలా ఒకటోతేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా ఒకటో నుంచి 3వ తేదీ వరకు బస్సులు నడిపే డ్రైవర్ల నుంచి బస్సుకు సంబంధించిన ఇబ్బందులు, మరమ్మతులు సమాచారం తీసుకుంటారు. 4 నుంచి 7 వరకు డ్రైవర్లు చెప్పిన సమస్యలను పరిష్కరించి, ఆ వివరాలను వారికి తెలియజేస్తారు. దీంతో చిన్నపాటి మరమ్మతులను సైతం డ్రైవర్లకు అనుగుణంగా ఆర్టీసీ గ్యారేజీలో పరిష్కరిస్తారు.

డ్రైవర్లు సంతోషంగా ఉంటే సంస్థకు ఆదాయం

ఆర్టీసీ గ్యారేజీలో ఆయా డిపోలకు చెందిన బస్సులను రెగ్యులర్‌గా మరమ్మతులు చేస్తూనే ఉంటారు. అయితే గేరు సౌండ్ రావడం, బ్రేక్ పట్టేయడం, స్టీరింగ్‌లో చిన్న సమస్యలు, అద్దాలు లేకపోవడం తదితర సమస్యలను పెద్దగా పట్టించుకోరు. సంతోషకర వారోత్సవాల ద్వారా అధికారులు మొదటి వారంలో ప్రతి డ్రైవర్‌తో మాట్లాడి బస్సులో ఉన్న సమస్యలను తెలుసుకుంటారు. ఆ తరువాత సమస్యలను పరిష్కరిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లు సంతోషంగా ఉంటారు. వారు సంతోషంగా ఉంటేనే సంస్థ ఆదాయం పెరుగుతుంది.


- గిడుగు వెంకటేశ్వరరావు, ఆర్టీసీ జోన్ ఈడీ



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు(ఫైల్)

కలిసి నడుద్దాం.. ఐక్యత నిలుపుదాం !

జిల్లా కూటమి నేతల సమావేశంలో తీర్మానం ● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఫరూక్



టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్, పాల్గొన్న మంత్రులు ఫరూక్, ఆనం, ఎంపీ వేమిరెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

నెల్లూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల నేతలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని, కూటమి ఐక్యతను నిలుపుకోవాలని ఆయా పార్టీల నేతలు తీర్మానించారు. ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన తెలుగుదేశం, జనసేన, బీజేపీల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టీడీపీ జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, జనసేన నాయకులు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, నూనె మల్లికార్జున యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్, ప్రధాన కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● సఖ్యతపై చర్చ

ఈ సమావేశంలో ప్రధానంగా కూటమిలోని మూడు పార్టీల నాయకుల మధ్య సఖ్యతపై చర్చ జరిగింది. ప్రభుత్వ, రాజకీయ కార్యక్రమాల్లో జనసేన, బీజేపీ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదనే ఆవేదన ఆ పార్టీల నాయకుల నుంచి వ్యక్తమైంది. దీనిపై ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ స్పందిస్తూ నియోజక వర్గ స్థాయిలో జనసేన,బీజేపీ నాయకుల పేర్లు సూచిస్తే వాటిని పార్టీ అధిష్ఠానం ముందు ఉంచి నియోజకవర్గ స్థాయిలో ఆ నాయకు లను కలుపుకొని వెళ్లేలా టీడీపీ ఎమ్మెల్యేలకు, నాయకులకు సూచనలు చేస్తామన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ న్యాయం జరిగేలా చూడాలని జనసేన,బీజేపీ నాయకులు మంత్రుల దృష్టికి తెచ్చారు. ఇందుకు ఫరూక్ సమాధానం ఇస్తూ నామినేటెడ్ పదవుల విషయంలో కూటమి అగ్రనాయకులతో హైలెవల్ కమిటీ వేశారని, ఎవరికి ఏ పదవులు ఇవ్వాలనే విషయాన్ని ఆ కమిటీ చూసుకుంటుంది తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలకు సంబంధం ఉండదని వివరించారు. జిల్లా స్థాయిలో కూటమి నాయకులంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో కూటమి నాయకులందరూ సమష్టిగా చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కూటమి ఐక్యత మరింత బలపడేలా మూడు పార్టీల నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని సమావేశానికి హాజరైన నాయకులు పేర్కొన్నారు.

కండలేరు నీరు వచ్చేనా... పొదలకూరు దాహార్తి తీర్చేనా ?



పొదలకూరుకి తాగునీటిని సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కండలేరు నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా తాగునీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసింది. ఫిబ్రవరిలో టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. అయితే వేసవిలో పట్టణవాసులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాల్సిన గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.దీంతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటికీ పైపులైను పనులు పూర్తికాలేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో.. తాగునీరెప్పుడు అందుతుందోనని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.

(వివరాలు 6లో)

ఎన్‌డీసీఎంఎస్ ప్రక్షాళన

- అక్రమ నియామకాల రద్దుకు ఆదేశాలు
- ఆదాయమార్గాలపై దృష్టి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 3: నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్)లో ప్రక్షాళన ప్రారంభమైంది. గత పాలకవర్గంలో సహకార చట్టాలకు విరుద్ధంగా కొందరిని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో నియమించటంతో ఎన్‌డీసీఎంఎస్ ప్రత్యేకాధికారి, జేసీ కార్తీక్ వారిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక డీసీఎంఎస్ ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. గత పాలకవర్గంలో ఎన్‌డీసీఎంఎస్‌లో 11 మందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాల్లో నియమించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వారికి విధులు లేకపోవటం, చెల్లించటానికి నిధులు లేకపోవటంతో వారు సంస్థకు పెద్ద భారమని జేసీ విచారణలో తేలింది. దీంతో ఎన్‌డీఎంఎస్ ప్రక్షాళనకు ఆయన పూనుకు న్నారు. 11 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు నిరంజన్‌రెడ్డి అనే సేల్స్‌మన్‌ను కూడా విధుల నుంచి తొలగించారు. సేల్స్‌మన్ నిధుల దుర్వినియోగానికి పాల్పడడం, ఆయనపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో విధుల నుంచి తప్పించారు. ఎరువులు, పురుగమందుల వ్యాపారాల ద్వారా ఓ వెలుగు వెలిగిన ఎన్‌డీఎంఎస్‌లో కొత్తగా జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నగరంలో ఎన్‌డీసీఎంఎస్‌కు సంబంధించి రైస్‌మిల్లు కూడా ఉంది. దాని స్థానంలో వ్యాపార సముదాయం నిర్మాణానికి జేసీ చర్యలు తీసుకుని, డీసీఎంఎస్ అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



(5వ పేజీ తరువాయి)

లేదు. చాలా కాలువల్లో పూడిక పేరుకుపోయి ఉంది. మాకు ఏదో ఒక ఫండ్ కింద నిధులు మంజూరు చేయాలి. చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలి. గతంలో టెండర్లు పిలిచినా కొన్ని రోడ్డు పనులు పూర్తి చేయలేదు. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

● ఫ్లైవోవర్ నిర్మించాలి



నెల్లూరు నగర పరిధిలోని చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఫ్లైవోవర్ నిర్మించాలి. ఇది నగర ప్రజలకు చాలా అవసరం. ఫ్లైవోవర్ నిర్మించినప్పటికీ ముత్తుకూరు గేట్ జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. జాఫర్‌సాహెబ్ కాలువకు చేసిన రివిట్‌మెంట్ రోడ్డు లెవల్‌కు సరిపోయింది. దీని మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశ ముంది. ఈ కాలువ వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

- పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

కలిసికట్టుగా అభివృద్ధి చేస్తాం



అవమానం జరిగిందని సభ నుంచి వెళ్లిపోతున్న వీపీఆర్



మంత్రుల ముచ్చట్లు

● ఎంపీ వేమిరెడ్డికి అవమానం

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి డీఆర్సీలో అవమానం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభం కాగానే ముగ్గురు మంత్రులతో పాటు ఎంపీ వేమిరెడ్డి కూడా వేదికపై ఆశీనులయ్యారు. నెల్లూరు ఆర్డీవో అనూష.. ప్రొటోకాల్ ప్రకారం వరుస క్రమంలో అందరినీ వేదికపైకి ఆహ్వానించారు. వీరికి అధికారుల చేత బొకేలు ఇప్పించారు. అయితే ఎంపీ వేమిరెడ్డిని మాత్రం విస్మరించారు. దీంతో అవమానంగా భావించిన వేమిరెడ్డి.. వెంటనే తన సీట్లో నుంచి లేచారు. 'రెస్పెక్ట్ ఇవ్వడం తెలుసుకోవాలి' అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేదిక నుంచి దిగి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఒక్కసారిగా సమావేశ మందిరం సైలెంట్ అయిపోయింది. వెంటనే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి, ఆర్డీవో అనూషలు వేమిరెడ్డికి సర్దిచెప్పేందుకు వెనకాలే వెళ్లారు. కానీ అప్పటికే ఎంపీ కారులో ఎక్కి జడ్పీ నుంచి వెళ్లిపోయారు. ఆ వెంటనే లోపలికి వచ్చిన మంత్రి ఆనం.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదిక మీదకు ఎంపీ వచ్చాక ఆహ్వానించకపోవడం పొరపాటని అన్నారు. అందరి తరఫున వేమిరెడ్డికి క్షమాపణలు చెబుతున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆనం ఆదేశించారు. ఈ విషయంలో అధికారుల తీరుపై ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కూడా అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల విషయంలో గౌరవంగా వ్యవహరించాలని, మళ్లీ ఇటువంటి పొరపాట్లు జరగకూడదని అధికారులను ఆదేశించారు.



ఎమ్మెల్సీలతో కోటంరెడ్డి మాటామంతి



స్వయంభువులై వెలసిన సిద్దులు

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా సిద్దేశ్వర కోన

నేటి నుంచి

సిద్ధలకోన తిరునాళ్ల

ప్రత్యేక ఆకర్షణగా దక్షిణామూర్తి ఆలయం

సైదాపురం, నవంబరు 3: ఆహ్లాదకరమైన అడవుల్లో.. ఎతైన కొండపై.. పెద్ద సొట్ట బండరాయి లోపల స్వయంభువుగా వెలసిన సిద్దులకోన (సిద్దేశ్వరకోన) ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇది మండల కేంద్రమైన సైదాపురానికి 3 కి.మీ. దూరంలో ఉంది. రెండు వేల సంవత్సరాల చరిత్ర గల ఈ క్షేత్రంలో ప్రతి ఏటా కార్తీకమాసంలో నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యడు సారంగధర స్వాములకు తిరునాళ్ల నిర్వహిస్తారు. ఈ క్రమంలో నేటి నుంచి (కార్తీక మాసం తొలి సోమవారం) తిరునాళ్ల జరగనున్నది. కార్తీక మాసంలో వచ్చే అన్నీ సోమవారాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తారు. కాగా మూడో సోమవారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది ఆ ఒక్కరోజే వేలాదిమంది స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

● ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక

సిద్దలకోన తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచే కాక తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేని వారికి సంతానం కలిగినప్పుడు వారి పిల్లలకు సిద్దలయ్య, సిద్దమ్మ, సారంగయ్య వంటి పేర్లు పెట్టుకుంటారు.

● మంత్రపుష్పం ప్రత్యేకత

నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర స్వాముల వారి శిరస్సుపై పూజారులు పుష్పాలను పెట్టి మంత్రాలు చదువుతారు. పుష్పం స్వామివారి నుదుటన కుడివైపు కిందకు పడితే త్వరలోనే కోరిక నెరవేరుతుందని, పుష్పం వెనుక భాగంలో పడితే కోరిక నెరవేరదని భక్తుల విశ్వాసం. కోర్కెలు నెరవేరిన భక్తులు ఆలయాభివృద్ధికి విరాళాలు అందచేస్తుంటారు.

● దొనల ప్రత్యేకత

మంచినీరు, పసుపునీరు, చెక్కపొడి, శీకాయ, కుంకుమ, గంధం, విభూది, సంతానం దొనల్లో నిత్యం నీరు ఉంటుంది. ఈ దొనల్లో మహిళలు స్నానం చేసి సంతానం కోసం స్వామివార్ల ముందు వరపడినప్పుడు స్వప్నంలో స్వామివారు పూలు, పండ్లు ఇస్తారని, దీంతో తప్పనిసరిగా సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. వర్షాలు కురవకపోయినా దొనల్లో మాత్రం నీరు ఉంటుంది.

● నవగ్రహ మండపం ప్రత్యేకత

సిద్దేశ్వరకోన కొండరాళ్లలో నాగపడిగలు ఉన్నందున నాగ దోష నివారణకు రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఒక్కొక్క నవగ్రహానికి ఒక్కొక్క గుడిని నిర్మించారు. ప్రతి శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి నవగ్రహాలకు శాంతి పూజలు నిర్వహిస్తారు.



దక్షిణామూర్తి ఆలయ ముఖద్వారం

● ఆధ్యాత్మిక నిలయం దక్షిణామూర్తి ఆలయం

సిద్దేశ్వరకోనకు దక్షిణ దిశలో దక్షిణామూర్తి ఆలయం ఉంది. ఇక్కడ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. సిద్ధలకోనను దర్శించుకున్న భక్తులు దక్షిణామూర్తిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. కార్తీక మాసంలోనూ, ఇతర పండుగ రోజుల్లోనూ ఇక్కడ ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



గర్భాలయంలో దక్షిణామూర్తి

టీడీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

● మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని బలిజ (కాపు) భవన్‌లో డాక్టర్ పోకల రవి సహకారంతో బలిజ మెరిట్ విద్యార్థులకు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ 104 మంది బలిజ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు డాక్టర్ పోకల రవి రూ.4.80లక్షలు అందచేయటం అభినందనీయమన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదవే ఏకైక మార్గమన్నారు. కాపు భవన్‌లో మిగిలిన పనులన్నీ త్వరలో పూర్తి చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని మాటిచ్చారు. నెల్లూరు ప్రజలు అందించిన సహకారంతో చరిత్రలో నిలిచి పోయేలా రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, అళహరి సుధాకర్, బలిజ సామాజికవర్గ నాయకులు అనిల్‌కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు పురస్కారం అందచేస్తున్న మంత్రి నారాయణ

హాకీ క్రీడతో ఉజ్వల భవిత

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(విద్య), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడ అయిన హాకీలో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఆదివారం మొదలయ్యాయి. వాటిని అరుణమ్మ ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నూ ఉత్తమంగా రాణిస్తే ఎన్నో అవకాశాలను అందుకోవచ్చని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, డీఎస్‌డీవో ఆర్కే యతిరాజ్, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్ఐపీ ఎస్కే మహబూబ్‌బాషా, రాష్ట్ర పరిశీలకుడు రవిరాజ, విద్యా కమిటీ చైర్మన్ పెంచలయ్య, జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎస్ విజయ, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకుడు పీ థామస్‌పీటర్, జీడీ సురేష్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఉత్సాహంగా పోటీలు...

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తొలిరోజు పోటీల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు తలపడగా తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. ప్రకాశం, కర్నూలు జట్లు తలపడగా ప్రకాశం జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో నెల్లూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడగా పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించింది. ఈ పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పర్యవేక్షించారు.

కండలేరు నుంచి పైపులైను

ఎప్పటికి పూర్తయ్యేనో ?

● జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పనులు

● గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేటికీ పూర్తికాని వైనం

పొదలకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కండ లేరు నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా తాగు నీటిని అందించేందుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.3.93 కోట్లతో ప్రత్యేక పైపులైను నిర్మాణం చేపట్టింది. ఫిబ్ర వరిలో టెండర్ల పూర్తయి వేగంగా పనులు ప్రారంభమయ్యాయి. దీంతో తాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని పట్టణ ప్రజలు భావించారు.

● గత పాలకుల నిర్లక్ష్యం

వేసవిలో గ్రామీణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాల్సిన గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. లేదంటే ఎన్నికల సమయానికంటే ముందే పైపులైను నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. పనులు మందగించడంతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. మండలంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచినీటిని అందించేందుకు రూ.17.39కోట్లు మంజూరయ్యాయి. ఒక్క పొదలకూరు తాగునీటి అవసరాల కోసం రెండు పనులుగా రూ.2.42కోట్లు, రూ.1.51కోట్లు మంజూరు చేశారు. శరవేగంగా పనులను చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులను దిగుమతి చేయించారు. రాపూరు నుంచి పట్టణానికి పైపులైను నిర్మాణ పనులు 80 శాతం పూర్తి చేశారు. మర్రిపల్లి (దిగువ) గ్రామానికి కూడా మంచినీటిని సరఫరా చేసేందుకు గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను నిర్మించారు. పట్టణంలోని వినాయకమాన్యంలో ట్యాంక్‌ను నిర్మించి సుమారు 50 శాతం ప్రజలకు నీటి అవసరాల కోసం ప్రత్యేక పైపులైను ద్వారా కండలేరు జలాలను తీసుకొచ్చి సరఫరా చేసేందుకు అంచనా వేశారు. మిగిలిన 50 శాతం అవసరాల కోసం పట్టణంలో ఉన్న ట్యాంక్ నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 2020లోనే మండలంలో 34 గ్రామాలను ఎంపిక చేశారు. 27పనులకు సంబంధించి టెండర్లు పూర్తి చేశారు. వీటిలో కొన్ని పనులను అధికారులు పూర్తి చేశారు. ప్రస్తుతం కండలేరు పాత పైపు లైను నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నా కొంత కాలంగా సక్రమంగా అందడం లేదని పంచాయతీ పాలకులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న పైపులైను ఎప్పటికి పూర్తవుతుందోనని పట్టణవాసులు ఎదురుచూస్తున్నారు.



కండలేరు పైపులైను పనులు చేస్తున్న కూలీలు



కాకర్లవారి పాలెంలో డ్రైనేజీలను శుభ్రం చేయక పోవడంతో రోడ్లపైన పారుతున్న మురుగునీరు



వలేటివారిపాలెం పీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న కర్లవారిపాలెం జ్వరపీడితులు

● రోజురోజుకు పెరుగుతున్న కేసులు

● తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడుతున్న వైనం

● ఆందోళనలో జ్వరపీడితులు

అదుపులోకి రాని

విష జ్వరాలు

వలేటివారిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవారిపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో విష జ్వరాలు గత 20రోజుల నుంచి అదుపులోకి రావడం లేదు. వైరల్ ఫీవర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. జ్వరాలు తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెడుతున్నట్లు జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, జలుబు, తుమ్ములు, దగ్గు, శరీరంపై దద్దుర్లు వస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆ గ్రామాల్లో ఒక్కో ఇంటిలో ఇంటికొకరిద్దరు మరికొన్ని ఇళ్లలో ఇంటిల్లిపాది జ్వరపీడితులు మంచం పట్టారు. కాకర్లవారిపాలెం, అమ్మపాలెంలోని జ్వరపీడితులతో వలేటివారి పాలెం పీహెచ్‌సీ, ఆర్ఎంపీ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

● తగ్గుతున్న ప్లేట్‌లెట్లు

ఈ రెండు గ్రామాల్లోని జ్వర బాధితుల్లో చాలా మందికి ప్లేట్‌లేట్స్ తగ్గిపోతున్నాయి. చాలా మంది కందుకూరు, ఒంగోలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలు ఖర్చుచేసి చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారులు, వైద్యసిబ్బంది గ్రామాల్లో తూతూమంత్రంగా వైద్య శిబిరాల నిర్వహిస్తున్నారు.

● మొక్కుబడిగా పారిశుధ్య పనులు

ఈ రెండు గ్రామాల్లో పూర్తిస్థాయిలో దోమల నివారణ, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదు. మురుగుకాలువల్లో పూడికతీసి మురుగునీరు ముందుకు పోయేలా చర్యలు చేపట్టడం లేదు. ఈ సమస్యతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయడం లేదు. లార్వా దోమను నివారణకు ఎబెట్ ద్రావణంతో పిచికారీ చేయడం లేదు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టి జ్వరపీడితుల నుండి రక్తనమూనాలు సేకరించి రక్త పరీక్షలు నిర్వహించడం లేదు. అంతేగాకుండా తొట్టెలలో నీళ్లు లేకుండా, కొబ్బరిబోండాలు టైర్లలో నీళ్లు నిల్వ లేకుండా ప్లాస్టిక్, డిస్పోజల్ గ్లాసుల్లో నీరు నిల్వ లేకుండా అవగాహన కల్పించడం లేదు. జ్వరపీడితులకు ఒకట్రెండు టాబ్లెట్లు ఇచ్చి నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టి జ్వరాలు తగ్గేవరకు వైద్యశిబిరం నిర్వ హించాలని ప్రజలు కోరుతున్నారు.

15 రోజుల నుంచి జ్వరం తగ్గడం లేదు



కాకర్లవారిపాలెం ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగు కాలువల్లో చెత్త చెదారంతో నిండిపోయి మురుగునీరు ముందుకు పోవడం లేదు. దీంతో మురుగునీరు ఇళ్ల ముందు రోడ్డుపై నిలబడి ఉంది. 15రోజుల కిందట తనకు జ్వరం వచ్చి ఇప్పటికీ తగ్గలేదన్నారు. కాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు దద్దుర్లు వస్తున్నాయి. నాతో పాటు ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలతో చికిత్స పొందుతున్నారు.

- కారుమంచి అబ్రహాం, కాకర్లవారిపాలెం


కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు.



సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట పంచాయతీలోని ద్వారకానగర్‌లో వెలసిన శేషసాయినాథుడి మందిరంలో కార్తీక మాసతొలి ఆదివారపు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లూరు మండలం గోగులపల్లి, పురిణి, గద్దగగుంట, ఇందుపూరు గ్రామాల భజన బృందాలు చేసిన భజనలతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా కొండబిట్రగుంట మేకల మనోజ్, కుటుంబసభ్యులు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, అయ్యప్ప మాలధారులు, సాయి సేవకులు వెంకారెడ్డి, దాసరి శ్రీనివాసులు, సుభాషని, సుబ్రమణ్యం ఉన్నారు.

అన్నసంతర్పణ ప్రారంభం

కావలి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33వ వార్డు కలుగోళమ్మపేట అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మాలదారులకు అన్నసంతర్పణ ప్రారంభించారు. తొలి రోజు ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా అమరా సోదరులు వ్యవహరించారు. ఆయల కమిటీ బాధ్యులు అమరా వేదగిరి మాట్లాడారు. దాతల సహకారంతో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అన్నిరకాల మాల ధారులకు 45 రోజులు అన్నసంతర్పణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దుగ్గిశెట్టి నవీన్, మాధవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, శ్రీకాంత్ దంపతులు, బోగోలు తహసీల్దారు మలిశెట్టి సురేష్, మోదరస్ నరసింహారావు, శ్రీహరినాయుడు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధంతో ఎండుతున్న వరిపైరు

● ఆందోళనలో రైతులు



కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఎండుతున్న వరి పైరు

ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడంతో ఆరుగాలం కష్టించి సాగుచేసిన వరి పంటకు నీటి తడులు అందించలేక కళ్లెదుటే ఎండుముఖం పడుతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో గత 15 రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న సుమారు 15 ఎకరాల్లో సాగులో ఉన్న వరి చేలకు నీటి తడులు అందించలేక పొలం నెర్రెలుబారింది. వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉందని, మరికొన్ని రోజుల్లో పంట చేతికందుతుందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీటి తడులు అందించలేక పూర్తిగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి ఎండుతున్న వరి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ప్రాధాన్యత క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా కాలిపోయాయి. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నామని ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా తెలిపారు. గండిపాళెం గ్రామానికి సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

● ప్రమాదాల బారిన వాహన చోదకులు



కందుకూరు - పామూరు రోడ్డులో ఓ స్కూల్ క్యాంపస్ వద్ద ఇండికేటర్లు లేకుండా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిపై ఇండికేటర్లు లేకుండా ఇష్టారీతిగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు-పామూరు, కందుకూరు-గుడ్లూరు, కందుకూరు-కనిగిరి రహదారులలో పలుచోట్ల విద్యాసంస్థల నిర్వాహకులు, పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేశారు. కంకర, తారు మిశ్రమంతో పెద్దపెద్ద స్పీడ్ బ్రేకర్లు ఎవరి ఇష్టానుసారం వారు ఏర్పాటుచేసుకున్నారు. కానీ అవి కనిపించేలా ఎలాంటి ఇండికేటర్లు ఏర్పాటుచేయకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్లు రాత్రివేళల్లో సైతం వాహనదారులకు కనిపించేలా తెలుపు రంగు వేసి దానిపై స్పష్టంగా కనిపించే రంగుతో అడ్డంగా పట్టీలు వేయాల్సి ఉండగా ఎక్కడా ఇవి లేవు. దీంతో రాత్రివేళల్లో వేగంగా వచ్చే వాహనాలు స్పీడ్‌బ్రేకర్ల వద్ద ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల కనిగిరి రోడ్డులో ఓ స్పీడ్ బ్రేకరు వద్ద అదుపుతప్పిన ఇనుము లోడు ట్రాక్టరు కొద్ది దూరం వెళ్లి పడిపోగా అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నందున అవసరం లేనిచోట స్పీడ్ బ్రేకర్లను తొలగించటంతో పాటు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లకు ఇండికేటర్లు ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

కందుకూరి చంద్రమౌళి
జలవనరుల శాఖ ఏఈ, ఉదయగిరి



ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22, 23వ తేదీల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే సాగు నీటి సంఘాల ఓటర్ల జాబితాను సర్వేనెంబర్ల వారీగా రెవెన్యూ అధికారులకు అందజేశామని, త్వరలో తుది జాబితా ప్రకటిస్తామని జలవనరుల శాఖ ఏఈ కందుకూరి చంద్రమౌళి పేర్కొన్నారు.

? : మండలంలో ఎన్ని చెరువులు ఉన్నాయి.

!: 26 చెరువులు, ఒక జలాశయం ఉన్నాయి.

?: ఎన్నింటికి ఎన్నికలు జరగనున్నాయి.

!: మండలంలో 11 చెరువులకు, గండిపాళెం జలాశయం కింద 8 డిస్ట్రిబ్యూటరీలకు కలిసి మొత్తం 19 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

?: ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేశారా

!: ఆయా చెరువులు, జలా శయం కింద సాగులో ఉన్న భూముల సర్వేనంబర్లను రెవెన్యూ అధికారులకు పంపాం. వారిచ్చే నివేదిక ఆధారంగా ఆయా సర్వేనెంబర్లు ఎవరి సాగులో ఉన్నాయో గుర్తించి తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తాం.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కావలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్‌బిజ్లీ యోజన పథకం కింద విద్యుత్ వినియోగదారులు ప్రయోజనాలు పొంది అధిక వద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందవచ్చని కావలి విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డులోని స్పందన ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం దీనిపై వినియోగ దారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొని ఈ పథకంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సదస్సులో పాల్గొని ప్రయోజనం పొందాలన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు : డీఎం



బస్సుకు పూజలు నిర్వహిస్తున్న కార్మికులు

ఉదయగిరి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో అరుణాచలం బస్సు సర్వీసుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 10, 14, 17, 24వ తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఈ సర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, రానుపోను ఒక్కొక్కరికి టిక్కెట్టు ధర రూ.1,650 అని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి



మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి

ఆత్మకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర అపస్మా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షులు కోటేశ్వరరెడ్డి, వెంకటరత్నం, మాజీ అధ్యక్షులు జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బిట్రగుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు శ్రీవత్స చెస్ట్, చిల్డ్రన్స్ క్లినిక్ వైద్యులు కల్యాణి, చిరంజీవి తెలిపారు. బోగోలు మేజర్ పంచాయతీలోని షిర్డీ సాయిబాబా మందిర ఆవరణలో స్థానిక సామాజిక కర్త పసుపులేటి శేషయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 128మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కొర్రా చంద్రశేఖర్, ప్రైవేట్ వైద్యులు ఆనందసాగర్, శశికుమార్‌లతో పాటు వాకర్స్ గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, సాయి సేవకులు ఉన్నారు.

● సీతారామపురం: ఎల్వీఆర్ జూనియర్ కళాశాలలో 2002-2004 సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నెల్లూరు ఎనెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 350 పైగా ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని, ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, మోకాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఎన్ల్ హాస్పిటల్ డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ యాదవ్ కులారి తెలిపారు.

కార్తీకమాస పూజలపై ప్రచారం

లింగసముద్రం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజలు, దీపాలు వెలిగించడం వలన కలిగే లాభాలను త్రైత సిద్ధాంత సేవాసమితి, ఇందుజ్ఞానవేదిక దుత్తలూరి కమిటీ అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం మొగిలిచెర్ల, నారసింహాపురం, తాతాహోటల్, జంపాలవారిపాలెంలో ఆయన సమితి సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు సుధాకర్, నరసింహులు, నాగమ్మ, వెంకటసుబ్బమ్మ, రమణమ్మ, రమ్యశ్రీ, ప్రేమ్‌కుమార్, కొండారెడ్డి, కొండారెడ్డి, ధనమ్మ, కోటేశ్వరమ్మ, మమత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

అల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెర్లో సంఘంలో తిరంశెట్టి సంజీవయ్య, మండలంలోని బట్రకాగొల్లులో యద్దల శేఖర్‌లు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న అల్లూరు కెఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబసభ్యులకు రూ.3వేలు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఈ ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు.

చిన్నారులతో పుస్తక పఠనం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలపై విద్యార్థులకు మక్కువ పెరగాలనే తలంపుతో ప్రవేశపెట్టిన చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో నీతికథలు, జాతీయ నాయకుల జీవితచరిత్రలు పఠనం చేయించారు. ఉలవపాడు అనుబంధశాఖ చాకిచర్ల గ్రంథాలయంలో కూడా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కందుకూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా దామా కొండపనాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ధ్వజ స్తంభానికి మొక్కుతున్న సినీ నటుడు సుమన్

ఆలయాల్లో నటుడు సుమన్ పూజలు

త్రిపురాంతకం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్లను సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరునికి మహాన్యాసపూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవికి అర్చనలు చేశారు. అనంతరం స్థానిక వాసవీ అన్నసత్రంలో ఏర్పాటు చేసిన గౌడ కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి శాశ్వత ప్రాతిపదికన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని యర్రగొండపాలెం, కొమరోలు, కంభం, మార్కాపురం, గిద్దలూరు, దొనకొండ, ఒంగోలు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, అర్ధవీడు మండలాల్లో 72మంది టీచర్లు, పిల్లలు లేని పాఠశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని రెగ్యులర్ ప్రాతిపదికన పాఠశాలలకు సర్దుబాటు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.



మర్లపాడులో వేసిన పొగాకు నాట్లు

ముమ్మరంగా పొగాకు, వరి నాట్లు

టంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో పొగాకు, వరినాట్లు జోరుగా పడుతున్నాయి. చెరువులు, బోర్లు వసతులున్న గ్రామాల్లో వరి నాట్లు వేయిస్తున్నారు. గత ఏడాది పొగాకు ధరలు అనుకూలంగా ఉండడంతో ఈసీజన్‌లో పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండలంలో సుమారు 11వేల ఎకరాల్లో పొగాకు నాట్లు పడనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మండలంలోని పడమర గ్రామాల్లో పొగనాట్లు వేస్తున్నారు.

వరినాట్ల జోరు

ఈఏడాది వాతావరణం అనుకూలించి వర్షాలు పడడంతో వల్లూరు, వాసేపల్లిపాడు పంట చెరువులు నిండుకుండలా మారాయి. వీటి ఆధారంగా వరినాట్లు పడనున్నాయి. గత ఏడాది 500 ఎకరాల వరకు పరిమితమైన సాగు ఈసారి 1200 ఎకరాల వరకు పడే అవకాశముంది. వాసేపల్లిపాడు చెరువు నీటి ఆధారంగా 600 ఎకరాల్లో, వల్లూరు చెరువు నీటి ఆధారంగా 600 ఎకరాల్లో వరిసాగు కానుంది. వాసేపల్లిపాడు రైతులు దగ్గరలోని ఈతముక్కల చుట్టుపక్కల గ్రామాల్లో వరి నారు కొనుగోలు చేసి తెచ్చుకొని నాట్లు వేస్తున్నారు. వల్లూరు పంట చెరువు కింద రైతులు నార్లు పోసి మరీ నాట్లు వేస్తున్నారు. కొణిజేడు, కందులూరు, మర్లపాడు గ్రామాల్లో బోర్లు ఆధారంగా 100 ఎకరాల్లో వరి పంట సాగుకానుంది. మొత్తంగా పరిస్థితి చూస్తే మండలంలో విస్తృతంగా పొగాకు, వరి నాట్లు వేయించే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

హైవే నిర్వహణపై నిర్లక్ష్యం !

- ముగిసిన కాంట్రాక్టర్ నిర్వహణ బాధ్యతలు
- అస్తవ్యస్తంగా జాతీయ రహదారి
- ఓ వైపు బీటలు..మరో వైపు చిట్టడవిలా కంపచెట్లు
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నాగులుప్పలపాడు మండలంలోని జాతీయ రహదారి-216 నిర్వహణను ఆశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ గాలికొదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం త్రోవగుంట నుంచి దిగమర్రు వరకు చేపట్టిన రెండు వరుసల సిమెంట్ రోడ్డుతో కూడిన జాతీయ రహదారి నిర్మాణ పనులను దిలీప్ బిల్డ్‌కాన్ కంపెనీ పనులను దక్కించుకొని పూర్తిచేసింది. ఉప్పుగుండూరు సమీపంలో టోల్‌గేట్‌ను సైతం ఏర్పాటు చేసి రుసుం వసూలు చేసుకొంటున్నారు.



అసంపూర్తి పనులతో రహదారి పైకి వచ్చిన ముళ్లకంప చెట్లు

నాగులుప్పలపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మించిన కాంట్రాక్టరు కొన్నేళ్లపాటు ఆ రహదారి నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టరు హైవే-216 నిర్వహణ బాధ్యతలు ఈ ఏడాది జూన్ నాటికి ముగిసినట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి రహదారి నిర్వహణ పట్టించుకున్న నాథుడు లేక గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. వెరసి రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లు దాటి ముళ్లకంప, చెట్లు రోడ్డు పైకి పాకడంతో ఎదురుగా వాహనాలు వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డుమార్జిన్‌లోకి వెళ్లిన ద్విచక్ర వాహనదారులకు ముళ్ల కంపలు గీసుకొని గాయాలపాలవుతున్నారు. మార్జిన్‌లు సైతం గడ్డి,పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పలు చోట్ల రహదారికి పగుళ్లు వచ్చి ద్విచక్ర వాహనాల టైర్లు ఇరుక్కుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి పక్కన ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కంప చెట్లు కప్పేశాయి. ముళ్లకంపల మధ్య దర్శనమిస్తున్నాయి. దాంతో సూచిక బోర్డులు కనిపించక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త వారికి గ్రామాల వివరాలు, రోడ్డు పరిస్థితి తెలియక నానా తంటాలు పడుతున్నారు. డివైడర్లు ప్రమాదాలు జరిగిన సమయంలో పగిలిపోయి దెబ్బతిని ఉన్నాయి. పలు ప్రాంతాలలో డివైడర్లకు రేడియం స్టిక్కర్లు, రంగులు వెలసిపోయాయి. అటువైపుగా అధికారులు దృష్టి సారించకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి.



ముళ్లకంపల మధ్యలో సూచిక బోర్డు



మరమ్మతులకు నోచుకోని పగుళ్లిచ్చిన డివైడర్

మార్జిన్లలో సన్నటి రాళ్ల ,మట్టి పేరుకుపోయి ద్విచక్ర వాహనాలు పట్టు తప్పి కింద పడుతున్న సందర్భాలు అనేకం. సాధారణంగా రహదారి మార్జిన్లలో చేరిన మట్టి,రాళ్ల,ఇసుక లాంటి వాటిని ఎప్పటికప్పుడు కూలీలతో తొలగించాల్సి ఉంది. గుత్తేదారు నిర్వహణ సమయం ముగిసిన తర్వాత రహదారి నిర్వహణ బాధ్యతులు అధికారులు విస్మరించారు. ఓ వైపు రహదారికి ఇరువైపులా దట్టంగా అల్లుకుపోయిన ముళ్లకంప, అలాగే చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయి మరో వైపు బీటలు వారుతూ ఇది నిజంగా జాతీయ రహదారేనా అన్న సందేహం కలుగక మానదు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత రహదారి పరిస్థితి దృష్ట్యా ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని వాహనదారులు హడలెత్తుతున్నారు.

మమ.. అనిపించారు...

గత కొద్ది నెలల నుంచి జాతీయ రహదారి-216 నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇక హైవే అధికారులు కేవలం రహదారికి ఇరువైపులా ఎక్స్‌కవేటర్లతో చెట్లు తొలగించే పనిని చేపట్టారు. ఆయా పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపించిందన్న విమర్శలు ఉన్నాయి. రహదారికి ఇరువైపులా అసంపూర్తిగా ఎక్కడి చెట్లు అక్కడే వదిలేశారు. రోడ్డుపై పడిన బీటల వైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. రహదారి పక్కనున్న సూచిక బోర్డుల చుట్టూ కంప చెట్లు అలానే దర్శనమివ్వడం పట్ల అధికారుల పనితీరు అర్థమవుతుంది. మొత్తం మీద మమ అనిపించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి హైవేకు ఏర్పడిన బీటలు సరిచేసి రహదారి నిర్వహణ పనులను సంపూర్ణంగా నిర్వహించి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

అపార్ అవస్థలు

ముందుకు సాగని విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

తలలు పట్టుకుంటున్న టీచర్లు

ఒంగోలు విద్య, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, ఆధార్, యుడైస్‌లో విద్యార్థులకు సంబంధించి ఒకే సమాచారం ఉండాలన్న నిబంధన కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. తొలుత 9,10 తరగతుల వారికి మాత్రమే అపార్ ఐడీ అన్న ప్రభుత్వం తాజాగా 1 నుంచి 10వ తరగతి వరకూ చేయమనడంతో టీచర్లకు సమస్య మొదలైంది. విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్‌లో మరో విధంగా ఉన్నాయి. పుట్టిన తేదీ వివరాలు సచివాలయంలో ఇంకో రకంగా ఉన్నాయి. కొందరు విద్యార్థుల ఇంటి పేరు కూడా ఆధార్‌లో పూర్తిగా లేదు. ఈ సమాచారం సరిపోలక అపార్ రిజిస్ట్రేషన్ కోసం టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్‌లో విద్యార్థుల వివరాల్లో అక్షరం తేడా వచ్చినా అవి ఆమోదించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

అపార్ అంటే..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అవసరమని తేల్చిచెప్పింది. ఇప్పటికే విద్యార్థులకు పెన్ నంబర్లను కేటాయించగా కొత్తగా అపార్‌ను ప్రవేశపెట్టింది. ఈ నంబరు సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు నానా తిప్పలు పడుతున్నారు. అపార్ పేరుతో ఆన్‌లైన్‌లో ప్రతి విద్యార్థికి ఒక నంబరును కేటాయిస్తారు. అందులోనే ఆ విద్యార్థికి సంబంధించి విద్యా విషయాలు, నైపుణ్యాలు పొందుపరుస్తారు. ఈ నంబరు కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకొనేందుకు మూడు రకాల రికార్డుల్లో విద్యార్థుల వివరాలు ఒకే విధంగా ఉండాలి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఒకే విద్యార్థికి మూడు రకాల వివరాలు

ప్రస్తుతం పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారిలో కొందరి వివరాలు గందరగోళంగా ఉన్నాయి. ఒక విద్యార్థికి మూడు రకాల పుట్టిన తేదీలు ఉండటం సమస్యగా మారింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి 1వ తరగతిలో చేరేటప్పుడు తల్లిదండ్రులు చెప్పిన విధంగా ప్రధానోపాధ్యాయులు పుట్టిన తేదీ, ఇతర వివరాలను అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వాటినే హైస్కూలులో 6వ తరగతిలో చేరినప్పుడు అక్కడి అడ్మిషన్ రిజిస్టర్‌లోనూ కొనసాగిస్తారు. పంచాయతీ, మునిసిపాలిటీల్లో పిల్లల జనన రిజిస్టర్‌లో మరో పుట్టిన తేదీతో వారి వివరాలు నమోదవుతున్నాయి. ఆధార్ నంబరులో విద్యార్థుల పుట్టిన తేదీ లేకుండా కేవలం సంవత్సరం మాత్రమే నమోదై ఉంది. ఈనేపథ్యంలో పుట్టిన తేదీల్లో దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలో అర్థంకాక ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 9వ తరగతి వరకు పుట్టిన తేదీ మార్పే అధికారం డీఈవోలకు ఉంది. పదో తరగతి వారికి అయితే ఆర్‌జేడీ చేయాలి. అయితే ఆ వివరాలు మార్పుల కోసం అటు కార్యాలయాలు, అటు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రులు, టీచర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు.

పాతగొడవల నేపథ్యంలో యువకుడిపై హత్యాయత్నం

- ఇరువురు బీరు సీసాలతో దాడి
- ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఘటన
- విచారణ చేపట్టిన డీఎస్పీ

ఒంగోలు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై ఇరువురు యువకులు హత్యాయత్నం చేశారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఒంగోలు నగరం కొత్తకూరగాయల మార్కెట్ వద్ద జరిగింది. కలిసి మద్యం తాగుతూ ఉండగా వివాదం చెలరేగి ఇరువురు యువకులు బీరు సీసాతో మరో యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడి చేసిన వారిలో ఓ రౌడీషీటర్ కూడా ఉన్నాడు. వివరాలలోకి వెళితే..

స్థానిక మామిడిపాలెంలో నివాసం ఉంటున్న జమ్మలమూడి నాగవర్ధన్ శనివారం రాత్రి అద్దంకి బస్టాండ్‌లో తన భార్యను బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కించి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో కిరణ్ అనే స్నేహితుడు కొత్తమార్కెట్ వద్దకు వస్తానని ఫోన్ చేసి చెప్పగా కొద్దిసేపు వేచిఉన్నాడు. అనంతరం నడుచుకుంటూ వెళుతుండగా అక్కడ బండ్లమిట్టకు చెందిన చింపిరి బాలసాయిచంద్, గోపాల్‌నగరంనకు చెందిన ప్రభుకుమార్, మామిడిపాలెంనకు చెందిన రెబ్బవరపు మనోజ్, సత్యనారయణపురంనకు చెదిన సూర్యం కలిసి మద్యం తాగుదామంటూ నాగవర్ధన్‌ను పిలిచారు. దీంతో ఐదుగురు కలిసి కొత్తకూరగాయల మార్కెట్ మెయిన్ గేట్ లోపల మద్యం తారు. అయితే వారు ఇంకా మద్యం కావాలంటూ నాగవర్ధన్‌ను డబ్బులు అడిగారు. తన వద్ద లేవని చెప్పడంతో నాగవర్ధన్ జేబులు వెతికారు. మద్యం కోసం డబ్బులు అడిగితే లేవంటవా అంటు బాలసాయిచంద్, ప్రభుకుమార్ కలిసి నాగవర్ధన్‌పై దాడికి దిగారు. అంతేగాకుండా కులం పేరుతో దూషించారు. అనంతరం బీరు సీసాలు పగలకొట్టి విచక్షణ రహితంగా పొడిచారు. దీంతో నాగవర్ధన్ తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు హత్యాయత్నం నేరం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



చెరువుకట్ట కింద ఉన్న మర్రిచెట్టు



చెరువుకట్టపై ఉన్న రావిచెట్టు

కంభం చెరువుకే కాదు .. చెట్లకూ ఉంది ఓ చరిత్ర

కంభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన చారిత్రాత్మక కంభం చెరువుకే కాదు దాని సమీపంలోని చెట్లకు కూడా శతాబ్దాల నాటి చరిత్ర ఉన్నది. కట్టపై ఉన్న రావిచెట్టు, కట్ట కింద రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టు 500 ఏళ్ల నాటివి. రెండు కొండల మధ్య అత్యంత విశాలంగా బండరాళ్ల పెట్టి వాటి మధ్య సీసం కరిగించి కట్టను ఏర్పాటు చేశారు. దానిపై శ్రీకృష్ణదేవరాయులు భార్య రావి మొక్కను నాటి చుట్టూ అరుగు నిర్మించినట్లు, కట్ట కింద కూడా సేద తీరేందుకు మరో మర్రి మొక్కను నాటినట్లు చరిత్ర చెబుతోంది. నాడు నాటిన మొక్కలే నేడు మహా వృక్షాలై విశాలంగా విస్తరించాయి.



దగ్ధమవుతున్న కారు

పార్క్ చేసిన కారు దగ్ధం

ఒంగోలుక్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పార్కు చేసిన కారులో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఒంగోలు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేషగిరి కారును రోడ్డు పక్కన పార్కు చేసి విధి నిర్వహణకు వెళ్లారు. రాత్రి 7.30 గంటల సమయంలో కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దట్టంగా పొగ వ్యాపించింది. అక్కడ కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కారు దగ్ధమవుతోందని స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేశారు. దీంతో ఫైరింజన్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కారు సాంకేతిక లోపాల వల్ల దగ్ధమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం

- ఎమ్మెల్యే ఏలూరి
- టీడీపీ న్యూజిలాండ్ వెబ్‌సైట్ ప్రారంభం

పర్చూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం న్యూజిలాండ్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలసి హాజరయ్యారు.

ఈసందర్భంగా జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారన్నారు.

తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించిందని, ప్రజల ఆశయాలకు ఆకాంక్షకు అనుగుణంగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఏలూరి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో నిర్బంధించినప్పుడు 100 దేశాల్లో నిరసనలు చేపట్టారని, అందులో న్యూజిలాండ్ వారు ఉండడం మర్చిపోలేనిదన్నారు. అనంతరం న్యూజిలాండ్ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దుకూరి దిలీప్, పరతాపరెడ్డి, మజీద్ సామ్యూల్, జితేంద్ర, నిమ్మగడ్డ మమత పాల్గొన్నారు.



న్యూజిలాండ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, పక్కన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ